సోమవారం
9•9•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 75
• పేజీలు : 14 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

మంత్రులు - శాఖలు

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (ముఖ్యమంత్రి)
సాధారణ పరిపాలన, శాంతి భద్రతలు, రెవెన్యూ, నీటిపారుదలతోపాటు, మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు

మహ్మద్ మహమూద్ అలీ
హోం, జైళ్లు, అగ్నిమాపకం

తన్నీరు హరీశ్‌రావు, ఆర్థిక శాఖ

కే తారకరామారావు
ఐటీ, కమ్యూనికేషన్, పరిశ్రమలు, మున్సిపల్, పట్టణాభివృద్ధి

వేముల ప్రశాంత్‌రెడ్డి
ఆర్ అండ్ బీ, గృహనిర్మాణం, శాసనసభా వ్యవహారాలు

ఎర్రబెల్లి దయాకర్‌రావు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ

కొప్పుల ఈశ్వర్
ఎస్సీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమం

ఈటల రాజేందర్
వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం

అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
అటవీ, దేవాదాయ, న్యాయ, శాస్త్ర సాంకేతికం

జీ జగదీశ్‌రెడ్డి
విద్యుత్

ఎస్ నిరంజన్‌రెడ్డి
వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం, ఉద్యానవన, పట్టుపరిశ్రమ

వీ శ్రీనివాస్‌గౌడ్
ఎక్సైజ్, సాంస్కృతికం, పర్యాటక, క్రీడలు

టీ శ్రీనివాస్‌యాదవ్
పశుసంవర్ధకం, మత్స్య, పాడి పరిశ్రమ, సినిమాటోగ్రఫీ

సీహెచ్ మల్లారెడ్డి
కార్మిక, ఉపాధి కల్పన

పీ సబితా ఇంద్రారెడ్డి, విద్య

సత్యవతి రాథోడ్
ఎస్టీ, మహిళా శిశు సంక్షేమం

గంగుల కమలాకర్
బీసీ సంక్షేమం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు

పువ్వాడ అజయ్‌కుమార్, రవాణా

ఆదివారం రాజ్‌భవన్‌లో కే తారకరామారావు, హరీశ్‌రావులతో మంత్రులుగా ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్, సీఎస్ ఎస్కే జోషి ఉన్నతాధికారులు కూడా ఉన్నారు

పూర్తిస్థాయి కొలువు

కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

పాతకొత్తల మేలు కలయిక

- ఆరుగురు మంత్రులతో ప్రమాణంచేయించిన గవర్నర్
- మొదటగా హరీశ్, చివరగా అజయ్
- పవిత్ర హృదయంతో ప్రమాణంచేసిన కేటీఆర్
- దైవసాక్షిగా ప్రమాణంచేసిన మిగతా మంత్రులు

- కేటీఆర్‌కు తిరిగి ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖలు
- హరీశ్‌రావుకు ఆర్థికశాఖ
- విద్యాశాఖ మంత్రిగా సబితా ఇంద్రారెడ్డి
- జగదీశ్‌రెడ్డికి విద్యుత్‌శాఖ
- వేముల, కొప్పుల, నిరంజన్‌రెడ్డి, మల్లారెడ్డి శాఖల్లో కొన్ని బదలాయింపు
- గంగులకు బీసీ, పౌరసరఫరాలు
- సత్యవతికి ఎస్టీ, మహిళాశిశు సంక్షేమం
- అజయ్‌కుమార్‌కు రవాణా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర మంత్రివర్గంలో ఆరుగురు మంత్రులు కొత్తగా కొలువుదీరారు. మంత్రివర్గాన్ని పూర్తిస్థాయిలో విస్తరించాలని సీఎం కే చంద్రశేఖర్‌రావు తీసుకొన్న నిర్ణయం మేరకు ఆరుగురికి అవకాశం కల్పించారు. కొత్త మంత్రుల ప్రమాణంతో మంత్రిమండలిలో ఇప్పటివరకు ఉన్న మంత్రుల సంఖ్య 12 నుంచి 18కి పెరిగింది. ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కొత్త మంత్రులతో ప్రమాణం చేయించారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌లకు మంత్రివర్గంలో చోటుదక్కింది. ప్రమాణస్వీకార కార్యక్రమం పూర్తయిన కొద్దిసేపటికే మంత్రులకు శాఖల కేటాయింపు ఆనంతరం కేటీఆర్‌కు ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖలు కేటాయించగా, హరీశ్‌రావుకు ఆర్థికశాఖను కేటాయించారు. పాత మంత్రుల శాఖల్లో కొన్ని మార్పులు చేశారు.

కోలాహలంగా ప్రమాణస్వీకారం

ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగా నిర్ణయించిన మేరకు ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు రాజ్‌భవన్ దర్బార్‌హాల్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా

మిగతా 3వ పేజీలో

ఆదివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర కొత్త గవర్నర్‌గా ప్రమాణం చేసిన తమిళిసై సౌందర్‌రాజన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

గవర్నర్‌గా తమిళిసై ప్రమాణం

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే చౌహాన్

తరలివచ్చిన తమిళ నేతలు, ప్రముఖులు

బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్‌కు ఘనస్వాగతం పలికిన సీఎం కేసీఆర్

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర గవర్నర్‌గా తమిళిసై సౌందర్‌రాజన్ ప్రమాణం చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో.. ఉదయం 11 గంటలకు తమిళిసైతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ ప్రమాణం చేయించారు. మొదట తమిళిసైని తెలంగాణ గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి చదివి వినిపించారు. అనంతరం తమిళిసై దైవసాక్షిగా ప్రమాణంచేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. గవర్నర్‌కు పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ,

మిగతా 3వ పేజీలో

నేడు అసెంబ్లీలో బడ్జెట్

పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సీఎం కేసీఆర్

బడ్జెట్ సమావేశాలకు ముస్తాబైన అసెంబ్లీ

- శాసనమండలిలో ఆర్థికమంత్రి హరీశ్‌రావు
- ఉదయం 11.30 గంటలకు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- 2019-20 బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించిన క్యాబినెట్
  - వాస్తవ లెక్కల ఆధారంగా బడ్జెట్ రూపకల్పన
  - ఆర్థికమాంద్యం నేపథ్యంలో అంచనాలు
  - సంక్షేమం, సాగునీటి రంగాలకు అధిక ప్రాధాన్యం
  - అదనపు ఖర్చులను తగ్గించే అవకాశం
- బీఏసీలో సమావేశాలు జరిగే రోజుల నిర్ధారణ
- కట్టుదిట్టమైన భద్రతాపర్యాట్లు చేసిన పోలీసులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20) పూర్తిస్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నది. ఇందుకోసం బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభం కానున్నాయి. శాసనసభలో ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. శాసనమండలిలో ఆర్థికమంత్రి హరీశ్‌రావు బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. మార్చిలో ఆరునెలల కాలానికి చట్టసభల ఆమోదం పొందిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పరిమితి ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో.. అక్టోబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు ప్రతిపాదించిన పూర్తి బడ్జెట్‌ను ఉభయసభలు ఆమోదిస్తాయి. ఆదివారం రాత్రి ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. సాయంత్రం 4.15 గంటలకు రాజ్‌భవన్‌లో ఆరుగురు మంత్రుల ప్రమాణంతో పూర్తిస్థాయిలో ఏర్పడిన మంత్రివర్గం.. రాత్రి 7 గంటలకు తొలిసారి సమావేశమైంది. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన క్యాబినెట్ సమావేశంలో బడ్జెట్ పద్దులపై విస్తృతంగా చర్చించారు. బడ్జెట్ ప్రాధాన్యాలను సీఎం కేసీఆర్ మంత్రులకు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడిన నేపథ్యంలో వాస్తవ పరిస్థితులపై ఆధారపడి అంచనాలు రూపొందించిన విషయాన్ని తెలియజేశారు. అన్ని శాఖల పద్దులపై చర్చించిన తర్వాత 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌కు

మిగతా 3వ పేజీలో

ప్రతి గ్రాము పై అత్యధిక విలువ
కనిష్ట వడ్డీ రేటు
పాక్షిక చెల్లింపు మరియు పాక్షిక విడుదల సదుపాయం
ప్రాసెసింగ్ ఫీజు లేదు
24×7 ఆన్‌లైన్ గోల్డ్ లోన్ సదుపాయం
4,500 + శాఖలు

India's No.1
Most Trusted Financial Services Brand
(2016 - 2019)
Power of Trust
TRA's Brand Trust Report

99469 01212
Muthoot Finance
A Muthoot M George Enterprise



ప్రముఖ న్యాయకోవిదుడు
జెఠ్మలానీ కన్నుమూత
అనారోగ్యంతో తుదిశ్వాస
రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ సంతాపం
అభిమానుల అశ్రునయనాల మధ్య ఢిల్లీలో అంత్యక్రియలు

5

విక్రమ్ దొరికింది

చంద్రుడిపై ల్యాండర్ జాడను గుర్తించిన ఆర్బిటార్

- అనుసంధానం కోసం ప్రయత్నిస్తున్నాం
- ఉపరితలాన్ని ఢీకొట్టడం వల్లే సంకేతాలు బంద్
- ఇస్రో చైర్మన్ శివన్ ప్రకటన
- అనుసంధానం కష్టమేనంటున్న నిపుణులు

బెంగళూరు, సెప్టెంబర్ 8: దేశం మొత్తాన్ని రెండు రోజులుగా ఉత్కంఠకు గురిచేస్తున్న చంద్రయాన్-2లోని 'విక్రమ్' ల్యాండర్ ఆచూకీ దొరికింది. చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్ జాడను గుర్తించామని ఇస్రో చైర్మన్ కే శివన్ ప్రకటించారు. ల్యాండర్ చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టడం వల్లే సంకేతాలు నిలిచిపోయి ఉంటాయని చెప్పారు. శివన్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రుడి చుట్టూ కక్ష్యలో తిరుగుతున్న ఆర్బిటార్‌లోని హై రెజొల్యూషన్ కెమెరా ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ థర్మల్ ఇమేజ్‌లను చిత్రీకరించిందని తెలిపారు. ల్యాండర్‌తో అనుసంధానం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రెండు మూడు రోజుల్లో ఫలితం ఉండొచ్చని ఆశాభావం వ్యక్తంచేశారు. అయితే కొందరు నిపుణులు మాత్రం ల్యాండర్‌తో అనుసంధానం దాదాపు అసాధ్యమని చెప్తున్నారు. ఇప్పటివరకు లభించిన సమాచారం ప్రకారం ప్రజ్ఞ రోవర్ ఇంకా ల్యాండర్ లోపలే ఉన్నదని శివన్ తెలిపారు. ప్రణాళిక ప్రకారం ల్యాండర్ జాబిల్లిపై సున్నితంగా దిగాల్సి ఉన్నదని, కానీ అదుపుతప్పి అధిక వేగంతో

మిగతా 5వ పేజీలో

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

ఫారం ధర	70.00	రిటైల్ లైవ్	92.00
డ్రెస్‌డ్	132.00	స్కిన్‌లెస్	152.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)

హైదరాబాద్	322.00	రంగారెడ్డి	322.00
మెదక్	322.00	కరీంనగర్	325.00
వరంగల్	325.00	చిల్లర ధర	3.80

అండ్రెస్కు అద్భుతం

- యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన బియాంక
- ఫైనల్లో సెరెనాపై జయభేరి
- ఈ ఘనత సాధించిన తొలి కెనడా ప్లేయర్‌గా రికార్డు
- విజేతకు 27.59 కోట్ల రూపాయల ప్రైజ్‌మనీ

8

గోదావరి ఉగ్రరూపం

- లక్ష్మీబరాజ్‌కు రికార్డు స్థాయిలో ప్రాణహిత వరద
- 84 గేట్లు ఎత్తి దిగువకు నీటివిడుదల
- దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 88 మీటర్ల ప్రవాహం
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

కృష్ణాలో భారీగా ఇన్‌ఫ్లోలు

7

ఆల్మట్టి నుంచి రెండు లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
శ్రీశైలానికి రెండున్నర లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

epaper.ntnews.com

ఆదివారం ప్రమాణ స్వీకారం అనంతరం రాజ్‌భవన్‌లో నూతన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, వీ శ్రీనివాస్‌గౌడ్, ఈటల రాజేందర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్‌కుమార్, తన్నీరు హరీశ్‌రావు, మహమూద్ అలీ, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ గ్రూప్ ఫొటో

బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ తమిళిసైకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ భర్త సౌందర్‌రాజన్, నగర మేయర్ బొంతు రామ్మోహన్

గవర్నర్ తమిళిసై కూతురు శుగంతన్‌కు ఆశీస్సులు అందిస్తున్న సీఎం కేసీఆర్

ఆదివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా తమిళిసై సౌందర్‌రాజన్‌తో ప్రమాణం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్. చిత్రంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కూడా ఉన్నారు.

రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తమిళనాడు డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం, రాష్ట్ర స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు, ఇతర ప్రముఖులు

రాష్ట్రానికి సేవచేస్తా

ట్విట్టర్‌లో ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి సేవచేసేందుకు తన పట్ల విశ్వాసం ఉంచి మరోసారి మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు.. ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మంత్రిగా ప్రమాణంచేసిన అనంతరం ట్విట్టర్ ద్వారా స్పందించారు. తనను ప్రజాప్రతినిధిగా ఎన్నుకున్నందుకు సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రానికి శక్తివంచన లేకుండా చిత్తశుద్ధితో సేవచేస్తానని పేర్కొన్నారు.

బొకేలు, శాలువాలు వద్దు

మంత్రిగా ప్రమాణంచేసిన తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికీ కేటీఆర్ ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారెవరూ బొకేలు, శాలువాలు తీసుకురావద్దని, అందుకు బదులుగా మొక్కలు నాటాలని లేదా ముఖ్యమంత్రి సహాయనిధికి తోచినంత సహాయం చేయాలని కేటీఆర్ సూచించారు.

మరోసారి నిబద్ధత చాటుకున్న కేటీఆర్

చేనేత వస్త్రాలు ధరించి ప్రమాణ స్వీకారం

రాష్ట్రమంత్రిగా ఆదివారం రెండోసారి ప్రమాణంచేసిన కే తారకరామారావు మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గత ప్రభుత్వంలో చేనేత, జౌళిశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో చేనేత వస్త్రాల పట్ల మరింత అవగాహన పెంచేందుకు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలని 'హ్యాండ్లూమ్ మండే' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ప్రతిసోమవారం కచ్చితంగా ఆచరించడంతోపాటు పండుగలు, బర్త్‌డే వంటి ప్రత్యేక సందర్భాల్లోనూ చేనేత వస్త్రాలనే ధరించి ఆదర్శంగా నిలుస్తున్నారు కేటీఆర్. ఆదివారం అయినప్పటికీ తన ప్రమాణ స్వీకారానికి కేటీఆర్ చేనేత వస్త్రాలు ధరించి హాజరయ్యారు.

ఆదివారం రాజ్‌భవన్‌లో మంత్రులుగా ప్రమాణంచేస్తున్న సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్‌కుమార్

మంత్రులుగా ప్రమాణం చేసేందుకు బయలుదేరేముందు ప్రగతిభవన్‌లో కేటీఆర్, హరీశ్‌రావుకు హారతి ఇచ్చి తిలకం దిద్దుతున్న మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

మంత్రివర్గంలో సామాజిక సమతూకం

- అన్ని జిల్లాలకూ ప్రాతినిధ్యం
- ఇద్దరు మహిళలకు అవకాశం
- టీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు, వర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమతూకాన్ని పాటించారు. క్యాబినెట్‌లో ఉమ్మడి పది జిల్లాలకూ చోటు కల్పించడంతోపాటు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, ఓసీలకు ప్రాతినిధ్యం లభించేలా చూశారు. బీసీ సామాజిక వర్గాలకు చెందిన ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌లకు ఇప్పటికే మంత్రివర్గంలో చోటుకల్పించిన సీఎం కేసీఆర్.. తాజాగా అదే సామాజికవర్గానికి చెందిన గంగుల కమలాకర్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఎస్టీ సామాజికవర్గం నుంచి లంబాడీ తెగకు చెందిన సత్యవతి రాథోడ్‌కు స్థానం కల్పించారు. ఇద్దరు మహిళలకు మంత్రివర్గంలో స్థానమిచ్చారు.

అన్ని ఉమ్మడి జిల్లాలకూ ప్రాతినిధ్యం

రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి (పాత) జిల్లాలకూ క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లభించింది. తొలిదశలో ప్రాతినిధ్యం లేని ఖమ్మం జిల్లా నుంచి ఈసారి పువ్వాడ అజయ్‌కుమార్‌కు చోటు లభించింది. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి తన్నీరు హరీశ్‌రావుకు తాజాగా మరోసారి అవకాశమిచ్చారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన చూస్తే దాదాపుగా అన్ని జిల్లాలకు మంత్రి పదవులు లేదా మంత్రి హోదా ఉన్న చీఫ్ విప్, విప్ పదవులు దక్కాయి.

కరీంనగర్ జిల్లా నుంచి అత్యధికులు

మంత్రివర్గంలో అత్యధికులు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాగా ఉమ్మడి కరీంనగర్ చోటు దక్కించుకుంది. ఇప్పటికే ఇద్దరు మంత్రులు (ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్) ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ జిల్లా నుంచి తాజాగా కేటీఆర్, గంగుల కమలాకర్‌కు స్థానం కల్పించారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి నలుగురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల నుంచి ఇద్దరికి చోటు దక్కింది.

మంత్రివర్గంలో ఇద్దరు ఎమ్మెల్సీలు

ప్రస్తుతం మొత్తం 17 మందితో కూడిన రాష్ట్ర మంత్రివర్గంలో ఇద్దరు శాసనమండలి సభ్యులున్నారు. వీరిలో హోంశాఖ మంత్రిగా ఉన్న మహమూద్‌అలీ రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికవగా.. తాజాగా చోటు దక్కించుకున్న సత్యవతి రాథోడ్ ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. మంత్రులతోపాటు అదే హోదా చీఫ్ విప్, విప్‌లను కలిపి చూస్తే రాష్ట్రంలోని అన్ని ప్రధాన సామాజికవర్గాలకు క్యాబినెట్‌లో చోటు లభించింది. బీసీల్లో బలమైన సామాజికవర్గానికి చెందిన గంప గోవర్ధన్‌కు, ఎస్టీల్లో కోయ సామాజిక వర్గానికి చెందిన రేగా కాంతారావుకు, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన బాల్క సుమన్, గువ్వల బాలరాజుకు స్థానం దక్కింది.

మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్

అసెంబ్లీలో మాట ఇచ్చిన ప్రకారం సీఎం కేసీఆర్ రాష్ట్ర మంత్రివర్గంలో ఇద్దరు మహిళలకు చోటుకల్పించి తన మాట నిలబెట్టుకున్నారు. మంత్రివర్గంలో కనీసం ఒక్క మహిళనైనా చోటు కల్పించాలని గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలువురు సభ్యులు కోరగా.. ఒకరు కాదు ఇద్దరు మహిళలకు మంత్రి పదవి ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీ మేరకు ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణలో సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌లకు అవకాశమిచ్చారు.

కొత్త మంత్రుల వివరాలు

కల్వకుంట్ల తారక రామారావు

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, శోభ దంపతుల కుమారుడైన కల్వకుంట్ల తారక రామారావు 1976 జూలై 24న జన్మించారు. మైక్రో బయాలజీలో ఎమ్మెస్సీతోపాటు, ఎంబీఏ చదివిన ఆయనకు భార్య శైలిమ, పిల్లలు హిమాన్షు, ఆలేఖ్య ఉన్నారు. 2009లో సిరిసిల్ల నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి 2010 లో జరిగిన ఉపఎన్నికల్లో గెలుపొందారు. 2014, 2018లోనూ వరుసగా అదే నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారు. 2014 నుంచి 2018 వరకు రాష్ట్రమంత్రిగా పనిచేశారు. ఐటీ, పంచాయతీరాజ్, పరిశ్రమలు, పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2018 డిసెంబర్ 14న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు.

తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట ఎమ్మెల్యేగా రికార్డు మెజార్టీతో విజయం సాధించిన తన్నీరు హరీశ్‌రావు తల్లిదండ్రులు లక్ష్మీబాయి, సత్యనారాయణ. 1972 జూన్ 3న జన్మించిన ఆయనకు భార్య శ్రీనిత, పిల్లలు అర్పిస్మన్, వైష్ణవి ఉన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని కళాశాలలో పాలిటెక్నిక్ చదివారు. 2004లో సిద్దిపేట నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల్లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో యువజన సర్వీసులు, క్రీడలశాఖ మంత్రిగా పనిచేశారు. 2008లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరితో కలిసి రాజీనామా చేశారు. అనంతరం ఉపఎన్నికల్లో గెలుపొందారు. 2009 సార్వత్రిక ఎన్నికలు, 2010లో జరిగిన ఉపఎన్నికల్లో విజయం సాధించారు. 2014, 2018లోనూ వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 2014 నుంచి 2018 వరకు మంత్రిగా పనిచేశారు.

భూక్యా సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ జిల్లా, కురవి మండలం, పెద్దతండాకు చెందిన భూక్యా సత్యవతి రాథోడ్ తల్లిదండ్రులు గుగులోత్ లింగ్యానాయక్, దస్మీ. 1969 అక్టోబర్ 31న జన్మించిన ఆమె భర్త దివంగత భూక్యా గోవింద్ రాథోడ్. కుమారులు సునీల్‌కుమార్, సతీశ్‌కుమార్ ఉన్నారు. 1984లో టీడీపీ ద్వారా రాజకీయంలోకి ప్రవేశించిన సత్యవతి రాథోడ్ 1987లో భద్రాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా నియమితులయ్యారు. 1989లో టీడీపీ తరపున డోర్నకల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. 1995లో గుండ్రాతిమడుగు సర్పంచ్‌గా, 2006లో నర్సింహులపేట జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 2009లో డోర్నకల్ నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికై తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2014లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2019లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

గంగుల కమలాకర్

కరీంనగర్‌కు చెందిన లక్ష్మీనర్సమ్మ, మల్లయ్య కుమారుడైన గంగుల కమలాకర్‌కు భార్య రజిత, పిల్లలు హరిహరణ్, జాహ్నవి ఉన్నారు. 1968 మే8న జన్మించిన ఆయన బీటెక్ (సివిల్) చదివారు. 2000-2005 వరకు కరీంనగర్ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా పనిచేసిన కమలాకర్ 2005 నుంచి 2009 వరకు కరీంనగర్ నగరపాలక సంస్థ కార్పొరేటర్‌గా ఉన్నారు. 2009లో కరీంనగర్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2018 ఎన్నికల్లో విజయం సాధించి కరీంనగర్ అసెంబ్లీ నియోజకర్గం నుంచి హ్యాట్రిక్ సాధించిన తొలిఎమ్మెల్యేగా నిలిచారు.

పువ్వాడ అజయ్‌కుమార్

రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన పువ్వాడ అజయ్‌కుమార్ 1965 ఏప్రిల్ 19న జన్మించారు. తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు సీపీఐ పార్టీలో కీలక నేత, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేశారు. అజయ్‌కు తల్లి విజయలక్ష్మి, కుమారుడు నయన్‌రాజ్ ఉన్నారు. అగ్రికల్చర్ ఎమ్మెస్సీలో గోల్డ్ మెడలిస్ట్ అయిన అయాన మమత హాస్పిటల్, మమత మెడికల్ కాలేజీ చైర్మన్‌గా ఉంటూనే 2012లో వైఎస్సార్సీపీ నుంచి రాజకీయరంగ ప్రవేశం చేశారు. 2013లో కాంగ్రెస్‌లో చేరి 2014లో ఖమ్మం నుంచి ఆ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 2016లో టీఆర్ఎస్‌లో చేరారు. 2018లో టీఆర్ఎస్ నుంచి పోటీచేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి

ఉమ్మడి ఏపీ మాజీమంత్రి, దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి సతీమణి సబిత. వెంకటమ్మ, మహిపాల్‌రెడ్డి దంపతులకు 1963 మే 5న జన్మించారు. కుమారులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి ఉన్నారు. బీఎస్సీ వరకు చదివారు. ఇంద్రారెడ్డి మరణం తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన సబిత 2000లో చేవెళ్ల నుంచి మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లోనూ చేవెళ్ల నుంచి విజయం సాధించి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2009లో మహేశ్వరం నుంచి గెలుపొందిన ఆమె ఏపీ తొలి మహిళా హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2014 ఎన్నికల్లో ఓటమి చెందగా.. 2018లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం టీఆర్ఎస్‌లో చేరారు.

ఆదివారం తెలంగాణభవన్‌లో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొంటున్న టీఆర్ఎస్ శ్రేణులు

టీఆర్ఎస్‌లో నూతనోత్సాహం

- మంత్రివర్గ విస్తరణతో మిన్నంటిన సంబురాలు
- మహిళా నాయకుల డ్యాన్సులు
- డప్పు చప్పుళ్లు, పటాకుల హోరు

హైదరాబాద్/సిరిసిల్ల రూరల్/గంభీరావుపేట, నమస్తే తెలంగాణ: తెలంగాణలో అత్యంత ఉత్సాహంగా జరుపుకొనే దసరా, దీపావళి పండుగలు టీఆర్ఎస్ శ్రేణులకు ముందే వచ్చాయి. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర మంత్రివర్గాన్ని విస్తరించి అత్యంత కీలక పదవులన్నీ ఒకేరోజు భర్తీచేయడంతో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో సరికొత్త ఉత్సాహం కనిపిస్తున్నది. తాము నమ్ముకున్న నాయకులను సీఎం కేసీఆర్ గుర్తించి పదవులు ఇవ్వడంతో రాజధాని హైదరాబాద్‌తోపాటు వివిధ జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో పటాకులు పేల్చి, మిఠాయిలతో సంబురాలు జరుపుకొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని చెపుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించగలమని ధీమా వ్యక్తంచేస్తున్నారు.

తెలంగాణభవన్‌లో..

టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయమైన తెలంగాణభవన్‌లో సంబురాలు మిన్నంటాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచే అనేకమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణభవన్‌కు తరలివచ్చి మిఠాయిలు పంచుకొన్నారు. డప్పు చప్పుళ్లు, పటాకుల పేలుళ్లతో తెలంగాణభవన్, ఆ పరిసర ప్రాంతాలు హోరెత్తాయి. మహిళా నాయకులు డ్యాన్సులతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు సంబురాల్లో పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంతోపాటు ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, టీఆర్ఎస్ నేత తలసాని సాయికిరణ్‌యాదవ్, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కట్టెల శ్రీనివాస్‌యాదవ్, పలువురు మహిళా కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండోసారి మంత్రిగా ప్రమాణం చేయడంతో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు ముస్తాఫానగర్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలు పటాకులు పేల్చి హర్షం వ్యక్తం చేశారు. ముస్తాఫానగర్ గ్రామ టీఆర్ఎస్‌శాఖ అధ్యక్షుడు మారవేని కృష్ణమూర్తియాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబురాల్లో పార్టీ మండల నేతలు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి, బరిగెల అభిలాష్, పాపాగారి వెంకటస్వామిగౌడ్, రాగిశెట్టి నారాయణ, బండ సతీశ్, బండి శ్రీమతి, బండ రమేశ్, బాలెల్లయ్య తదితరులు పాల్గొన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద టీఆర్ఎస్ నేతలు పటాకులు కాల్చి మిఠాయిలు పంచారు. తంగళ్లపల్లిలో టీఆర్ఎస్‌వై జిల్లా నేత సిలువేరి చిరంజీవి ఆధ్వర్యంలో పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. టీఆర్ఎస్‌వై గ్రామశాఖ అధ్యక్షుడు జంగపల్లి శ్రీనివాస్, కార్యకర్తలు ఆత్మకూరి యాదగిరి, నాయినివేణు, శ్రీనివాసరెడ్డి, తిరుపతి, బండి ప్రవీణ్, నవీన్, భాస్కర్ పాల్గొన్నారు.

రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో పటాకులు కాలుస్తున్న టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ముహూర్తం

సూర్యోదయం: 6.07 గంటలకు

సూర్యాస్తమయం: 6.20 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం ఏకాదశి, నక్షత్రం: పూర్వాషాఢ ఉదయం 8.37 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 7.38 నుంచి 9.10 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.49 నుంచి మధ్యాహ్నం 12.38 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.04 నుంచి 3.53 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.28 నుంచి రాత్రి 7.04 వరకు.

లోకం పోకడ

అడగ్గానే ఓటీపీ ఇచ్చి చచ్చాను..
వాళ్లు పంపించిన గిఫ్టు ఇదిగో..

ఆదివారం రాత్రి ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న అసెంబ్లీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, విప్‌లు గొంగిడి సునీత, బాల్క సుమన్, గువ్వల బాలరాజు, రేగా కాంతారావు, మండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, విప్‌లు కర్నె ప్రభాకర్, కే దామోదర్‌రెడ్డి, ఎమ్మెస్ ప్రభాకర్‌రావు

పూర్తిస్థాయి కొలువు

కొత్త గవర్నర్ తమిళిసైకి ఆదివారం రాజ్‌భవన్‌లో పుష్పగుచ్ఛం అందజేస్తున్న తమిళ నాడు డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం. చిత్రంలో సీఎం కేసీఆర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు

ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో మంత్రులు కే తారకరామారావు, తన్నీరు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్‌కుమార్

గవర్నర్‌గా తమిళిసై ప్రమాణం

మొదటి పేజీ తరువాయి...

మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, చామకూర మల్లారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, తన్నీరు హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.జోషీ, డీజీపీ మహేందర్‌రెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొని గవర్నర్‌ను, ఆమె భర్త డాక్టర్ సౌందర్‌రాజన్‌ను అభినందించారు. తమిళిసై కూతురు శుగంతన్‌ను సీఎం సహా పలువురు ఆశీర్వదించారు. తమిళనాడు డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వంతోపాటు ఆ రాష్ట్రానికి చెందిన మంత్రులు వేలుమణి, తంగమణి, సినీనటి రాధిక, శరత్‌కుమార్ ఇతర ప్రముఖులు రాజ్‌భవన్‌కు తరలివచ్చారు.ఒకరకంగా రాజ్‌భవన్ తెలుగు, తమిళ సంస్కృతి సమ్మేళనంగా కనిపించింది. ముఖ్యమంత్రి కేసీఆర్,

రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైని ఆశీర్వదిస్తున్న యాదాద్రి ఆలయ అర్చకులు

తమిళనాడు డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ కొద్దిసేపు ముచ్చటించారు.

బేగంపేటలో ఘనస్వాగతం

అంతకుముందు ఉదయం 9 గంటల ప్రాంతంలో తమిళిసై సౌందర్‌రాజన్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విమానంలో బేగంపేట విమానాశ్రయానికి వచ్చారు. బేగంపేటలో తమిళిసైకి ఘనస్వాగతం లభించింది. సీఎం కేసీఆర్ ఆమెకు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతించారు. ప్రొటోకాల్ ప్రకా రం తమిళిసై బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్‌తోపాటు పలువురు ప్రముఖులు నూతన గవర్నర్‌కు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

గవర్నర్ ప్రమాణ స్వీకారానికి హాజరైన నటులు రాధిక, శరత్‌కుమార్ దంపతులు

మొదటి పేజీ తరువాయి...

హరీశ్‌రావుతో గవర్నర్ ప్రమాణం చేయించారు. ఆ తరువాత వరుసగా కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్‌కుమార్‌తో ప్రమాణం చేయించారు. కేటీఆర్ పవిత్ర హృదయంతో ప్రమాణం చేయగా, మిగతా మంత్రు లు దైవసాక్షిగా ప్రమాణం స్వీకరించారు. ప్రమాణం తరువాత మంత్రులంతా సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్‌తోపాటు రాష్ట్ర మంత్రులు, టీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేత కే కేశవరావు, మంత్రులు, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, సంతోష్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్‌రాములు, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు తదితరులు తరలివచ్చారు.

తిలకం దిద్ది..

మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజ్‌భవన్‌కు వెళ్లే ముందు కేటీఆర్, హరీశ్‌రావుకు ప్రగతిభవన్‌లో కుటుంబసభ్యులు తిలకం దిద్ది, హరతిచ్చి పంపించారు. సీఎం కేసీఆర్ సతీమణి, కేటీఆర్ తల్లి శోభమ్మ, సోదరీమణులు మాజీ ఎంపీ కవిత, సౌమ్య, కూతురు అలేఖ్య, భార్య శైలిమ కేటీఆర్‌కు హారతి ఇచ్చి, తిలకం దిద్దారు. కేటీఆర్‌తోపాటు మంత్రిగా ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న హరీశ్‌రావుకు కూడా హారతిచ్చి, నుదుట తిలకం దిద్దారు. అనంతరం కేటీఆర్ తల్లి శోభమ్మ.. బావ, బావమరుదులిద్దరినీ దీవించి పంపించారు. నేతలిద్దరు ఒకే కారులో ప్రగతిభవన్ నుంచి రాజ్‌భవన్‌కు వచ్చారు. వేదిక వద్ద ఇద్దరు పక్కనే కూర్చున్నారు. దర్బార్‌హాలు వద్దకు కేటీఆర్ రాగానే అభిమానులు పెద్దఎత్తున కేటీఆర్ జిందాబాద్, ఫ్యూచర్ లీడర్ కేటీఆర్, జై రామన్న అంటూ నినాదాలు చేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతున్నప్పుడు కూడా జై కేటీఆర్ అంటూ నినాదాలు చేస్తుండటంతో సీఎంకేసీఆర్ చేయలేపి నినాదాలు ఆపాలని సైగచేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన తరువాత సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులందరూ గవర్నర్ తమిళిసైతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

శాఖల కేటాయింపు పూర్తి

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అనంతరం కొత్త మంత్రులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శాఖలను కేటాయింపును పూర్తిచేశారు. సీఎం సూచనల మేరకు ఆయా మంత్రులకు శాఖలను గవర్నర్ తమిళిసై కేటాయించినట్లు రాజ్‌భవన్ ప్రకటన విడుదలచేసింది. కొత్తగా ప్రమాణంచేసిన మంత్రుల్లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖలు ఇచ్చారు. హరీశ్‌రావుకు ఆర్థికశాఖ కేటాయించారు. మహిళా మంత్రుల్లో సబితా ఇంద్రారెడ్డికి విద్యాశాఖ, సత్యవతి రాథోడ్‌కు గిరిజన, మహిళా శిశు సంక్షేమశాఖలను అప్పగించారు. పాత మంత్రుల్లో జీ జగదీశ్‌రెడ్డి నిర్వహించిన విద్యాశాఖను.. సబితాఇంద్రారెడ్డికి ఇచ్చి.. ఆయనకు గతంలో నిర్వహించిన విద్యుత్‌శాఖను మళ్లీ కేటాయించారు. కొప్పుల ఈశ్వర్ ఇప్పటివరకు నిర్వహిస్తున్న శాఖల్లో బీసీ సంక్షేమాన్ని గంగుల కమలాకర్‌కు, ఎస్టీ సంక్షేమశాఖను సత్యవతి రాథోడ్‌కు కేటాయించారు. మరోమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వద్ద ఉన్న రవాణాశాఖను పువ్వాడ అజయ్‌కి అప్పగించారు. సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వద్ద ఉన్న పౌరసరఫరాలశాఖను గంగుల కమలాకర్‌కు కేటాయించారు. చామకూర మల్లారెడ్డి వద్ద ఉన్న మహిళా శిశు సంక్షేమశాఖను సత్యవతి రాథోడ్‌కు కేటాయించారు.

ముగ్గురు మొదటిసారి మంత్రులు

క్యాబినెట్ విస్తరణలో మొదటిసారి మంత్రులైనవారు ముగ్గురున్నారు. కరీంనగర్ ఎమ్మె ల్యే గంగుల కమలాకర్, గిరిజన నాయకురాలు ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ తొలిసారి మంత్రి పదవులు పొందారు. కేటీఆర్, హరీశ్‌రావు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండోసారి మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. సబితా ఇంద్రారెడ్డి ఉమ్మడిరాష్ట్రంలో రెండుసార్లు మంత్రిగా పనిచేశారు.

మండలి చైర్మన్ పదవికి గుత్తా నామినేషన్ నేడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనమండలి చైర్మన్ పదవి కోసం గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మండలి చైర్మన్ ఎన్నిక కోసం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయగా, సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. చైర్మన్ ఎన్నికను ఈ నెల 11న అధికారికంగా ప్రకటించనున్నారు. మండలి చైర్మన్‌గా స్వామిగౌడ్ పదవీకాలం ఇటీవల ముగియడంతో కొత్త చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, మూడుసార్లు ఎంపీగా పనిచేసిన గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయనకున్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొన్న సీఎం కేసీఆర్.. గుత్తాను మండలి చైర్మన్‌గా ఎంపికచేశారు.

క్యాబినెట్‌లో అవకాశం రావడం నా అదృష్టం

- రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ క్యాబినెట్‌లో అవకాశం రావడం తన అదృష్టమని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడానికి కష్టపడి పనిచేస్తానన్నారు. తనపై సీఎం కేసీఆర్ పెట్టుకున్న నమ్మకాన్ని ఎన్నటికీ మరిచిపోనని తెలిపారు. మొదట్నుంచి పార్టీలో మంత్రి కేటీఆర్ తనను ఎంతగానో ప్రోత్సహించారని తెలిపారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి పూర్తిస్థాయిలో పాటుపడతానని చెప్పారు. టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని అజయ్‌కుమార్ పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ నమ్మకాన్ని వమ్ముచేయను

- బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని బీసీసంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను టీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తనని చెప్పారు. ఇరవై ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్న తనకు మంచి అవకాశం లభించిందని సంతోషం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన శాఖకు న్యాయం చేస్తానన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో తన వంతు కృషిచేస్తానని తెలిపారు. తన ఊపిరి ఉన్నంతవరకూ టీఆర్ఎస్ కోసమే పనిచేస్తానని పేర్కొన్నారు.

బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆదివారం అసెంబ్లీ వద్ద పోలీసు బందోబస్తు. ప్రగతిభవన్‌లో క్యాబినెట్ సమావేశం అనంతరం బయటకు వస్తున్న సీఎం కేసీఆర్, మంత్రులు మహమూద్‌అలీ, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, శాసనమండలి విప్ కే దామోదర్‌రెడ్డి, అసెంబ్లీ విప్ రేగా కాంతారావు

నేడు అసెంబ్లీలో బడ్జెట్

మొదటిపేజీ తరువాయి...

ఆమోదం తెలిపారు.

పక్కా ప్రణాళికతో బడ్జెట్ రూపకల్పన

భారీ అంచనాలకు ఆస్కారంలేకుండా వాస్తవ లెక్కల ఆధారంగా బడ్జెట్‌ను పక్కాగా రూపొందించినట్లు సమాచారం. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం ప్రభావం.. తగ్గుతున్న కేంద్ర ప్రభుత్వ పన్నుల వాటా.. పతనమైన దేశ జీడీపీ వృద్ధిరేటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని బడ్జెట్ ప్రతిపాదనలను తయారుచేశారు. ఆర్థిక సంవత్సరం ఆఖరునాటికి ఎదురయ్యే సానుకూల, ప్రతికూల ఆర్థికపరిస్థితులను విశ్లేషించి పైసాపైసకూ లెక్కగట్టి పక్కా ప్రణాళికతో బడ్జెట్‌కు తుదిరూపమిచ్చారు. ఆర్థిక వృద్ధిరేటుపై మాంద్యం ప్రభావం పడుతుండటం వల్ల ఓట్‌ఆన్ అకౌంట్ కంటే కొంతమేర అంచనాలను తగ్గించినట్లు తెలుస్తున్నది. మార్చిలో మొత్తం 1,82,017కోట్ల రూపాయలతో ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. పూర్తి బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని కొంత కుదించవచ్చని సమాచారం. తెలంగాణ రాష్ట్రం ప్రతి సంవత్సరం సొంత రాబడులలో సగటున 17 శాతం నుంచి 19శాతం వృద్ధిరేటును సాధిస్తూ ఇతర రాష్ట్రాల కంటే అగ్రస్థానంలో నిలుస్తున్నది. ఈసారి ఆర్థిక మాంద్యం నీలినీడలు అన్ని రాష్ట్రాలపైన కమ్ముకొన్నాయి. ఇప్పుడిప్పుడే మన రాష్ట్రంపైనా దాని ప్రభావం పడుతున్నది. రవాణారంగంలో రాబడి తగ్గింది. జీఎస్టీ, వ్యాట్ పన్నుల రాబడి వృద్ధిరేటు లోనూ తగ్గుదల కనిపిస్తున్నది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలోనే కొంత రాబడులు వస్తున్నాయి. ఈ ప్రభావం రాబోయే ఆరునెలల కాలానికి ఏ మేరకు ఉంటుందనే విషయాన్ని అంచనావేసి బడ్జెట్ లెక్కలు రూపొందించారు. మరోవైపు కేంద్ర పన్నుల వాటా క్రమంగా తగ్గుతున్నది. సుమారు 20వేల కోట్ల రూపాయల వరకు రాష్ట్ర ఖజానాకు రావాల్సిన పన్నుల వాటా 18 వేల కోట్ల రూపాయల లోపు తగ్గుతున్నదని అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, గ్రాంట్-ఇన్-ఎయిడ్ నిధులలోనూ కోత మొదలైంది. మరో ఆరునెలల్లో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఏ మేరకు తగ్గుతాయో అంచనావేసి.. ఆ పరిస్థితిని ఏ విధంగా అధిగమించాలనే వ్యూహంతో బడ్జెట్‌ను రూపొందించారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా సాగునీరు.. సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చే అవకాశం కనిపిస్తున్నది. సంక్షేమరంగానికి రూ.45 వేల కోట్లు.. వ్యవసాయం, సాగునీటికి మరో రూ.60 వేల కోట్ల వరకు కేటాయించే పరిస్థితి ఉన్నది. ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌లో రూ.32,815 కోట్లుగా ఉన్న పెట్టుబడి వ్యయంలో మార్పు ఉండకపోవచ్చని తెలుస్తున్నది. కొన్ని రకాల అదనపు ఖర్చులను తగ్గించవచ్చని సమాచారం. ముఖ్యమంత్రి సూచన మేరకు భారీ అంచనాలకు పోకుండా వాస్తవ లెక్కల ఆధారంగానే పూర్తి బడ్జెట్ రూపకల్పన జరిగిందని అధికారులు చెప్తున్నారు. బడ్జెట్‌లో ప్రగతి పద్దు (స్కీమ్ ఎక్స్‌పెండిచర్)కు, నిర్వహణ పద్దు (ఎస్టాబ్లిష్‌మెంట్ ఎక్స్‌పెండిచర్) కు సంబంధించిన పూర్తి వివరాలను రూపొందిస్తున్నారు.

అసెంబ్లీ సమావేశాలపై సమీక్ష

సోమవారం ఉదయం 11.30 గంటలకు ఉభయసభల బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. సభ ప్రారంభంకాగానే మొదట బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. సమావేశాల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సభలు ప్రశాంతంగా జరిగేలా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పోలీసు అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. మంత్రులు, సభ్యులకు ట్రాఫిక్, భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలో సోమవారం జరిగే బీఏసీ సమావేశంలో ఖరారు కానున్నది. బడ్జెట్ సమావేశాల్లో మొదటిరోజు గవర్నర్ ప్రసంగించడం సంప్రదాయం. మార్చిలో జరిగిన సమావేశాల్లో గవర్నర్ ప్రసంగించడంతో ఈ సభల్లో ఆ అవసరం ఉండదు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సభ్యుల మధ్య సమన్వయం చేయడానికి శాసనసభ, మండలిలో కీలకమైన చీఫ్ విప్, విప్‌లను సీఎం కేసీఆర్ ఇప్పటికే నియమించారు.

కొనసాగుతున్న అల్పపీడనం

- వచ్చే మూడ్రోజులు ఓ మోస్తరు వానలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్తర ఛత్తీస్‌గఢ్ దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కూడా కొనసాగుతున్నదని, ఇది ఎత్తుకు వెళ్లేకొద్దీ దక్షిణం వైపు మరలుతుందని చెప్పారు. రాగల మూడ్రోజుల వరకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు.

నేడు గ్రేటర్ హైదరాబాద్‌కు వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుండటంతో సోమవారం గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట, శాయంపేట, ములుగు, ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురుసింది.

మెడికల్ పీజీ ప్రవేశాల్లో నీట్ కటాఫ్ సడలింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ - 2019 మార్కుల కటాఫ్‌నకు సడలింపునిచ్చారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఆయా మెడికల్ పీజీ కోర్సుల్లో ఖాళీలు ఎక్కువగా ఉండటంతో కటాఫ్‌ను సడలించారు. సీటీవీఎస్ కార్డియాలజీలో 20 శాతం, యూరాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరోసర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ విభాగాల్లో 40 శాతానికి తగ్గించారు. ప్రవేశాలకు ఈ నెల 12న అభ్యర్థులు కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించిన దేవీప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/సైదాబాద్: రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ విసిరిన గ్రీన్ చాలెంజ్‌ను రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ స్వీకరించారు. గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా ఆదివారం మలక్‌పేటలో మొక్కలు నాటారు. రాష్ట్రాన్ని ఆకుపచ్చతెలంగాణగా మార్చేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, నాగోల్ కార్పొరేటర్ సంగీత ప్రశాంత్‌గౌడ్, తెలంగాణ అసెంబ్లీ అసిస్టెంట్ సెక్రటరీ సుధాకర్, టీఆర్టీయూ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి మధుకిరణ్‌కు గ్రీన్‌చాలెంజ్ విసిరారు.

పంచాయతీల్లో ప్రణాళికా సైన్యం

- ప్రతి పంచాయతీలో 60 మందితో కమిటీలు
- స్వచ్ఛంద సంస్థలు, యువత, విద్యాపంతులకు చోటు
- గ్రామాల్లో మొదలైన 30 రోజుల ప్రణాళికాపనులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేపట్టిన '30 రోజుల ప్రణాళిక' పనులు మొదలయ్యాయి. తొలుతగా పారిశుద్ధ్య పనులను చేపడుతున్నారు. ఇప్పటికే పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.203 కోట్లు, రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఎస్ఎఫ్‌సీ) నుంచి రూ.136 కోట్లను విడుదల చేశారు. మరోవైపు రాష్ట్రంలోని 12 వేలకుపైగా పంచాయతీల్లో ప్రణాళికాసైన్యం రంగంలోకి దిగింది. గ్రామాల్లోని స్వచ్ఛంద సంస్థలు, యువత, విద్యావంతులతో నాలుగు కమిటీలు వేశారు. శనివారం తొలిరోజున ప్రత్యేకాధికారులతో కలిసి పంచాయతీ పాలకవర్గాలు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కమిటీల సభ్యులు గ్రామంలో పాదయాత్ర చేపట్టి అత్యవసరంగా చేయాల్సిన పనులను గుర్తించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

ప్రతి పంచాయతీలో నాలుగు స్క్వాండింగ్ కమిటీలను ఏర్పాటుచేసి.. ఒక్కో కమిటీలో 15 మంది చొప్పున సభ్యులను నియమించారు. చిన్న గ్రామాల్లో 15 మంది, పెద్ద పంచాయతీల్లో 20 మంది చొప్పున కమిటీల్లో నియమించి.. ఒక్కో గ్రామంలో 60 నుంచి 65 మంది చొప్పున ప్రణాళికాసైన్యంలో భాగస్వాములై చేశారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించే పనుల్ని కూడా చేపట్టారు.

పంచాయతీలకు డిజిటల్ 'కీ'

పంచాయతీరాజ్ నూతన చట్టం ఆధారంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్‌పవర్ కల్పించారు. గ్రామానికి వచ్చే ప్రతి పైసా సద్వినియోగం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొన్నది. గ్రామపంచాయతీల్లో చేపట్టే పనులకు ఇకనుంచి డిజిటల్ 'కీ' ద్వారా చెల్లింపులు జరుగనున్నాయి. ఫోర్జరీలతో నిధులు స్వాహాచేసే యత్నాలకు తావుండదు. ఇకపై ఏ పనికి ఎంత చెల్లించాలనేది స్పష్టంగా నమోదుచేసి నిధులు విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు పంచాయతీల్లో చెక్కుల ద్వారా చెల్లింపులు జరిగేవి. ఇకముందు డిజిటల్ 'కీ' తో నిధులు విడుదల అవుతాయి. ఆన్‌లైన్‌లో నమోదుచేసిన సర్పంచ్, ఉపసర్పంచ్‌ల డిజిటల్ సంతకాలను సరిపోల్చుకొని పంచాయతీ అధికారుల నుంచి అనుమతి పొందిన తరువాత డిజిటల్ 'కీ' వస్తుంది. ఈ 'కీ' ని ఆయా పంచాయతీలకు సంబంధించిన ట్రెజరీలకు సమర్పిస్తారు.

THE TELANGANA STATE DAIRY DEVELOPMENT CO-OPERATIVE FEDERATION LIMITED
Milk Products Factory, Hyderabad – 500 017. Email ID: gmmpfnyd.tsddcf@gmail.com
e-Procurement
Tender Notice No: 240 /G.M / MPF / HYD /2019 Date: 28.08.2019
Technical cum Commercial Tenders are invited from the experienced and reputed firms for the following work through e-procurement platform @ www.tender.telangana.gov.in.

Tender No.	Tender Description
240	Storage of Butter in their –20°C Butter deep Freezers on annual Rate Contract Basis for a period of two (2) years.

Start of downloading bid documents will commence from 09.09.2019. For further details please contact Mobile No. 9032369758.
Sd/- Managing Director

OSG UNIVERSITY
Established under Government of Andhra Pradesh Act 3 of 2016 & Recognized under Section 2 (f) of UGC Act 1956.
NH -16, Viswakarma Nagar, Edugundlapadu, Ongole-523262, Andhra Pradesh
MBBS ADMISSION NOTICE- 2019 -20
Applications are invited for MBBS Course available seats, from NEET (UG) 2019 passed candidates. last date for admission is 30-09-2019.
Applications through online will be received till 5 pm 25-09-2019.
MCI etc Regulators Recognition is not required for Universities to offer any Course as per Honourable Supreme Court Judgement Dt:- 29-08-2019 in W. P. (C) NO: 1510 of 2018.
Paramedical & Health Science Courses:
For various Paramedical & Health Science Courses
please submit application online, for details. www.osguniversity.com,
Call : 6302247893, 6303755433, 6302255487, 6303098003, 9959983622
Separate hostel for Boys / Girls.
Registrar

మహాకవి కాళోజీ

కాళోజీ కవనాలు
వ్యథభరితపు గానాలు
తెలంగాణ నేలపైన
ఉదయించిన కిరణాలు

మనయాస మనభాష
కాళోజీ కవిఘోష
ప్రజాక్షేమము కొరకు
పోరాడెను హమేష

వాడియైన మాటలతో
కవిత్వమను ఈటెలతో
దుమ్ములేపె కాళోజీ
సిరాచుక్క మెరుపులతో

పేదవాళ్ళ కష్టము
తన కవితల కిష్టము

కాళన్న పుస్తక సిరి
తరగనిదని స్పష్టము

కాళోజీ జన్మదినము
తెలంగాణ భాషదినము
మాతృభాష ప్రేమికులకు
అదే కదా పర్వదినము

– వడిచర్ల సత్యం, 9441350137

తెలుగు నేల మీద కాళోజీది విలక్షణ స్వరం. కవిత్వంలోగాని, జీవితంలోగాని, వ్యక్తిత్వంలోగాని అటువంటి ప్రత్యేకశైలి మరెవరికి సాధ్యపడలేదు. 'అనితర సాధ్యం నా మార్గం' అని చెప్పుకున్న శ్రీశ్రీని అనుకరించబోయిన ఉదాహరణలయినా చెప్పవచ్చు గానీ, కాళోజీని అనుసరించే సాహసోదంతాలు కనిపించవు. పోలిక కూడా దొరుకదు. కాళోజీకి సాటి కాళోజే.



బతుకును ఆరాధించిన భావుకుడు

కాళోజీది బతుకు తత్వం. 'బతుకుతూ బతుకనివ్వు'మనే సిద్ధాంతం. తెలంగాణలో 'బతుకు'ని పూజించే ఉత్సవం 'బతుకమ్మ' నుంచి స్ఫూర్తి గ్రహించవచ్చు. 'అల్బర్ట్ స్విట్జర్' భావించిన Reverence of Life నుంచి ప్రేరణ పొందవచ్చు. బతుకునే పరమ ప్రమాణంగా భావించి బతుకంతా బతుకు కోసం గానం చేసిన కవి కాళోజీ. బతుకే భగవంతుడనీ, ఇచ్ఛయే ఈశ్వరుడనీ సంపూర్ణంగా విశ్వసించాడు. కనుకనే బతుకు కోసం నిలబడ్డాడు. సామాన్యుల బతుకు కోసం కలెబడ్డాడు. బతుకును సిద్ధాంతీకరించాడు. కవిత్వీకరించాడు.

'సాగిపోవుటె బతుకు ఆగిపోవుటె చావు
సాగిపోదలచిన ఆగరాదిచటిపుడు
తొలిగి తోవెవడిమ్ము-తోసుకొనిపోవలయు
బతుకు పోరాటము-పడకు ఆరాటము..'

ఇంత సులువైన మాటల్లో బతుకును సూత్రబద్ధం చేయటం కాళోజీకే సాధ్యం. ఆగకుండా ముందుకు సాగిపోవటమే 'బతుక'ని నిర్వచించటం ఒకటయితే, బతుకు నిత్యపోరాటంగా గుర్తించిన తర్వాత పక్కకు తొలిగి ఎవరూ తోవ ఇవ్వరని, ఎవరికి వారు తోసుకొని పోవలసిందేనని నిర్ధారించి, మరొక జీవన సత్యాన్ని ఉపదేశించాడు. కాళోజీ అధ్యయనంలో అందుకున్నదెంతో అనుభవం ద్వారా అందుకున్నది అంతకంటే ఎక్కువ.

'బతుకును కష్టతరం చేసేది విజ్ఞానం. మూలమునుక్లిష్ట తరం చేసేది వ్యాఖ్యానం' అని ప్రకటించాడు. శాస్త్ర విజ్ఞానం చాలా ప్రగతి సాధించి ఉండవచ్చు. సాంకేతిక విజ్ఞానం మరింత వృద్ధి చెంది ఉండవచ్చు. ఇవన్నీ 'బతుకు'ను సులభం చేయటానికే తోడ్పడాలని ఆయన భావించాడు. అదే ధోరణిలో పోలిక చెప్తూ మూల రచనను మరింత క్లిష్టంగా మారుస్తున్న వ్యాఖ్యానాల తీరు మీద విసురు విసిరాడు. సూటిగా చెప్పటం, సులువుగా బతుకటం కాళోజీకి ఇష్టం. అట్లా అని స్పందనలు, భావోద్వేగాలు లేని బతుకును కోరుకోడు.

'భావుకత లేకుంటే బండబారును బతుకు' కనుక బతుకులో **'భావుకత'** ఉండాలని భావించాడు. కంచం, మంచం పద్ధతి బతుకు బతుకే కాదని నిరసించాడు కూడా. సంపాదనతో మాత్రమే బతుకు సాఫీగా సాగదని సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పాడు. **'జీవితమున మజా అంతా జీవిత్తముతోనే కాదు. ప్రమిదను ముంచెడి తైలము ప్రజ్వలింపలేదొత్తి'**ని అని ప్రకటించాడు. శబ్ద చమత్కారం కాళోజీకి ఇష్టమే. ప్రయోజనానికి అర్థం కలిగించేంత వరకు ప్రయోగిస్తాడు. 'జీవితం' మాటను చమత్కరించి 'జీవిత్తము' అన్నాడు. 'విత్తము' డబ్బు. సంపద జీవితాన్ని ఇవ్వలేవని సారాంశం. దానికి మంచి పోలిక చెప్పాడు. దీపం మునిగిపోయేంత నూనె వత్తిని వెలిగించలేని విధంగానే అధిక సంపాదన జీవితాన్ని సుఖపెట్టలేదనే అంతరార్థాన్ని ధ్వనిస్తాడు. భావుకత లేకుంటే ఇంత జీవ వైవిధ్యం, సుఖం, ఇన్ని రుచులు, ఇన్ని కళలు మానవున్ని సుసంపన్నం చేసేవి కావని, వీటన్నిటి కలయికతోనే కళకళలాడితేనే బతుకు మహోత్తేజకరమని కాళోజీ భావన.

> **'భావుకత లేకుంటే బండబారును బతుకు' కనుక బతుకులో 'భావుకత' ఉండాలని భావించాడు. కంచం, మంచం పద్ధతి బతుకు బతుకే కాదని నిరసించాడు కూడా. సంపాదనతో మాత్రమే బతుకు సాఫీగా సాగదని సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పాడు. 'జీవితమున మజా అంతా జీవిత్తముతోనే కాదు. ప్రమిదను ముంచెడి తైలము ప్రజ్వలింపలేదొత్తి'ని అని ప్రకటించాడు. శబ్ద చమత్కారం కాళోజీకి ఇష్టమే.**

సంపన్నుడి తత్వాన్ని సరిచేస్తూనే సామాన్యుని మనస్తాపాన్ని సరిచేయటం కాళోజీ ప్రత్యేకత. దిగులు, రంది, విచారం, కలత బతుకును కబళిస్తాయని, అవి వదులుకొని సాగమని అందరిని ఉత్సాహపరుస్తాడు. **'దిగులుతో బతికే బతుకు బతుకే గాదు. భ్రాంతిలో ఎరుక ఎరుకే గాదు. బతుకదలిస్తే దిలాసాగా బతుకాలె. భ్రాంతిలేని ఎరుకతో బతుకాలె'**. ప్రేమ, కరుణ, దుఃఖం, ఆగ్రహం, సంస్కారం, బంధం వంటి భావోద్వేగాలతో, ప్రశ్న, నిరసన, ఉద్యమం, హక్కులు, బాధ్యతలు, సమాజం, విలువలు వంటి భావ చైతన్యాలతో నిండి ఉప్పొంగుతుంటుంది గనుక కాళోజీ బతుకును ఆరాధించాడు. ఇవన్నీ లోపించిన, నిస్సారంలో ఆయాసపడుతున్న యాంత్రికంగా పరిణమించి బతుకును వదులుకుంటున్న వర్తమాన తరానికి కాళోజీ బతుకు ఉత్సాహాన్ని నూరిపోస్తాడు.

కాళోజీకి మనుషులంటే బహు ప్రేమ. మనిషి స్వప్నించే సమస్త కళా సంపద మీద ప్రేమ. అయితే.. పని మీద అంతకంటే ఎక్కువ పట్టింపు. పనినీ, కళల్నీ, మనుషుల్నీ, విలువల్ని పక్కకుపెట్టే రాజకీయాల మీద ఏవగింపు. అక్షరాల్ని అభిమానించకముందు విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో ముందున్నాడు. గణేశ్ చవితికి సెలవివ్వకపోతే వెయ్యికి పైగా లేఖలు రాయించి సెలవు తీసుకోగలిగిన చైతన్యంతో పెరిగాడు. వందేమాతర నినాదంతో విద్యార్థుల్ని వీధుల్లో ఊరేగించగలిగిన సమూహ సందర్భాలున్నాయి. స్వాతంత్ర్యం కోసం చౌరస్తాలో ఒక్కడే నిలబడి కరపత్రాలు పంచిన ఒంటరి మొండితనమూ ఉన్నది. ఆర్య సమాజం ప్రేరణతో మతమార్పిడులను ఎదుర్కొని అన్యమతం నుంచి తిరిగి తమ మతంలోకి మార్చగల తెగువ కాళోజీకి సొంతం. ఆంధ్రమహాసభలో ప్రవేశించి ఉత్సాహంగా భాగం పంచుకొని రెండుగా చీలుతున్న సన్నివేశాన్ని నివారించటానికి ఆరాటపడ్డ ఆవేదన వుంది. స్టేట్ కాంగ్రెస్‌లో చేరి గాంధీ అహింసా వ్రతంతో సాగినా, స్థానిక పరిస్థితుల్లో రజాకార్ల హింసనెదుర్కొవటానికి అవసరహింసను అక్షరాలకెత్తిన ఆవేశమూ ఆగ్రహమూ ఉన్నాయి. విశాలాంధ్రను ఆహ్వానించిన కంఠంతో అనుభవం నేర్పిన పాఠం తర్వాత ప్రత్యేక తెలంగాణ కోసం పలుకులై దూకగల సాహసం, ఎమర్జెన్సీని నిరసించి అజ్ఞాతంలోకి వెళ్లగల నిబద్ధ నిజాయితీ, రాజ్య హింసకు వ్యతిరేకంగా ప్రతిహింసను ప్రవచించి, ప్రతిహింస రాజ్యాంగహింసగా మారి పరిధులను దాటితే తిరుగబడి ఎదురాడే తర్కం, ధైర్యం.. ఏది గమనించినా, ఎటు నుంచి ఎటు పరిశీలించినా కాళోజీ వ్యక్తిత్వం అతనికి మాత్రమే సాధ్యమైన మహత్వం.

ఆచార్య నరేంద్రదేవ్ బోధనలు, గాంధీ సిద్ధాంతం, మార్క్సిస్టు అవగాహన, రూసో భావత్రయం, మత సంస్కృతుల మూలాలు, సూఫీ భావనలు, తత్వవేత్తల సామాన్యత, మహాకవుల భావుకత, త్యాగపురుషుల ధార్మికత, వైతాళికుల దార్శనికత.. ఎన్నెన్నో కలెగలిసి చిలికితే కాళోజీ ఆలోచన. నిండు మనిషి ఆవిష్కరణ.

'నేను కమ్యూనిస్టు వలె చెపుతున్నా, నేను సోషలిస్టుగ మాట్లాడుతున్న, నేను హిందువుగ ఈ విషయం చెపుతున్న అంటరు గని, మరి-మనిషి వలె ఆలోచించేదెప్పుడు..?' అని కాళోజీ తరచుగా సంధించిన ప్రశ్న. అన్ని మార్పులకు మూలం మనిషే. అన్ని అఘాయిత్యాలకు కారకుడు మనిషే. అధికార నియంతృత్వాలు మనిషే. ఉద్యమాలు, ఉద్రేకాలు మనిషే. మనిషిలోని పలు కోణాలను కవిత్వ రూపంలో కాళోజీ ఆవిష్కరించాడు.

'మనిషి ఎంత మంచివాడు
చనిపోయిన వాని చెడును
వెనువెంటనే మరుస్తాడు
కని మంచిని తలుస్తాడు..'

మనిషిలోని మంచితనాన్ని గర్తించేది మనిషే. కీర్తించేది మనిషే. ఆ విశేష స్వభావాన్ని వర్ణించి వదిలేసే తత్వం కాదు కాళోజీది. మళ్లీ అంతలోనే మనిషి రెండో కోణాన్ని వివరిస్తాడు.

'మనిషి ఎంత చెడ్డవాడు
బతికి ఉన్నవాని మంచి
గుర్తించడు కాని వాని
చెడును వెతికి కెలుకుతాడు..'

మనిషిలోని వైరుధ్యాల్ని కవి దర్శించాడు. మంచీచెడుల్ని వివేచన చేయటం ఒకటయితే.., చిత్రమేమిటంటే చనిపోయిన మనిషిలోని చెడును వదిలేసి మంచిని తలుచుకోవట

> **కాళోజీకి కవిత్వ నిర్వచనాల పట్ల, సాహిత్య విశ్లేషణల పట్ల ఆసక్తి లేదు. 'మానవ జీవితానికి ఒక కచ్చితమైన నిర్వచనం, ఒక కచ్చితమైన పద్ధతి లేనట్లే.. సాహిత్యానికీ లేదు. ప్రతీ సాహిత్య ప్రస్థానీ, ఒక కచ్చిత ప్రత్యేక 'కమిటెడ్ లేదా కట్టుబడ్డ మనిషి రచయిత కాలేడు' 'కట్టుబడిన రచయిత తన రచన ద్వారా మహా అయితే కంపెనీ వస్తువుల'ను విరివిగా అమ్మటానికి ఉపయోగపడే మంచి పోస్టరు సృష్టించగలడు. మంచి పోస్టరుగా ఉపయోగపడగలడు.. అంతే అని బాహాటంగా ప్రకటించగల శక్తి కాళోజీకి మాత్రమే సొంతం.**

మానవుడే మనీషి మనుగడకు మూలం
మానవుడే మనీషి మనుగడకు మూలం
మానవుడే మనీషి మనుగడకు మూలం
మానవుడే మనీషి మనుగడకు మూలం

అవనిపై జరిగేటి అవకతవకలు చూసి
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు..'

మొత్తం కాళోజీ కవిత్వానికి, హృదయానికి అద్దంపట్టే పంక్తులివి. వ్యక్తిగత ఔన్నత్యం కాళోజీ నిఘంటువులో లేనే లేదు. గొప్ప కవిత్వం సృజించాలని కోరుకున్నదీ లేదు. తన తోపాటు ఇతరులు సౌఖ్యంగా ఉండాలి. బతికే అవకాశాలు అందరికీ సమానంగా ఉండాలని భావించాడు. లోకంలో అల్లుకుపోయిన మోసాల్ని, మాయల్ని చూసి విలపించాడు. జరుగుతున్న అవకతవకలను సవరించాలని ఆరాటపడ్డాడు. గొంతెత్తి అరిచాడు. కలమెత్తి చరిచాడు.

నిజాం రాజయినా వదలలేదు. భారత రాష్ట్రపతి అయినా వదలలేదు. ముఖ్యమంత్రి అయినా విడువలేదు. మోసం చేసిన ఉద్యమ నేతయినా విడువలేదు. ఎంతటిస్థానంలో ఉన్నా వెరువకుండా కాళోజీ వకల్తా తీసుకున్నది 'సామాన్యుడు'. కాళోజీ మాటల నిండా హోరెత్తేది పౌరుడు. అక్షరాల పొడుగునా కదం తొక్కిందంతా ప్రజ. మంచి సమాజ నిర్మాణం, మానవ సంస్కార ప్రేరణం కాళోజీ తత్వానికి, వ్యక్తిత్వానికి, కవిత్వానికి అంతిమలక్ష్యాలు. **'కాళోజీ అనునది. కాలమునకే గాదు. మహాకాలునకు'జీ'అనునిది నభరాలు లేనట్టిది. నాజూకు కానట్టిది. నానా భావనలది. నానా భావన లేనిది. ఎదచించుకు పారునది. ఎదలందు చేరునది. కనురెప్పలు తడుపునది'..** కాళోజీ కవిత్వమని ప్రకటించుకున్నాడు. కాళోజీ అంటే **'నానా భావనల నది'**. తనవైన ఆలోచనలు, తనవైన ఆదర్శాలు ప్రపంచానికి చాటిచెప్పాలనే తపన ప్రతికవికీ సహజమైనట్టే కాళోజీకీ ఉన్నాయి. అయితే మిగతా కవుల కంటే కాళోజీ ప్రత్యేకమైన కవి.

కాళోజీ ఎంచుకున్నది ప్రజల తోవ. కనుక ప్రజల వస్తువు, ప్రజల శిల్పం. ప్రజల భాష స్వీకరించటం వల్ల తెలుగు కవిత్వంలో **'ప్రజాకవి'** అనే అరుదైన గౌరవం ఆయనకు దక్కింది.

'మహాకవి' గౌరవం పొందిన కవులు అయిదారుగురైనా కనిపిస్తారు. వాళ్లు కవిత్వ సృజన చేసేటప్పుడు పండితుల్ని, విమర్శకుల్ని దృష్టిలో పెట్టుకున్నారు. ప్రజాకళ్యాణం కవిత్వానికి ధ్యేయంగా ఉన్నప్పటికీ పండిత ప్రముఖుల మెప్పు కోరుకున్నట్లు గమనించవచ్చు. కవిత్వంలో ఉపయోగించిన భాష, నడిపించిన శైలి, తీర్చిదిద్దిన శిల్పం కొద్దిమందికే అందేవనేది స్పష్టం. కానీ కాళోజీ అట్లా కాదు. ప్రజల భాష గ్రహించాడు. **'నీది బడి పలుకుల భాష. నాది పలుకుబడుల భాష'** అని ప్రకటించుకున్నాడు. 'నోటి మాటకు వ్యాకరణం అక్కర్లే'దన్నాడు. నాట్యానికి శిక్షణ అవసరమౌతుంది గాని నడకకు శిక్షణ అవసరం లేదని చెప్పాడు.

'ఓటిచ్చునప్పుడే ఉండాలె బుద్ధి అనుచుంటి ఈ మాట
అనుభవం కొద్ది', 'దొంగలు దొంగలు ఊళ్లు పంచుకొని
దొరలై వెలిగేదెన్నాళ్లు', 'అన్నపురాసులు ఒకచోట, ఆకలి మంటలు ఒకచోట, కమ్మని చకినాలొకచోట, గట్టిదవడలింకొకచోట', 'కొంగులాగిన కళ్లు కొలిమిలో పెట్టాలె, కండకం డగకోసి కాకులకు వేయాలె..' వంటి అనేక వాక్యా లు ప్రజల భాషను, పలుకుబడుల భాషను కాళోజీ ప్రయోగించిన తీరుకు నిలువుటద్దాలుగా నిలుస్తాయి.

అదేవిధంగా సాధారణ గాన శిల్పం, దేశిఛందస్సు ప్రజలు తరచుగా అనుసరిస్తుంటారు. సరిగ్గా.. అంత సులభమైన ఛందస్సునే కాళోజీ స్వీకరించాడు. **'పిరికిపంద బతుకు కన్న హింస వేయిరెట్లు మిన్న', 'ఏ భాషరానీది ఏమి వేషమురా ఈ భాష ఈ వేషమెవరికోసమురా'** మొదటిది త్రిశ్రగతిలో సాగి జానపద గేయాల్ని తలపిస్తే , రెండోది ద్విపదలో సాగి బతుకమ్మ పాటను, తందానాన గేయాల్ని తలపునకు తెస్తుంది. కోపం వచ్చినప్పుడు ఎంతటి వాణ్ణయినా పట్టుకుని నిలబెట్టి నిలదీసే పద్ధతి ప్రజల్లో కనిపిస్తుంది. కాళోజీ కూడా అదే పద్ధతిని అనుసరించి ప్రజల శిల్పాన్ని తెలుగు కవిత్వానికెక్కించినట్టు గుర్తించవచ్చు. **'ముతా మనిషి మర్రిచెన్న ముఖ్యమంత్రివానీవు', 'ఏమంటవ్ రాష్ట్రపతీ, భారత స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ అడుగుతుండు'..** అని ఎదురుగా నిలబడి సూటిగా ప్రశ్నించే శిల్పం. ప్రజల శిల్పం కాళోజీ కవిత్వంలో చాటాచోట్ల మెరుస్తుంది.

భారత స్వాతంత్ర్యోద్యమంలో ఉత్సాహంగా ముందు కురికిన వ్యక్తి కాళోజీ. గాంధీ సిద్ధాంతాలతో ప్రభావితుడై సత్యాగ్రహాన్ని, అహింసను ఆయుధంగా పోరాడినాడు. తెలంగాణలో ప్రజలు అనుభవిస్తున్న పీడనను నిరసించి ఉద్యమించిన సాహసి. జేబులో అజ్ఞాత నేత ఉత్తరం దొరికి కరపత్రాలు పంచినందుకు **'షహరె బదర్'** అనే వరంగల్ నగర బహిష్కరణకు గురయినాడు. విశాలాంధ్ర కోసం వరంగల్ వీధుల్లో తెలంగాణ ఉద్యమకారుల నిరసన ఎదుర్కొన్నాడు. ప్రతి చర్యా ఉద్వేగమే. ప్రతి అడుగూ ప్రతిఘటనాత్మకమే. అనంతర కాలాల్లో ఆకాంక్షలు ఫలించినాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ స్వార్థ రాజకీయుల చేతిలో నలిగింది. గాంధీ మంత్రం ఫలించింది. అయినా గాంధీ వాదానికి నామం పెట్టింది. తెలంగాణకు నిజాం నుంచి విముక్తి లభించింది. దోపిడీదారులు పీఠమె క్కి పీడన అట్లే సాగింది. విశాలాంధ్ర ఏర్పడింది. తెలంగాణ ప్రజల బతుకు త్రిశంకు గతి అయింది. కవి ఏం చేయగల డు? కవిత్వం రాస్తాడు. కాళోజీ ఒళ్లు మండి సూటిగా ప్రశ్నించాడు. ధైర్యంగా నిరసించాడు. జరుగుతున్న పరిణామాల్ని, రాజకీయ స్వార్థాల్ని తీవ్రంగా ఖండించాడు. 'ఎరగనట్టు పడిఉండగా సాక్షీభూతున్ని కాను, సాక్షాత్తూ మానవున్ని..' అనుకున్నాడు. స్వార్థాన్ని తీవ్రంగా ఖండించాడు. కవిత్వాన్ని వాహికగా చేసుకొని, ఆయుధంగా మలచుకొని మంటలు పుట్టించాడు.

'కలము-బడితె-రుపాయి.. కొలువుదీరి కూసున్నయి. ప్రతినిధులు చేసిండే ప్రజాస్వామ్యమంటున్నయి. విశ్వాసం లేదంటే వెర్రికూతలంటున్నయి' అని విరుచుకుపడటం, కాళోజీ లక్షణమైంది. కలం ప్రసార మాధ్యమాలకు 'బడితె' శాంతి భద్రతలుగా దిగజారిన రాజ్యానికి, రూపాయి, వాణిజ్యంగా మారిన ఆర్థికవ్యవస్థలకు ప్రతీకలు. ఇవన్నీ 'బదులు'కొని ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తున్నాయని కాళోజీ భావించాడు. కవి కూడా నేతగాడె. బహుచక్కని సాలెగూడు అల్లువాడె అని తెలిసినా రాజకీయ బల్లీ(యు)ల నోటి అందక ఎగిరెడి పక్షీ(యు)లవైపు నిలబడి కాళోజీ తన ఆవేదనలు ధీర కంఠంతో వినిపించాడు. సాహిత్య విమర్శకులను ఆయన పట్టించుకోలేదు. అది కవిత్వం అవునా? కాదా? రససిద్ధి జరుగుతుందా? లేదా ఆయన పట్టించుకోదల్చుకోలేదు. ఆయన తోవ ఆయనది. ఆయన భావన ఆయనది. కాళోజీ పాఠకునికీ.. కవికీ నడుమ విమర్శకున్ని ఒప్పుకోలేదు.

'పరిసరాల నుంచి పొందే స్పందన వల్ల రచన చేసేవాడే రచయిత గాని విమర్శకుణ్ణి దృష్టిలో పెట్టుకుని రాసే రచయిత రచయితే కాడు'. 'రచన స్వయంగా చదివి ఆనందించగలవాడే పాఠకుడు. విమర్శకుని సలహా ప్రకారం చదివేవాడు పాఠకుడు కాదు'. 'సమాజం, విలువలు, సంప్రదాయాలు, ఆదర్శాలు, ఆచరణ, ప్రేమ, కరుణ, ద్వేషం, దుఃఖం, ఆనందం ఇట్లాంటి అనేకానేక భావ పుంజం అయిన మానవ జీవితం విమర్శే రచన. మళ్లీ రచన మీద విమర్శేమిటి?' అని విమర్శకుని పాత్రను (జీవితం-విమర్శ వ్యాసం) తిరస్కరించాడు. బహుశా విమర్శకున్ని అంతలా పక్కకుపెట్టిన రచయిత మరెవరూ ఉండకపోవచ్చు.

కాళోజీ ఐదారు కథలు రాశాడు. అవన్నీ రాజకీయ వ్యవస్థ మీదా, కుల పట్టింపుల మీదా, వస్తువ్యామోహం మీదా, సమాజ స్థితిగతుల మీదా తీవ్రమైన విసుర్లే. పౌరాణిక పాత్రల్ని వృత్తాంతాల్ని ఆధారం చేసుకొని వర్తమాన పరిణామాలకు చురకలంటించటం కాళోజీ సాధించిన విశేష శిల్పం.

కాళోజీకి కవిత్వ నిర్వచనాల పట్ల, సాహిత్య విశ్లేషణల పట్ల ఆసక్తి లేదు. 'మానవ జీవితానికి ఒక కచ్చితమైన నిర్వచనం, ఒక కచ్చితమైన పద్ధతి లేనట్లే.. సాహిత్యానికీ లేదు. ప్రతీ సాహిత్య ప్రస్థానీ ఒక ప్రత్యేకమైన దారి. ఎవరిదారి వారిదే అనేది కాళోజీ అభిమతం. 'కమిటెడ్ లేదా కట్టుబడ్డ మనిషి రచయిత కాలేడు' 'కట్టుబడిన రచయిత తన రచన ద్వారా మహా అయితే కంపెనీ వస్తువుల'ను విరివిగా అమ్మటానికి ఉపయోగపడే మంచి పోస్టరు సృష్టించగలడు. మంచి పోస్టరుగా ఉపయోగపడగలడు.. అంతే అని బాహాటంగా ప్రకటించగల శక్తి కాళోజీకి మాత్రమే సొంతం.

ప్రహ్లాదుని కథలో ప్రజాస్వామ్యాన్ని నిరూపించటం, శకుంతల వృత్తాంతంలో మహిళా హక్కుల చైతన్యాన్ని అన్వయించటం కాళోజీ దర్శనశక్తిని ప్రతిబింబిస్తాయి. సందర్భానుసారంగా ఆయా సన్నివేశాల్లో, సంభాషణల్లో ఆయన ప్రయోగించిన ఛలోక్తులు మాటలోని పదునును, వ్యంగ్యాన్ని, వ్యాప్తి గుణాన్ని తెలియజేస్తాయి.

కాళోజీ స్వయంగా చెప్పుకున్నట్టు **'తన కవిత్వమంతా సమకాలీన రాజకీయ సాంఘిక సంఘటనలపైన తన వ్యాఖ్యానం', 'తనదంతా రన్నింగ్ కామెంట్రీ'**. కాళోజీ రచనల ద్వారా ఆరేడు దశాబ్దాల ప్రజా జీవితాల్ని, రాజకీయ, ఆర్థిక, సామాజిక చరిత్రను అవగతం చేసుకోవచ్చు. వ్యవస్థ తీరుతెన్నుల మీద చైతన్యవంతుడైన కవి తిరుగుబాటు భావుటా వారసత్వంగా స్వీకరించవచ్చు.

దాశరథి రంగాచార్య భావించినట్టు.. కాళోజీ జీవితమే కవిత్వం. అంత అలవోకగా జీవించాడు. అంత అలవోకగా కవిత్వం రాశాడు. 'మాటలు నేర్వని తెలంగాణకు మాటలు నేర్పి గలగలా మాట్లాడించి కత్తిలేకనే నెత్తురు చిందించగల నెరజోడు కాళన్న (యశోదారెడ్డి). నిజమే పీవీ భావించినట్టు.. 'కాళోజీ ఒక ఫినామినన్'.

'రాజకీయ నాయకులు విఫలమైన పోట రచయిత విజయం సాధించి మానవ జాతికి మహోపకారం చెయ్యగలడు..' అది కాళోజీ విశ్వాసం. అది కాళోజీ ఆచరణ. మానవున్ని మానవునిగా, బతుకును బతుకుగా బతుకనిచ్చే మహా సందేశం అందించిన కవికెవరు సాటి. అతడు కాళోజీ.

– నందిని సిధారెడ్డి, 94403 81148
(నేడు కాళోజీ జయంతి)

ఇంకెన్నాళ్లు?

నవయుగంబున నాజీవృత్తుల/ నగ్న నృత్య మింకెన్నాళ్ళు?
పోలీసు అండను దౌర్జన్యాలు/ పోషణ బొందేదెన్నాళ్ళు?
దమననీతిలో దౌర్జన్యాలకు/ దాగిలిమూతలు ఎన్నాళ్ళు?
కంచెయె చేనును మేయుచుండగా/ కాంచకుండుటింకెన్నాళ్ళు?
దొంగలు దొంగలు ఊళ్లు పంచుకొని/ దొరలై వెలిగే దెన్నాళ్ళు?
బాధలు పెట్టి పలుకనీయని/ పావులభయ మింకెన్నాళ్ళు?
హింసపాపమని యెంచు దేశమున/ హిట్లరత్వమింకెన్నాళ్ళు?
పగటి దోపిడుల నాపగలేని/ ప్రభుత్వముండేదెన్నాళ్ళు?
ప్రజాదరణ గోల్పోయి దేశమును/ పాలనజేసే దెన్నాళ్ళు?
పగటి వేషములు యెన్ని వేసినా/ పాపము దాగే దెన్నాళ్ళు?
పాపపుకుండ బ్రద్దలు కాక/ భద్రంగుండే దెన్నాళ్ళు?
ప్రజా నాయకుల ప్రకటన/ తప్పను ప్రభుత్వపత్రాలెన్నాళ్ళు?
ప్రతిష్ఠ పేరిట తప్పుల దాచే/ పాడు పద్ధతింకెన్నాళ్ళు?
శాంతిభద్రతల పేర దుష్టతను/ సమర్థించుటింకెన్నాళ్ళు?
తత్వభేదమని మనలో మనకే/ తన్నులాటలింకెన్నాళ్ళు?
సంఘసేవకులపై దౌర్జన్యము/ సాగనిచ్చుటింకెన్నాళ్ళు?
విప్లవగాథలు వినుచు అందరు/ వేచియుందురింకెన్నాళ్ళు?
అగ్గికొండలో నగ్నిజ్వాలలు/ అణగియుండు నింకెన్నాళ్ళు?
ఫలితము లేక పావుల కొరకే/ పాడు కష్టమింకెన్నాళ్ళు?
ప్రజాశక్తికి పరీక్ష సమయము/ ప్రతీక్ష మన కింకెన్నాళ్ళు?
దౌర్జన్యము నెదిరించక మనకే/ దాసోహం ఇంకెన్నాళ్ళు?
పురుషులపై కాపురుషులు/ విజయం పొందుచుందురింకెన్నాళ్ళు?
సంక్రాంతి పురుషుడు దుష్టతపైన/ స్వారీ చేయ డింకెన్నాళ్ళు?
కలముపోటున కదపజాలని/ కావ్యగాన మింకెన్నాళ్ళు?
కాలోజికవి కైతలు వినియు/ కదలకుందురింకెన్నాళ్ళు?

– కాళోజీ

ప్రకటనలు

'సుజ్ఞాన గీత' ఆవిష్కరణ

డాక్టర్ కూర్మాచలం శంకరస్వామి రచించిన 'సుజ్ఞాన గీత' ఆవిష్కరణ సభ 2019 సెప్టెంబర్ 15న ఉదయం 10 గంటలకు జగద్గిరిగుట్టలోని మగ్దూమ్‌నగర్ నాగార్జున హైస్కూల్‌లో జరుగుతుంది. కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరుగు సభలో అతిథులుగా బైస దేవదాసు, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, ప్రొఫెసర్ వెల్దండ నిత్యానందరావు, డాక్టర్ నాళేశ్వరం శంకరం, తిరుక్కో వళ్లూరి రామానుజం, అశ్వాపురం వేణు మాధవ్ హాజరవుతారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ కాంచనపల్లి, అందోజు పరమాత్మ, డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి, వాడపల్లి కృష్ణ హాజరవుతారు. గ్రంథ స్వీకర్త: బోయినపల్లి కిషన్‌రావు.

- తెలంగాణ రచయితల సంఘం, జంటనగరాల శాఖ

ఆవిష్కరణ

ఆరపల్లి జగన్నాథస్వామి సిద్ధాంత గ్రంథం 'దాశరథి చలనచిత్ర గీతాలు-విమర్శనాత్మక పరిశీలన' గ్రంథం ఆవిష్కరణ సభ 2019 సెప్టెంబర్ 14న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. జె.చెన్నయ్య అధ్యక్ష తన జరుగు సభలో కె.శ్రీనివాస్, వక్కలంక వెంకట రమణ, వై.సత్యనారాయణ, గుడిపాటి పాల్గొంటారు.

- పాలపిట్ట బుక్స్

నవలా స్రవంతి

నెలనెలా 'నవలా స్రవంతి' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 2019 సెప్టెంబర్ 13న సాయంత్రం 6 గంటలకు, హైదరాబాద్ రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరుగు సభలో కవిరాజమూర్తి నవల 'మై గరీబ్ హూ'పై తాటికొండల నరసింహారావు ప్రసంగం ఉంటుంది.

- డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి

'స్మృతి మననం'

తెలంగాణ చైతన్య సాహితి, తెలంగాణ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నెలనెలా సాహితీ మిత్రులు కార్యక్రమంలో కీర్తిశేషులు సి.వి.కృష్ణారావు గారి 'స్మృతి మననం' కార్యక్ర మం 2019 సెప్టెంబర్ 11న సాయంత్రం 5.30 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో ఉంటుంది. అందరికీ ఆహ్వానం.

- ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్

'కవితలకు ఆహ్వానం'

దేశమంటే నేల, సరహద్దులు మాత్రమే కాదు. ప్రజలు. వారి హక్కులు, స్వేచ్ఛ కూడా. కానీ వాటిని హరించివేసే విధంగా కశ్మీర్‌లో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలుంటున్నాయి. కశ్మీర్ సమస్యపై 'కవన కాశ్మీరం' పేర సంకలనానికి కవి తలను ఆహ్వానిస్తున్నాం.

- కె.ఆనందాచారి, తెలంగాణ సాహితి

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

నానావతి, సిల్వియా దంపతులు

నానావతి కేసుతో వెలుగులోకి..

న్యూఢిల్లీ: దాదాపు 70 ఏండ్ల పాటు న్యాయవాద వృత్తిలో కొనసాగిన రాంజెత్మలానీ ఎన్నో కీలక కేసుల్లో వాదించారు. 1959లో సంచలనం సృష్టించిన నానావతి కేసుతో తొలిసారి వెలుగులోకి వచ్చారు. నేవీ కమాండర్ కేఎం నానావతి తన బ్రిటిష్ భార్య సిల్వియా ప్రేమికుడు ప్రేమ్ అహూజాను కాల్చి చంపి, బాంబేలోని పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. 1959 సెప్టెంబర్ 23న జ్యూరీ నానావతిని నిర్దోషిగా ప్రకటించింది. జ్యూరీ పద్ధతిలో విచారించిన తుది కేసు ఇదే. ఈ తీర్పు హేతుబద్ధం కాదన్న జడ్జి.. కేసును బాంబే హైకోర్టుకు బదిలీచేశారు. 1960, మార్చి 11న హైకోర్టు నానావతికి జీవిత ఖైదు విధించింది. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే బాంబే గవర్నర్ రద్దుచేశారు. గవర్నర్ ఎక్కువగా స్పందించారని తప్పుబట్టిన సుప్రీం కోర్టు అదే ఏడాది సెప్టెంబర్‌లో ఆ ఆదేశాలను రద్దు చేయడంతో నానావతిని జైలుకు తరలించారు. అనారోగ్యం పేరుతో 1963లో పెరోల్‌పై బయటకొచ్చిన నానావతికి.. 1964లో బాంబే గవర్నర్, నెహ్రూ సోదరి విజయలక్ష్మి .. క్షమా భిక్ష ప్రసాదించారు. ఆ తర్వాత.. ఒక్కటైన నానావతి దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి కెనడాలో శేషజీవితం గడిపారు. దీని ఆధారంగా పలు పుస్తకాలు, సినిమాలు వచ్చాయి. బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ నటించిన రుస్తుం చిత్రం దీని ఆధారంగా రూపొందినదే.

రాంజెత్మలానీ మృతికి సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: ప్రముఖ న్యాయవాది, కేంద్ర మాజీ మంత్రి రాంజెత్మలానీ మృతికి తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. రాంజెత్మలానీ చేసిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

దేవుడి 'వెయిటింగ్ లాంజ్' నుంచి నిష్క్రమణ!

న్యూఢిల్లీ: 'నేనిప్పుడు దేవుడి వెయిటింగ్ లాంజ్ లో(వేచి ఉండే గదిలో) నివసిస్తున్న ఒక వృద్ధుడిని'.. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా తన చివరి దశలో జెత్మలానీ తరచూ అనే మాటలివి. 2017లో తన 94వ జన్మదినానికి కొద్ది రోజుల ముందు ఆయన తన సుదీర్ఘ న్యాయవాద కెరీర్‌కు వీడ్కోలు పలికారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా దీపక్ మిశ్రా నియమితులైనప్పుడు ఆయనకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెత్మలానీ మాట్లాడుతూ.. 'మై లార్డ్, చివరిసారిగా నేను మీ ముందు హాజరవుతున్నా. నాకిప్పుడు 90 ఏండ్లు పైబడ్డాయి. నేనిప్పుడు దేవుడి వెయిటింగ్ లాంజ్‌లో నివసిస్తున్న ఓ వృద్ధుడిని' అని అన్నారు. తన ముందు పెరిగిన పలువురు.. జస్టిస్‌లుగా, చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారన్నారు. యువ న్యాయవాదులకు తన ఇంటి తలుపులెప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. కాగా, కేసుల ఎంపికలో జెత్మలానీ ఎవరి ఊహకందరు. రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తలు, దొంగలు, హంతకులు ఇలా అందరి తరపునా వాదించారు. పలువురు క్రిమినల్స్‌ను ఉరిశిక్ష నుంచి రక్షించిన జెత్మలానీ.. మరణదండనకు మద్దతుగా బలంగా వాదించడం గమనార్హం. శరణార్థిగా దేశానికి వచ్చి గొప్ప న్యాయకోవిదునిగా ఎదిగిన ఆయన.. 2019 సెప్టెంబర్ 8న దేవుడి వెయిటింగ్ లాంజ్ నుంచి నిష్క్రమించారు.

రాజ్యసభలో ప్రసంగిస్తున్న జెత్మలానీ(ఫైల్)

రాంజెత్మలానీ ఇకలేరు



ఏ అంశంపైనైనా చమత్కారాలతో సాహసోపేతంగా నిక్కచ్చిగా మాట్లాడుతూ మనస్సులో మాటలను చెప్పడానికి వెనుకాడేవారు కాదు. పార్లమెంట్‌లోనూ, న్యాయస్థానాల్లోనూ విలువైన సేవలందించిన అనుభవజ్ఞుడైన న్యాయవాదిని దేశం కోల్పోయింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి

- నరేంద్రమోదీ, ప్రధానమంత్రి

దీర్ఘకాల అనారోగ్యంతో 95వ ఏట కన్నుమూత

- అభిమానుల అశ్రునయనాల మధ్య ఢిల్లీలో అంత్యక్రియలు
- పోరాట యోధుడు: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నివాళి
- ప్రతిభావంతుడైన మేధావి.. దేశభక్తుడు: ఉపరాష్ట్రపతి వెంకయ్య
- నిక్కచ్చిగా అభిప్రాయాలు వెల్లడించే ధైర్యశాలి: ప్రధాని మోదీ
- జెత్మలానీ సేవలను గుర్తుచేసుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: ప్రముఖ న్యాయ కోవిదుడు, కేంద్ర మాజీ మంత్రి రాంజెత్మలానీ (95) కన్నుమూశారు. ఆదివారం ఉదయం 7.45 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. కొన్ని నెలలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని రాంజెత్మలానీ తనయుడు మహేశ్ జెత్మలానీ తెలిపారు. వచ్చే వారం (సెప్టెంబర్ 14) 96వ జన్మ దినోత్సవం జరుపుకోనుండగా ఆయన కన్నుమూయడం విషాదకరం. జెత్మలానీ 1923 సెప్టెంబర్ 14న పాకిస్థాన్ సింధ్ ప్రావిన్స్‌లోని సిఖార్‌పూర్‌లో జన్మించారు. సింధ్‌పై ఆయనకు మమకారం ఎక్కువ. జాతీయ గీతం నుంచి సింధ్ పదాన్ని తొలిగించాలని సుప్రీంకోర్టులో దాఖలైన పిల్‌కు వ్యతిరేకంగా ఆయన వాదించి, విజయం సాధించారు. ఆయనకు నలుగురు సంతానం. అయితే ఒక కూతురు 2011లో, ఒక కొడుకు జనక్ అంతకుముందే మరణించారు. ఆయనకు ప్రస్తుతం కుమారుడు మహేశ్ జెత్మలానీ, కుమార్తె శోభ ఉన్నారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దారుణ హత్య కేసుల్లోనూ, పలు సంచలన క్రిమినల్ కేసుల్లోనూ నిందితుల పక్షాన వాదించిన ప్రముఖుడు జెత్మలానీ. ఆయన మరణవార్త వినగానే ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఆయన నివాసానికి వెళ్లి జెత్మలానీ పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించారు. జెత్మలానీ కుటుంబ సభ్యులను ప్రధాని ఓదార్చారని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ట్వీట్ చేసింది. కుటుంబ సభ్యులు, అభిమానులు, న్యాయవాదులు, రాజకీయ, అధికార ప్రముఖుల అశ్రు నయనాల మధ్య ఢిల్లీలోని లోధి శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు జెత్మలానీ అంత్యక్రియలు జరిగాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, జెత్మలానీ కూతురు శోభ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, సీనియర్ రాజకీయ నేత శరద్ యాదవ్, అకాలీదళ్ మాజీ ఎంపీ సిమ్రన్‌జిత్ సింగ్ మాన్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి డీవై చంద్రచూడ్.. జెత్మలానీ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

జెత్మలానీ పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు నమస్కరిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

రాజకీయ ప్రముఖుల సంతాపాలు

జెత్మలానీ మృతిపట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు. జెత్మలానీ ఇటు న్యాయశాస్త్రంలోనూ, అటు రాజకీయాల్లోనూ పోరాట యోధుడు, పేరొందిన ప్రజా న్యాయవాది అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. 'ప్రముఖ న్యాయవాది, కేంద్ర మాజీ మంత్రి రాంజెత్మలానీ మృతి విచారకరం. తన వాగ్ధాటితో ప్రజా సమస్యలపై గళం వినిపించడంలో ఆయనకు ఆయనే సాటి. రాంజెత్మలానీ మృతితో దేశం ప్రముఖ న్యాయ కోవిదుడిని, మేధావిని, గొప్ప జ్ఞానిని కోల్పోయింది' అని రాష్ట్రపతి సచివాలయం ట్వీట్ చేసింది. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందిస్తూ.. 'ప్రతిభావంతుడైన మేధావుల్లో ఒకరు. తుదిశ్వాస విడిచే వరకు చురుగ్గా వ్యవహరించిన ఆయన మృతితో జాతి దేశభక్తుడిని కోల్పోయింది' అని ట్వీట్ చేశారు. హోం మంత్రి అమిత్‌షా స్పందిస్తూ జెత్మలానీ మృతి తీవ్ర బాధ కలిగించిందని, యావత్ న్యాయ సమాజానికి కోలుకోలేని నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా ప్రతిస్పందిస్తూ.. జెత్మలానీ 'లెజెండ్ ఆఫ్ బార్' అని చెప్పారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ స్పందిస్తూ.. జెత్మలానీ సమర్థుడైన పాలకుడన్నారు. కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ 'కేంద్ర మాజీ మంత్రి రాంజెత్మలానీ మృతిపట్ల మేం విచారం తెలియజేస్తున్నాం' అని తెలిపింది. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ స్పందిస్తూ.. 'ప్రియమిత్రుడు రాంజెత్మలానీ మృతి తీవ్ర విచారకరం' అని ట్వీట్ చేశారు. సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) సంతాపం తెలిపింది.

న్యాయకోవిదుడు

- క్రిమినల్ చట్టాల్లో నిష్ణాతుడు
- దేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకున్న న్యాయవాది
- విభిన్న వర్గాల తరపున వాదనలు

న్యూఢిల్లీ: దేశంలోనే గొప్ప న్యాయకోవిదుల్లో రాం జెత్మలానీ ఒకరిగా ఎదిగారు. సాహసోపేత, వివాదాస్పద నిర్ణయాలతో విభిన్న, స్వతంత్ర స్వభావం కల రాజకీయ నేతగా పేరొందారు. జెత్మలానీ స్వతహాగా ఎదిరించే మనస్తత్వం కలవారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడే రకం కాదు. పాకిస్థాన్‌లోని సహానీ లా కాలేజీ నుంచి 17వ ఏట న్యాయ పట్టా పొందారు. ప్రాక్టీస్ ప్రారంభానికి కనీస అర్హత వయసును 21కి తగ్గించాలని కరాచీ హైకోర్టులో విజయం సాధించారు. దేశ విభజన తర్వాత కరాచీ నుంచి ముంబైకొచ్చి న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. శరణార్థులను ఎప్పుడైనా తరలించడానికి, బంధించి, ప్రశ్నించడానికి వీలుకల్పించే బాంబే రెఫ్యూజీ చట్టానికి వ్యతిరేకంగా బాంబే హైకోర్టులో విజయం సాధించారు. ఈనాడు దేశంలోనే అత్యంత పారితోషికం తీసుకునే న్యాయవాదుల్లో జెత్మలానీ ఒకరు.

నేతల నుంచి అండర్ వరల్డ్ డాన్‌ల వరకు..

సుమారు 70 ఏండ్లు న్యాయవాదిగా పనిచేసిన జెత్మలానీ క్రిమినల్ కేసులతోపాటు రాజ్యాంగ, ఆర్థిక, వాణిజ్య వివాదాల కేసుల్లోనూ వాదనలు వినిపించారు. 1959లో నానావతి వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో ప్రాసిక్యూటర్ల బృందంలో ఒకరిగా ఉన్న ఆయన.. ఆ కేసుతో గొప్ప పేరు సాధించారు. అనారోగ్యంతో కొన్ని నెలలుగా కోర్టు విచారణలకు హాజరుకాని జెత్మలానీ, గత పదేండ్లలో పలు కీలక కేసుల్లో వాదించారు. విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తేవాలని యూపీఏ హయాంలో స్వయంగా పిల్ దాఖలు చేశారు. వివిధ రాజకీయ నేతల తరపున వాదించారు. వ్యాపారవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, బాలీవు డ్ తారలు, అండర్‌వరల్డ్ డాన్‌ల తరపునా పనిచేశారు. 1975లో ఇందిర విధించిన ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇందిరాగాంధీ హత్య కేసులో నిందితులు కెహర్‌సింగ్, బల్బీర్‌సింగ్ పక్షాన వాదించి బల్బీర్‌సింగ్‌కు విముక్తి కల్పించడంలో విజయం సాధించారు. జెత్మలానీతో కలిసి పనిచేసినవారు ఆయనను మానవహక్కుల చాంపియన్‌గా అభివర్ణిస్తారు. రాజీవ్‌గాంధీ హత్య కేసులోనూ నిందితుల పక్షాన వాదనలు వినిపించారు. సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో అమిత్ షా.. స్టాక్ మార్కెట్ కుంభకోణాల్లో హర్షద్ మెహతా, కేతన్ పరేఖ్.. గ్యాస్ పంపిణీ విషయంలో అంబానీ సోదరుల మధ్య తలెత్తిన వివాదంలో అనిల్ అంబానీ తరపున జెత్మలానీ వాదించారు. జెస్సికా లాల్ హత్య కేసులో ప్రముఖ కాంగ్రెస్ నేత కుమారుడు మనుశర్మకు అనుకూలంగా వాదించారు. అరుణ్‌జైట్లీ పరువునష్టం దావా కేసులో కేజ్రీవాల్ తరపున వాదించారు. అక్రమాస్తుల కేసులో జయలలిత, 2జీ స్కాం కేసులో కనిమొళి, మైనింగ్ కేసులో యెడియూరప్ప, పశుగ్రాసం కేసులో లాలూప్రసాద్ పక్షాన వాదించారు. 1993 ముంబై వరుస బాంబు పేలుళ్ల కేసులో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తరపున వాదించారు. బోఫోర్స్ కేసులో నాటి ప్రధాని రాజీవ్‌కు జెత్మలానీ ప్రతిరోజూ 10 ప్రశ్నలను సంధించారు. తర్వాత ఈ కేసులో హిందుజా సోదరుల తరపున ఆయన వాదనలు వినిపించారు. పలు స్మగ్లింగ్ కేసుల్లో ముంబై అండర్ వరల్డ్ డాన్ హాజీ మస్తానీ తరపున వాదించారు.



వాజపేయిపై పోటీ

జెత్మలానీ రాజకీయ జీవితం కూడా అత్యంత ఆసక్తికరం. జనతాపార్టీ, బీజేపీ, ఆర్జేడీల నుం చి ఆయన పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. వాజపేయి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఆయన.. తర్వాత 2004లో ఆయనపైనే పోటీకి దిగారు. 1987లో రాష్ట్రపతి పదవికి పోటీచేశారు. 1971లో మహారాష్ట్రలోని ఉల్లాస్‌నగర్ నుంచి స్వతం త్ర అభ్యర్థిగా పోటీచేశారు. బీజే ఎస్, శివసేన మద్దతునిచ్చినా ఓడిపోయారు. జనతాపార్టీ, బీజేపీ తరపున ముంబై నుంచి వరుసగా 6వ (1977), 7వ (1980) లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1996లో తొలిసారి కేంద్ర మంత్రి అయ్యారు. 1998 లో వాజపేయి క్యాబినెట్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2010లో తిరిగి బీజేపీ తరపున రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ 2013లో బీజేపీ ఆయనను పార్టీ నుంచి ఆరేండ్లపాటు బహిష్కరించింది. దీన్ని సవాల్ చేసిన జెత్మలానీ.. రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని బీజేపీ పై దావా వేశారు. అమిత్ షా విచారం వ్యక్తం చేయడంతో ఆ వివాదం ముగిసింది.

అద్వానీ, వాజపేయిలతో జెత్మలానీ

తాలిబన్లతో చర్చలు విరమించిన ట్రంప్

వాషింగ్టన్: తాలిబన్లతో రహస్య చర్చలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరమించుకొన్నారు. గురువారం ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో తాలిబన్లు జరిపిన బాంబుదాడిలో అమెరికా సైనికుడితోపాటు 11 మంది చనిపోవడానికి నిరసనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. తాలిబన్లతోపాటు ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం ప్రతినిధులతో జరుపాలనుకొన్న చర్చల రద్దు వార్తను ట్విట్టర్ ద్వారా ట్రంప్ తెలిపారు. ఫలితంగా అమెరికా తన సుదీర్ఘ యుద్ధాన్ని ముగించి శాంతి ఒప్పందం చేసుకోవడానికి దగ్గరవుతున్న తరుణంలో జరుగుతున్న దీర్ఘకాలిక చర్చలకు విఘాతం కలిగినట్టయింది. 2001 సెప్టెంబర్ 11వ తేదీన న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడులు జరిగినప్పటి నుంచి తాలిబన్లపై అమెరికా యుద్ధం కొనసాగుతున్నది. కాగా, తాలిబన్లు, ఆఫ్ఘనిస్థాన్ ప్రతినిధులతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టాలనుకొన్న రహస్య చర్చలను ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం ప్రశంసించింది. తన మిత్ర దేశాల హృదయపూర్వక ప్రయత్నాలకు కృతజ్ఞతలు తెలిపింది.

ఆల్మట్టి నుంచి పెరిగిన నీటి విడుదల

బెంగళూరు/ముంబై: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాలకు వరద ముప్పు ఏర్పడింది. గత మూడురోజులుగా మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదవుతున్నది. దీంతో కృష్ణా, దాని ఉప నదుల్లోకి ఇన్‌ఫ్లో పెరిగింది. తద్వారా కృష్ణా బేసిన్‌లోని కోయ్నా, రాధానగరి తదితర డ్యామ్‌ల్లోకి ఇన్‌ఫ్లో పెరిగింది. ఈ నేపథ్యంలో దిగువన ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయాలని కర్ణాటకను మహారాష్ట్ర కోరింది. ఈ నేపథ్యంలో కర్ణాటక ఆదివారం ఆల్మట్టి నుంచి విడుదల చేసే నీటి సామర్థ్యాన్ని 1.70 లక్షల క్యూసెక్కుల నుంచి 2.20 లక్షల క్యూసెక్కులకు పెంచింది.

విక్రమ్ దొరికింది


మొదటిపేజీ తరువాయి...

ఉపరితలాన్ని ఢీకొట్టి ఉంటుందని (హార్డ్ ల్యాండింగ్) చెప్పారు. అందువల్లే సంకేతాలు నిలిచిపోయి ఉంటాయని వెల్లడించారు. హార్డ్ ల్యాండింగ్ సమయంలో ల్యాండర్ దెబ్బతిన్నదో లేదో ఇప్పుడే చెప్పలేమన్నారు. ఆర్బిటార్ పేలోడ్లలో 'ఆర్బిటార్ హై రెజొల్యూషన్ కెమెరా' (ఓహెచ్చార్సీ) ఒకటి. ఇప్పటివరకు చంద్రుడిపై ప్రయోగాల కోసం పంపిన అన్ని వ్యోమనౌకల్లోని కెమెరాల కన్నా ఓహెచ్చార్సీ శక్తివంతమైనది. ఇది 12 కి.మీX3కి.మీ వైశాల్యంతో 0.32 మీటర్ల రెజల్యూషన్‌తో ఫొటోలను తీయగలదు.

దేశం, మోదీ మద్దతు నైతిక స్థైర్యాన్నిచ్చింది

ల్యాండర్ చంద్రుడి ఉపరితలానికి 2.1 కి.మీ.ల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ నిలిచిపోయినప్పుడు తనతోపాటు చంద్రయాన్-2 బృందమంతా నిరాశలో కూరుకుపోయిందని శివన్ పేర్కొన్నారు. 'ఆ సమయంలో అక్కడే ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాకు మద్దతుగా మాట్లాడటం, ఆ తర్వాత దేశం మొత్తం మాకు అండగా నిలువడం నైతిక స్థైర్యాన్ని పెంచింది. నాతోపాటు శాస్త్రవేత్తలంతా చాలా ఆనందంగా ఉన్నారు' అని పేర్కొన్నారు. ఇస్రో మాజీ చైర్మన్ కే కస్తూరిరంగన్ సైతం ప్రధాని మోదీని ప్రశంసించారు. కష్టసమయంలో ఇస్రో బృందానికి అండగా నిలిచారని, వారిని వెన్నుతట్టి ప్రోత్సహించారని కొనియాడారు. 'దేశం మొత్తం ఇస్రో శాస్త్రవేత్తల పట్ల సానుకూలంగా స్పందించింది. ముఖ్యంగా ప్రధాని స్పందించిన తీరు అద్భుతం. ఆయన మాటలు సానుకూల దృక్పథాన్ని పెంపొందించాయి' అని అభినందించారు. ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ ప్రధాని మోదీకి, దేశ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అనుసంధానం కష్టమే..

హార్డ్ ల్యాండింగ్ వల్ల ల్యాండర్ దెబ్బతిని ఉంటుందని, ఈ దశలో దానితో అనుసంధానం చేయడం కష్టమేనని పలువురు అంతరిక్ష రంగ నిపుణులు పేర్కొంటున్నారు. 'ల్యాండర్ అధిక వేగంతో ఉపరితలాన్ని ఢీకొట్టి ఉండొచ్చు. నాలుగు కాళ్లపై దిగకపోవచ్చు. హార్డ్ ల్యాండింగ్ వల్ల ల్యాండర్‌లోని పరికరాలు దెబ్బతినొచ్చు' అని ఓ ఇస్రో అధికారి వ్యాఖ్యానించారు. 'మనకు చాలా తక్కువ సమయం ఉన్నది. (ల్యాండర్, రోవర్ జీవితకాలం 14 రోజులు మాత్రమే) ఈ దశలో ల్యాండర్‌తో అనుసంధానం కావడం దాదాపు అసాధ్యం' అని మరో అధికారి అభిప్రాయపడ్డారు. ల్యాండర్ సరైన దిశలో ల్యాండ్ అయ్యుంటే అది సౌరశక్తి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటుందని, బ్యాటరీలను రీచార్జ్ చేసుకొని భూమితో అనుసంధానం అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. కానీ.. ప్రస్తుతం అలాంటి అవకాశాలు కనిపించడం లేదన్నారు. ల్యాండర్ ఉపరితలంపై కూలిపోయి ఉంటుందని, ఈ దశలో దానితో అనుసంధానమయ్యే అవకాశాలు చాలా తక్కువని ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబినారాయణ్ పేర్కొన్నారు. మరోవైపు ఈ ఘటనతో ఆర్బిటార్ సక్రమంగా పనిచేస్తున్నదని నిరూపితమైందని అంతరిక్ష రంగ నిపుణుడు అజయ్ లెలె తెలిపారు. 'ఆర్బిటార్ పంపిన చిత్రాల ఆధారంగానే ల్యాండర్ జాడ తెలిసింది. అంటే.. ఆర్బిటార్ పనితీరులో సందేహాలకు తావేలేదు. చంద్రయాన్-2లో ఆర్బిటార్ ప్రధానమైన భాగం. కాబట్టి ప్రయోగం 90-95 శాతం విజయం సాధించినట్టే' అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆర్బిటార్ అందించే సమాచారం చంద్రుడిపై పరిశోధనలకు ఎంతో కీలకంగా మారుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ల్యాండర్‌తో అనుసంధానం కావడం సవాల్‌తో కూడుకున్నదని చెప్పారు.



అపజయం నాయకుడిది..
విజయం అందరిది!

- స్ఫూర్తినిచ్చే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రసంగం
- 1979లో ఎస్ఎల్వీ-3 ప్రయోగం విఫలమైన సందర్భాన్ని గుర్తుచేసుకున్న మిస్సైల్‌మ్యాన్

న్యూఢిల్లీ: యావత్ భారతావని ఎంతో ఆతృతగా ఎదురుచూసిన చంద్రయాన్-2 ప్రయోగం ఆఖరి క్షణాల్లో అగమ్యగోచరంగా మారడంతో ఇస్రో చైర్మన్ శివన్ కంటతడిపెట్టారు. దాంతో ప్రధాని మోదీ ఆయనను దగ్గరకు తీసుకుని ఓదారుస్తూ 'నవోదయం ముందున్నద'ని ధైర్య వచనాలు చెప్పారు. ముందుగా చేసుకున్న ప్రణాళికలు కొన్నిసార్లు తప్పుతుంటాయి. ఓటమి ఎదురైనప్పుడు ఆ సందర్భాన్ని ఎలా ఎదుర్కోవాలో మాజీ రాష్ట్రపతి డా ఏపీజే అబ్దుల్ కలాం కూలంకషంగా వివరించారు. 2013లో జరిగిన ఓ కార్యక్రమంలో '1979లో ఎస్ఎల్వీ మిషన్ విఫలం' గురించి వివరిస్తూ స్ఫూర్తిదాయకమైన వ్యాఖ్యలు చేశారు.

కలాం ప్రసంగం.. ఆయన మాటల్లోనే..

'అది 1979. నేను ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్నాను. ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టడమే మా మిషన్ లక్ష్యం. ఈ ప్రయోగం కోసం వేలాది శాస్త్రవేత్తలు దాదాపు 10ఏండ్ల పాటు తీవ్రంగా శ్రమించారు. నేను శ్రీహరికోటకు చేరుకునేసరికి లాంచ్ ప్యాడ్‌పై రాకెట్ కొలువుదీరింది. కౌంట్ డౌన్ మొదలైంది. అయితే ఒక్కసారిగా కంప్యూటర్ పనిచేయడం ఆగిపోయింది. వెంటనే, రాకెట్‌ను లాంచ్ చేయొద్దు అని ఆదేశించాను. నేను ఆ మిషన్‌కు డైరెక్టర్‌ను. నేను మాత్రమే ఆ నిర్ణయాన్ని తీసుకోవాలి. నా వెనుకాల ఆరుగురు నిపుణులు కంప్యూటర్ డేటాబేస్‌ని చూస్తున్నారు. కంట్రోల్‌లో సమస్య తలెత్తినట్టు చెప్పారు. సమస్య తలెత్తిన కంప్యూటర్‌ను మార్చాను. రాకెట్‌ను ప్రయోగించమని ఆదేశించాను. కక్ష్యలో ఉపగ్రహాన్ని పెడుతుందనుకున్న రాకెట్.. బంగాళాఖాతంలో పడేసింది. మొట్టమొదటిసారి నేను ఓటమిని చవిచూశాను. కంప్యూటర్ ఇచ్చిన హెచ్చరికలను పట్టించుకోకుండా రాకెట్‌ను ప్రయోగించమని చెప్పింది నేను. ఈ వైఫల్యానికి పూర్తి నైతిక బాధ్యత కూడానాదే. అప్పుడే, మిషన్ వైఫల్యం గురించి ప్రకటించడానికి ఇస్రో చైర్మన్ సతీశ్ ధావన్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. తన పొరపాటు లేనప్పటికీ, మిషన్ విఫలం కావడానికి కారణం తానేనని ధావన్ నిందను మోశారు. ఈ విషయం తెలిశాక అందరూ తనను విమర్శిస్తారని తెలిసినప్పటికీ ఆయన ఈ ప్రకటన చేశారు. తనకు ఎంతో సమర్థులైన బృందం ఉన్నదని వచ్చే ఏడాది కచ్చితంగా తాము విజయం సాధిస్తామని ఆయన చెప్పారు. ఆయన చెప్పినట్టుగానే.. ఆ మరుసటి ఏడాది జూలై 18, 1980లో రోహిణి ఆర్ఎస్-1ను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టాం. ప్రయోగం విజయవంతం కాగానే ధావన్ నన్ను మీడియా సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా పురమాయించారు. రోహిణి సక్సెస్.. టీమ్ వల్ల దక్కిందని ఆయన మీడియా ముందు చెప్పారు. ఆ మాటలు వినగానే ఆరోజు నేను ఓ గొప్ప పాఠం నేర్చుకున్నానని అనిపించింది. ఓటమి ఎదురైతే నాయకుడు ఆ నిందను తనపై వేసుకుంటాడు. గెలుపును మాత్రం టీమ్ సమిష్టి కృషిగా చెబుతాడు. టీమ్ మేనేజ్‌మెంట్ పాఠాన్ని నేను ఏ పుస్తకాన్నీ చదివి నేర్చుకోలేదు. నా అనుభవం నుంచి దాన్ని ఒడిసిపట్టాను' అని కలాం ముగించారు.

మరో పదేండ్లలో జాబిల్లిపై భారత్ ఫ్యాక్టరీ!

న్యూఢిల్లీ: హీలియం-3 ఇంధనాన్ని వెలికితీయడమే లక్ష్యంగా చంద్రుడిపై మరో పదేండ్లలో భారత్ ఓ ఫ్యాక్టరీని నిర్మించనున్నదని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) మాజీ శాస్త్రవేత్త ఏ శివథను పిళ్లై పేర్కొన్నారు. డీడీ న్యూస్‌లో ప్రసారమైన 'వార్ అండ్ పీస్' అనే కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'హీలియం-3 వంటి ఇంధనాన్ని వెలికితీసి, భూమి మీదకు తీసుకురావడానికి భారత్ మరో పదేండ్లలో చంద్రుడిపై ఓ ఫ్యాక్టరీని నిర్మించనున్నది' అని అన్నారు. సౌర కుటుంబంలోని ఇతర గ్రహాలపైకి ప్రయోగాలు చేయడానికి ఈ బేస్ క్యాంప్ ఉపయోగపడుతుందన్నారు.

మీ ప్రయాణం.. మాకు స్ఫూర్తిదాయకం

- మీతో కలిసి సౌర వ్యవస్థను అన్వేషించేందుకు ఎదురుచూస్తున్నాం
- చంద్రయాన్-2 ప్రయోగంపై ఇస్రోను అభినందించిన నాసా

వాషింగ్టన్: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-2 ప్రయోగం పరిపూర్ణం కాకపోయినప్పటికీ అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) ప్రశంసల జల్లు కురిపించింది. చంద్రయాన్-2 ప్రయోగం తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నది. 'అంతరిక్షంలో ప్రవేశించడం చాలా కష్టమైన పని. ఇప్పటివరకూ ఎవరూ కాలుమోపని చంద్రుని దక్షిణధ్రువ ఉపరితలంపై చంద్రయాన్-2ను దించేందుకు ఇస్రో చేసిన ప్రయత్నాన్ని మేము ప్రశంసిస్తున్నాం. మీ ప్రయాణంతో మాలో స్ఫూర్తి నింపారు. మున్ముందు మీతో కలిసి సౌర వ్యవస్థను అన్వేషించేందుకు ఎదురుచూస్తున్నాం' అని ట్వీట్ చేసింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఓ సీనియర్ అధికారి కూడా చంద్రయాన్-2 ప్రయోగాన్ని ప్రశంసించారు. 'చంద్రయాన్-2 ప్రయోగం కోసం అద్భుతంగా ప్రయత్నించిన ఇస్రోను అభినందిస్తున్నాం. ఈ ప్రయోగం భారత్‌కు గొప్ప ముందడుగు' అని దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాలశాఖ తాత్కాలిక సహాయ మంత్రి అలైస్ జీ వెల్స్ ట్వీట్ చేశారు.

చైనా పెత్తనంలో ఉన్న హాంకాంగ్‌కు విముక్తి కలిగించాలని కోరుతూ ఆందోళనకారులు ఆదివారం ఆ దేశంలోని అమెరికా రాయబార కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఒక విజ్ఞప్తి.. చైనా నుంచి హాంకాంగ్‌కు విముక్తి లభించేలా చూడండి' అంటూ నినాదాలు చేశారు. అయితే వీరి ఆందోళన తొలుత శాంతియుతంగా జరిగినప్పటికీ తర్వాత హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు సబ్‌వే స్టేషన్లను ధ్వంసం చేసి నిప్పపెట్టారు. దీంతో పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు.

ధర్మగంట

రాజారాంలో రెవెన్యూ సిబ్బందిని నిర్బంధించేందుకు తీసుకెళ్తున్న గ్రామస్థులు

నిర్బంధంలో ఉన్న రెవెన్యూ అధికారి

ఉన్నతాధికారులు లేకుండానే సదస్సులా?

- జగిత్యాల జిల్లా రాజారాంలో రెవెన్యూ సిబ్బంది నిర్బంధం
- పెండింగ్ సమస్యలను పరిష్కరించడం లేదంటూ రైతుల ఆగ్రహం
- పోలీసుల జోక్యంతో ఆర్ఐ, వీఆర్ఏను వదిలేసిన గ్రామస్థులు

మల్యాల: పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారాంలో ఆదివారం రెవెన్యూ సదస్సు ఏర్పాటుచేయగా, మండలస్థాయి ఉన్నతాధికారులు ఎవరూ హాజరు కాకపోవడంతో ఆగ్రహించిన రైతులు రెవెన్యూ సిబ్బందిని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మల్యాల తాసిల్దార్ పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి గ్రామస్థాయి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాజారాంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించాల్సి ఉండగా.. అప్పటికప్పుడు ఆగమేఘాల మీద షెడ్యూల్‌ను ఆదివారానికి మార్చారు. ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గ్రామపంచాయతీ ఆవరణలో సదస్సు ప్రారంభం కావాల్సి ఉండగా.. గ్రామానికి వీఆర్వోను కేటాయించకపోవడంతో ఆర్ఐ హరీశ్‌రావు ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సదస్సులో భాగంగా ఆర్ఐ గ్రామ రెవెన్యూ సహాయకుడు గణేశ్‌తో కలిసి ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయానికి చేరుకొన్నారు. ఏండ్లుగా తమ భూసమస్యలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని పరిష్కరించడం లేదంటూ ఆర్ఐతో రైతులు వాగ్వాదానికి దిగారు. రెవెన్యూ సదస్సుకు మండల స్థాయి అధికారులు హాజరుకాకుండా కేవలం గ్రామస్థాయి అధికారులే వస్తే సమస్యలను ఎలా పరిష్కరించుకోగలమని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామానికి చెందిన కొంత మందికి రేషన్ కార్డుల జారీలో జాప్యం జరుగుతున్నదని, విరాసత్, మ్యుటేషన్, పాస్ పుస్తకాల జారీ, తప్పుల సవరణలో జాప్యం జరుగుతున్నదని మండిపడ్డారు. రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ ఆర్ఐ హరీశ్‌రావు, వీఆర్ఏ గణేశ్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. ఉన్నతాధికారులు వచ్చేవరకు వీరిని వదిలిపెట్టేది లేదని నినాదాలుచేశారు. విషయం తెలుసుకొన్న మల్యాల సీఐ నాగేందర్‌గౌడ్, ఎస్సై ఉపేంద్రాచారి అక్కడికివచ్చి గ్రామస్థులను సముదాయించి రెవెన్యూ సిబ్బందిని విడిపించారు. విధులకు ఆటంకం కలిగించిన పదిమంది గ్రామస్థులపై ఆర్ఐ హరీశ్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

మద్యం మత్తులో వ్యక్తి వీరంగం

నల్లగొండ సిటీ: వినాయక నిమజ్జనంలో నృత్యం చేయొద్దన్నందుకు ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. ఉత్సవ నిర్వాహకుడితోపాటు పలువురిపై కత్తితో దాడికి దిగాడు. ఈ ఘటన శనివారం రాత్రి నల్లగొండ జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీవో కాలనీ యువకులు వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు బయల్దేరారు. ప్రసాద్ ఉడిపీ హోటల్ వద్దకు రాగానే కత్తుల వికాస్ అనే వ్యక్తి వారితో కలిసి నృత్యం చేశాడు. రాత్రి 10 గంటలు కావడంతో బ్యాండ్ నిలిపివేయాలని పోలీసులు సూచించగా, మండప నిర్వాహకుడు వెంకటరమణ విగ్రహాన్ని అక్కడి నుంచి ముందుకు తీసుకెళ్లేందుకు యత్నించాడు. మద్యం మత్తులో ఉన్న వికాస్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగి, తన వద్ద ఉన్న కత్తితో వెంకటరమణతోపాటు నలుగురిపై దాడిచేశాడు. అక్కడే ఉన్న స్థానికులు వికాస్‌ను పట్టుకొని దేహశుద్ధి చేశారు. స్థానికుల దాడిలో తీవ్రంగా గాయపడిన వికాస్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

బీబీకా ఆలంలో సకల సౌకర్యాలు

హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మొహర్రం సందర్భంగా బీబీకా ఆలం అషూర్‌ఖానాను సందర్శించేవారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని హోంశాఖమంత్రి మహమూద్ అలీ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన బీబీకాఆలం అషూర్‌ఖానాను సందర్శించి మొహర్రం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఏర్పాట్లు బాగున్నాయని.. అధికారులు అన్ని వసతులు కల్పించారని తెలిపారు. మొహర్రం ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని అభినందించారు. మైనార్టీల పండుగల పట్ల సీఎం కేసీఆర్ ప్రత్యేకశ్రద్ధ చూపుతారని తెలిపారు.



ఆదివారం బీబీకా ఆలం అషూర్‌ఖానాను సందర్శించిన హోంమంత్రి మహమూద్‌అలీ

యూరియాపై నిరంతర పర్యవేక్షణ

- అదనపు వాహనాల్లో నేరుగా గ్రామాలకు తరలింపు
- ఆదివారం ఒక్కరోజే 16,374 మెట్రిక్ టన్నులు రవాణా
- యూరియా సరఫరాపై అధికారులతో మంత్రి సమీక్ష

హైదరాబాద్‌లోని హాకాభవన్‌లో యూరియా సరఫరాపై సమీక్షిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, అదనపు సంచాలకుడు విజయ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లా వ్యవసాయ అధికారులు యూరియా నిల్వలు, సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. యూరియాను అధికధరలకు విక్రయించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా సరఫరాపై ఆదివారం హైదరాబాద్‌లోని హాకాభవన్‌లో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. కేటాయించిన ప్రాంతాలకు యూరియా త్వరగా చేరేలా రాష్ట్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు వాహనాల ద్వారా నేరుగా గ్రామాలకు యూరియా చేరుస్తున్నామని, ఈ నెలలో ఇప్పటివరకు 33,800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని, ఆదివారం ఒక్కరోజే 16,374 మెట్రిక్ టన్నులు రేక్‌పాయింట్ల నుంచి రోడ్డుమార్గంలో గ్రామాలకు రవాణా అయినట్టు తెలిపారు. వివిధ పోర్టుల నుంచి, ఇతర రాష్ట్రాలనుంచి రైళ్ల ద్వారా 17 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వస్తున్నదని, రేక్‌పాయింట్ల నుంచి సోమవారం రాత్రికి గ్రామాలకు చేరుతుందని చెప్పారు. మరో 14 వేల మెట్రిక్ టన్నుల యూరియా లోడింగ్‌కు సిద్ధంగా ఉన్నదని, 12వ తేదీ వరకు రాష్ర్టానికి చేరుతుందని తెలిపారు. రోడ్డు మార్గంలో 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తున్నదని, నేరుగా ఎంపికచేసిన గ్రామాలకు వెళ్తుందని చెప్పారు. వచ్చే యూరియా సెప్టెంబర్ నెలలో అవసరం ఉన్న దానికన్నా అదనపు నిల్వ అని తెలిపారు. ఈ నెల 12 వరకు మొత్తం 90 వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతాంగానికి చేరుతుందని మంత్రి చెప్పారు. సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, అదనపు సంచాలకుడు విజయ్‌కుమార్, ఫెర్టిలైజర్ ఏడీఏ మాధవి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉంచండి

- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాగునీరు పుష్కలంగా అందడంతో ఈ ఏడాది వేరుశనగ సాగు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనాలను సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి విత్తనాభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. హాకాభవన్‌లో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు నల్లగొండ, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వేరుశనగ సాగుతోపాటు ఉత్పత్తి కూడా పెద్దఎత్తున పెరిగే అవకాశం ఉన్నదని మంత్రి అన్నారు. ఈ యాసంగిలో 60 నుంచి 70 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరమవుతాయని, గడిచిన మూడేండ్లలో వరుసగా 40 వేల క్వింటాళ్ల వరకు వినియోగించినట్టు అధికారులు మంత్రికి వివరించారు. ఈ ఏడాది సాగు ఆశాజనకంగా ఉన్నందున డిమాండ్ పెరిగిందని, యాసంగి రాకకుముందే రైతులు సిద్ధమవుతున్నట్టు మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఆగస్టు 21న విత్తనాల కోసం టెండర్లు పిలిచామని, తెలంగాణ సీడ్స్ సంస్థ వద్ద 10 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. అవసరమైన విత్తనాల సేకరణకు సంబంధించి టెండర్లు పిలిచే విషయమై మంత్రి సమీక్షించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, విత్తనాభివృద్ధిశాఖ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు తదితరులు పాల్గొన్నారు.

విరాసత్ చేస్తలేరు

- నాగర్‌కర్నూల్ జిల్లా వడ్డెమాన్‌వాసి ఆవేదన
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితుడు శ్రీశైలం

బిజినేపల్లి: విరాసత్ చేయాలని తాసిల్దార్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వడ్డెమాన్ గ్రామానికి చెందిన రైతు శ్రీశైలం 'ధర్మగంట'ను ఆశ్రయించారు. శ్రీశైలం తల్లి చంద్రకళ పేరిట గ్రామంలోని సర్వే నంబర్లు 62ఈ1లో పదిన్నర గుంటలు, 64/ఆలో ఏడు గుంటలు.. మొత్తం 17.5 గుంటల భూమి ఉన్నది. చంద్రకళ ఏడు నెలల కింద మరణించారు. తల్లి పేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసత్‌చేయాలని ఏడు నెలలుగా వీఆర్వో చుట్టూ తిరుగుతున్నా ప్రొసీడింగ్ ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, కానీ రికార్డుల్లో పేరు మాత్రం మారలేదని బాధితుడు వాపోయారు. మండల రెవెన్యూ అధికారులు కూడా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తన పేరు మీదకు భూమిని మార్పించాలని బాధితుడు శ్రీశైలం కోరారు.

రికార్డుల్లో ఎనిమిది గుంటలు మాయం

'ధర్మగంట'ను ఆశ్రయించిన గద్వాల జిల్లా బాధితుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ అధికారుల కారణంగా తనకు అన్యాయం జరిగిందని జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఉప్పల గ్రామానికి చెందిన పరశురాముడు ఆరోపించారు. తన తండ్రి పేరిట ఉప్పల గ్రామ శివారులో సర్వే నంబర్ 344/ఏలో ఉన్న 1.11 ఎకరాల భూమిని తన పేరిట గిఫ్ట్ డీడ్‌చేశారని పరశురాముడు తెలిపారు. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రికార్డులో 1.03 ఎకరాలు మాత్రమే నమోదైందని, మిగిలిన ఎనిమిది గుంటల భూమి రికార్డులో లేదని బాధితుడు వాపోయారు. అనేక సార్లు వీఆర్వో, ఆర్ఐ, సర్వేయర్, డిప్యూటీ తాసిల్దార్, తాసిల్దార్‌ను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకున్న మొత్తం భూమిని పాస్‌పుస్తకంలో నమోదుచేసి, రైతుబంధు అందేలా చూడాలని బాధితుడు కోరుతున్నారు.

70 శాతం ఆఫర్ పేరుతో భారీ మోసం

- రూ.3 కోట్లు వసూలుచేసి బోర్డు తిప్పేసిన ఆన్‌లైన్ సంస్థ
- నిర్వాహకుల్లో ఒకరు అరెస్టు.. పరారీలో మరొకరు

ఆదిత్య

తస్లీమ్ సయ్యద్

బేగంపేట: ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో వివిధ రకాల వస్తువులు విక్రయిస్తూ భారీ ఆఫర్ల పేరుతో ఉద్యోగులతోపాటు వినియోగదారుల నుంచి సుమారు రూ.3 కోట్లు వసూలుచేసి ఓ సంస్థ భారీ మోసానికి పాల్పడింది. సంస్థ నిర్వాహకుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. పరారీలో ఉన్న మరొకరి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పుణె నగరానికి చెందిన మహ్మద్ తస్లీమ్ సయ్యద్, ఆదిత్య అనే ఇద్దరు యువకులు ఈ ఏడాది జూలై 29న బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని అద్నాన్ చాంబర్స్‌లో హిమోగల్ టెక్నాలజీ అనే ఆన్‌లైన్ సంస్థను ఏర్పాటుచేశారు. కాల్‌సెంటర్ మార్కెటింగ్ పేరిట 87 మంది ఉద్యోగులను నియమించుకున్నారు. తొలుత కాల్‌సెంటర్ ఈవెంట్స్ మేనేజ్‌మెంట్ వంటి పనులు ఉంటాయని ఉద్యోగులకు చెప్పారు. తర్వాత ఉద్యోగులకు ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులను విక్రయించే పనిని అప్పగించారు. అనంతరం సంస్థ ఉద్యోగులకే వివిధ వస్తువులపై 70 శాతం ఆఫర్లు ప్రకటించారు. ఆఫర్ రెండునెలలు మాత్రమేనని నమ్మబలికారు. సంస్థ ఉద్యోగులతోపాటు వారి బంధువుల చేత కూడా ఎలక్ట్రానిక్ వస్తువులను ఆర్డర్ చేయించారు. రెండురోజుల తర్వాత 55 శాతం ఆఫర్ ప్రకటించారు. ఇందుకోసం వావ్‌జీ అనే యాప్‌ను సృష్టించారు. వినియోగదారులు పెద్దమొత్తంలో ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, సెల్‌ఫోన్లు, టీవీలు ఆర్డర్‌చేశారు. ఎక్కువశాతం మంది ఆన్‌లైన్‌లో నగదు చెల్లించారు. మరికొందరు నగదు కట్టి వస్తువులు తీసుకుంటామని బుక్ చేసుకున్నారు. నెల రోజుల్లో రెండువేల వరకు ఆర్డర్లు సంస్థకు అందాయి. వీటిలో చిన్నచిన్న వస్తువులను వినియోగదారులకు అందజేశారు. పెద్ద వాటిని పంపకుండా నిర్వాహకులు నిలిపివేశారు. బుక్ చేసుకున్న వస్తువులు రాకపోవడంతో వినియోగదారులు సంస్థ ఉద్యోగులపై ఒత్తిడి పెంచారు. ఏమిచేయాలో తెలియని ఉద్యోగులు బేగంపేట పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు సంస్థ నిర్వాహకుల్లో ఒకరైన తస్లీమ్ సయ్యద్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మరో నిందితుడు పరారీ ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసును సైబర్ క్రైం పోలీసులకు అప్పగించనున్నట్టు పేర్కొన్నారు.

కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలోని రంగ సముద్రం చెరువులో 51వేల చేప పిల్లలను ఆదివారం ఎమ్మెల్యే గంప గోవర్ధన్ వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని కుల వృత్తులకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. - భిక్కనూరు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి పీ కేశవరావు, రిటైర్డ్ హైకోర్టు జడ్జి బీ శివశంకర్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు వారికి స్వాగతం పలికారు. అనంతరం గర్భ గుడిలోని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. - భద్రాచలం, నమస్తే తెలంగాణ

పక్కా దర్యాప్తుతో పెరుగుతున్న శిక్షలు

- ఈ ఏడాది ఆగస్టు వరకు 67 మందికి జీవితఖైదు
- ఉత్తమ పనితీరు కనబర్చిన సిబ్బందికి డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రశంసలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాంకేతిక ఆధారాల సేకరణతో పోలీసులు చేస్తున్న పక్కా దర్యాప్తుతో నేరస్థులకు శిక్షలు పెరుగుతున్నాయి. ఫలితంగా ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా 67 మందికి జీవితఖైదు శిక్ష పడింది. కేసుల దర్యాప్తులో అత్యుత్తమ పనితీరు కనబర్చిన దర్యాప్తు అధికారులు (ఐవో), పబ్లిక్ ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్లు (పీపీ), కోర్టు డ్యూటీ అధికారులను డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నేరస్థులకు శిక్షపడేలా కేసు దర్యాప్తులను విజయవంతంగా నిర్వహించడంతోపాటు బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో విజయం సాధించారంటూ ట్విట్టర్ వేదికగా సిబ్బందికి డీజీపీ అభినందనలు తెలిపారు. కోర్టుల్లో కేసులు వీగిపోకుండా, బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరిగేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టడంపై పోలీస్‌శాఖ ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. వర్టికల్స్‌వారీగా పనిని విభజించడంతోపాటు కోర్టు విధులు, కీలక సిబ్బంది కేసు దర్యాప్తులో మరింతగా దృష్టిసారించేలా తీసుకొంటున్న ప్రత్యేక చర్యలు ఫలితాలిస్తున్నాయని చెప్పడానికి ఇదే నిదర్శనమని పోలీస్ ఉన్నతాధికారులు చెప్తున్నారు. జీవితఖైదు పడిన కేసుల సంఖ్య వివిధ పోలీస్ కమిషనరేట్లు, జిల్లాలవారీగా చూస్తే.. అత్యధికంగా హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10 మందికి జీవితఖైదు శిక్ష పడింది. రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఏడుగురు చొప్పున, రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఆరుగురికి, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఐదుగురికి, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నలుగురికి, ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో ముగ్గురికి, నల్లగొండ జిల్లాలో నలుగురు, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, మహబూబాబాద్, నిర్మల్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఇద్దరు చొప్పున, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, నాగర్‌కర్నూల్, మెదక్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఒక్కొక్కరి చొప్పున జీవితఖైదు పడినట్టు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.

కేఎల్ వర్సిటీ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో 2020 విద్యా సంవత్సరానికిగాను ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించే మెరిట్ స్కాలర్‌షిప్ ప్రవేశపరీక్ష పోస్టర్‌ను ఆదివారం హోం మంత్రి మహమూద్‌అలీ ఆవిష్కరించారు. కేఎల్ వర్సిటీ ప్రాంతీయ మేనేజర్లు మదన్, మానస ఆయన చాంబర్‌లో మంత్రిని కలిశారు. యూనివర్సిటీలో అమలవుతున్న విద్యావిధానం, విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్‌షిప్‌ల గురించి వివరించారు. విద్యార్థులకు పరిశోధనాత్మక విద్యను అందించేవిధంగా విద్యాప్రణాళిక ఉండాలని మహమూద్ అలీ వారికి సూచించారు.

రేవంత్‌రెడ్డి ఆరోపణలు సరికాదు

మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

ఖమ్మం ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: విద్యుత్ సంస్థల వివాదంలో ట్రాన్స్‌కో, జెన్కో సీఎండీ ప్రభాకర్‌రావుపై కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు సరికాదని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం జిలా కూసుమంచిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన సంభాని మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రభాకర్‌రావుపై రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు ముమ్మాటికి ఆక్షేపనీయమైనవంటూ వ్యాఖ్యానించారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం వలన కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో చులకన అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దమ్ముంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌పైన పోరాటం చేయాలి తప్ప అర్థంపర్థంలేని ఆరోపణలతో పార్టీ పరువును తీయొద్దన్నారు. ప్రజలు ప్రతి విషయాన్ని పరిశీలిస్తారనీ, ప్రజలకు అన్ని విషయాలు తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో జరుగుతున్న నష్టాన్ని గతంలో జరిగిన నష్టానికి కారకులు ఎవరనేది నాయకత్వం పరిశీలించాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలుగుదేశం హవా కొనసాగుతున్న రోజుల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఎన్నో విజయాలు సాధించి పెట్టానని, తనకు కూడా గతంలో, ఇప్పుడు ఎన్నో ఆఫర్లు వస్తున్నాయన్నారు. అయినా కాంగ్రెస్‌ను వీడేదిలేదని స్పష్టంచేశారు.

తెలంగాణకు కాళేశ్వరమే దిక్కు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ

ముకరంపుర: ఖర్చు ఎక్కువైనా నీళ్ల డిమాండ్ ఉన్నందున కాళేశ్వరం ప్రాజెక్టు పట్ల తాము సానుకూలంగా ఉన్నామనీ, ఎత్తిపోతలు తప్ప తెలంగాణకు మరో మార్గం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద కాల్వ వెంట ఉన్న చెరువులన్నింటినీ కాళేశ్వరం నీటితో నింపాలని ఆయన కోరారు. తమ పోరాటాల వల్లే అప్పట్లో తెలంగాణ భారత్‌లో విలీనమైందనీ చాడ పేర్కొన్నారు. బీజేపీ మాత్రం తెలంగాణ విలీనంపై దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు.

కత్తెరతో పొడిచి యువకుడి దారుణ హత్య

ప్రవీణ్ (ఫైల్)

తిమ్మాపూర్ రూరల్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ఆదివారం మధ్యాహ్నం ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కనపర్తి ప్రవీణ్(32), ఎర్రం అఖిల్ స్నేహితులు. ఇటీవల ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు రాగా, ప్రవీణ్ ఈ నెల 7న అఖిల్ ఇంటికి వెళ్లి చంపుతానని బెదిరించి గొడవ చేశాడు. ఈక్రమంలో అఖిల్ వస్త్రాలు కత్తిరించే కత్తెరతో ఆదివారం మధ్యాహ్నం ప్రవీణ్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేనిది చూసి వెంట తెచ్చుకున్న కత్తెరతో ప్రవీణ్‌పై దాడిచేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం విషయాన్ని పలువురు నాయకులకు ఫోనులో తెలిపిన అఖిల్ పోలీసులకు లొంగిపోయినట్టు సమాచారం. నిందితుడు పరారీలో ఉన్నాడనీ, త్వరలోనే పట్టుకుంటామని తిమ్మాపూర్ సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

ఆదివారం వరంగల్ నగరంలో కురుస్తున్న వర్షం

ఉమ్మడి వరంగల్‌లో ఓ మోస్తరు వర్షం

వరంగల్, నమస్తేతెలంగాణ నెట్‌వర్క్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివారం వర్షం కురిసింది. నగరంలో సాయంత్రం ఓ మోస్తరు వాన కురవడంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట, శాయంపేటలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం మెట్ట పంటలకు ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. ములుగు జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ములుగులో 2.2 మి.మీ., ఏటూరు నాగారంలో 3.6 మి.మీ., వాజేడులో 1,8, వెంకటాపురం (నూగూరు)లో 1.2 మి.మీ. జిల్లావ్యాప్తంగా 1.1 మి.మీ. సగటు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

శివరాంపల్లిలో పేలుడు కలకలం

- తీవ్రంగా గాయపడి నిజామాబాద్ వాసి మృతి
- రసాయన పదార్థాల పేలుడేనని తేల్చిన పోలీసులు
- డాగ్‌స్కాడ్‌తో పరిశీలన.. వివరాల సేకరణ

బండ్లగూడ: హైదరాబాద్‌లో భారీ పేలుడు కలకలం సృష్టించింది. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి ప్రాంతంలో ఆదివారం రసాయన పేలుడు ధాటికి ఓ వ్యక్తి మృతిచెందాడు. బాంబు పేలుడు జరిగిందని మొదట వదంతులు వ్యాప్తి చెందినప్పటికీ.. అది రసాయన పేలుడేనని పోలీసులు తేల్చిచెప్పారు. కాటేదాన్ ప్రాంతంలో రసాయన పరిశ్రమలు ఉన్నాయని, అక్కడినుంచి తీసుకొచ్చిన రసాయన పదార్థాలు కలిగిన బాక్స్ పేలి ఉండొచ్చని తెలిపారు. పోలీసులు, ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన సయ్యద్ ఖాజాఅలీ (45) పదేండ్లుగా చిత్తుకాగితాలు సేకరిస్తూ రాజేంద్రనగర్ ప్రాంతంలో జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం 10.30 గంటల సమయంలో పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 280 సమీపంలో సర్వీస్ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై చెత్త సేకరణలో భాగంగా దొరికిన ఓ బాక్స్‌ను అలీ తెరవగానే.. అది పెద్దశబ్దంతో పేలింది. పేలుడుధాటికి అలీ రెండుచేతులు విరిగి, తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో రాజేంద్రనగర్ ఏసీపీ అశోక చక్రవర్తి, ఇన్‌స్పెక్టర్ సురేశ్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. అలీని అంబులెన్స్‌లో ఉస్మానియా దవాఖానకు తరలించగా, చికిత్సపొందుతూ అతడు మృతిచెందాడు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్ర, కౌంటర్ ఇంటెలిజెన్స్ డీఐజీ రాజేశ్‌కుమార్, జాయింట్ కమిషనర్ తరుణ్ జోషి, శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు అక్కడకు చేరుకుని, ఘటన తీరుపై ఆరా తీశారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్, ఎస్వోటీ, ఆక్టోపస్, ఎస్బీ, టాస్క్‌ఫోర్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ బృందాలు ఘటనాస్థలికి చేరుకొని విచారణ ప్రారంభించాయి. పేలుడుధాటికి శిథిలమైన వస్తువులను ల్యాబ్‌కు పంపేలా చర్యలు చేపట్టాయి.

వదంతులను నమ్మొద్దు: సజ్జనార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్

రసాయనిక పదార్థాల కారణంగానే పేలుడు జరిగి ఉంటుందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. శివరాంపల్లిలో ఘటనాస్థలిని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిజామాబాద్‌కు చెందిన అలీ చెత్త ఏరుకుంటూ జీవించేవాడని చెప్పారు. అతనికి దొరికిన ఓ పెట్టెను తెరవగా, అందులో రసాయనిక పదార్థాలు ఉండటంతోనే పేలిందని వెల్లడించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని పేర్కొన్నారు. వదంతులను నమ్మొద్దని, అనుమానాస్పద వస్తువులు ఉంటే వాటిని ముట్టుకోకుండా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి విచారణను వేగవంతం చేస్తామని ఆయన తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు.

epaper.ntnews.com

బాలపాద స్తంభాలపై కొత్త డిజైన్లు

- హంసలు, లతలు, మయూరాల శిల్పాలు
- యాదాద్రిలో పనులు ప్రారంభించిన స్థపతి ఆనందాచార్యుల వేలు

యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ:

యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామివారి ఆలయంలో ఎలాంటి రాజకీయ చిహ్నాలు ఉండరాదన్న సీఎంవో కార్యాలయ ఆదేశాలతో స్థపతి డాక్టర్ ఆనందాచార్యుల వేలు ఆధ్వర్యంలో నూతన డిజైన్లకు మార్కింగ్ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. కట్టడాల్లో దైవసంబంధమైన చిహ్నాలు తప్ప మరే ఇతర గుర్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వైటీడీఏ వైస్ చైర్మన్ జీ కిషన్‌రావు ఆదేశాలతో యాదాద్రికి చేరుకొన్న స్థపతి బాలపాద స్తంభాలపై హంసలు, లతలు, మయూరాల శిల్పాలు చెక్కేందుకు మార్కింగ్ పనులను ప్రారంభించారు. దాదాపు 500 మంది శిల్పులు పని చేస్తుండటంతో రెండు, మూడు రోజుల్లోకొత్త శిల్పాలు పూర్తవుతాయని స్థపతి పేర్కొన్నారు.

యాదాద్రి ఆలయం స్తంభాలపై నూతన డిజైన్లతో శిల్పాలు చెక్కుతున్న శిల్పి

యాదాద్రి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రద్దీ కారణంగా భక్తులు లక్ష్మీనారసింహుడిని దర్శించుకునేందుకు గంటల కొద్దీ క్యూకట్టాల్సి వచ్చింది. శ్రీసత్యనారాయణ స్వామి వారి వత్రపూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సామూహిక వ్రతాలు పెద్ద ఎత్తున జరిగాయి. స్వామి వారి ఖజానాకు రూ. 9,91,143 ఆదాయం సమకూరింది.
- యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ

జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

కృష్ణాలో భారీగా ఇన్‌ఫ్లోలు

- బేసిన్‌లో ఎగువ నుంచి దిగువ వరకు కొనసాగుతున్న వరద
- ఆల్మట్టి నుంచి రెండు లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
- శ్రీశైలం జలాశయానికి 2.5లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హైదరాబాద్/ జోగుళాంబ గద్వాలప్రతినిధి/ నాగర్‌కర్నూలుప్రతినిధి, నమస్తే తెలంగాణ: కృష్ణా బేసిన్‌లో భారీ వరద కొనసాగుతున్నది. ఎగువన ఆల్మట్టి మొదలు దిగువన నాగార్జునసాగర్ వరకు ఇన్‌ఫ్లోలు పెద్దఎత్తున నమోదవుతున్నాయి. ఆదివారం ఆల్మట్టి నుంచి రెండు లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నారాయణపురకు 2.10 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. దాదాపు అంతేమేర దిగువ కు విడుదల చేస్తున్నారు. అటు ఉజ్జయిని నుంచి కూడా స్వల్పంగా వరద పెరగడంతో జూరాలకు భారీగా ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. మరోవైపు తుంగభద్ర పరవళ్లు తొక్కుతున్నది. తుంగభద్ర డ్యాం నుంచి అవుట్‌ఫ్లో లక్ష క్యూసెక్కులు దాటడంతో శ్రీశైలానికి 2.26లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయంలో నీటిమట్టాన్ని పెంచడంతోపాటు అధికారులు ఎడమ, కుడిగట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా కూడా దిగువకు నీటిని వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు 68 వేల క్యూసెక్కులకుపైగా వరద వస్తున్నది. సాగర్ నుంచి విద్యుదుత్పత్తిద్వారా దిగువకు నీటిని వదులుతున్నారు. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు స్వల్పంగా ఇన్‌ఫ్లోలు వస్తున్నాయి. శ్రీరాంసాగర్‌కు 11 వేల క్యూసెక్కులకుపైగా వరద వస్తుండగా.. కడెంకు స్వల్పంగా 152 క్యూసెక్కులు నమోదవుతున్నది. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి నీటివిడుదల కొనసాగుతుండటంతో లోయర్‌మానేరుకు 2,795 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది.

వివిధ ప్రాజెక్టుల్లో ఆదివారం నాటి నీటిమట్టాల వివరాలు..

రిజర్వాయర్	ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1705.00	1700.76	129.72	107.61	1,64,999	2,00,000
నారాయణపుర	1615.00	1612.34	37.64	35.06	2,10,000	2,18,700
ఉజ్జయిని	1630.00	1630.00	117.24	117.24	25,207	40,950
జూరాల	1045.00	1044.65	9.66	9.44	1,73,000	1,72,499
తుంగభద్ర	1633.00	1632.03	100.86	97.12	99,024	1,15,717
శ్రీశైలం	885.00	882.40	215.81	201.12	2,26,564	99,282
నాగార్జునసాగర్	590.00	587.10	312.05	305.57	68,972	52,256
పులిచింతల	175.00	174.90	45.77	45.62	22,913	31,231
సింగూరు	1717.93	1670.46	29.91	0.45	0	30
నిజాంసాగర్	1405.00	1379.92	17.18	1.28	1,020	31
శ్రీరాంసాగర్	1091.00	1070.50	90.31	29.93	11,817	501
లోయర్‌మానేరు	920.00	901.50	24.07	11.06	2,795	295
శ్రీ రాజరాజేశ్వర	1043.31	1009.61	25.873	8.26	0	4,414
కడెం	700.00	698.02	7.60	7.09	152	589
ఎల్లంపల్లి	485.56	472.07	20.18	10.83	0	0

గోదావరి ఉగ్రరూపం

లక్ష్మీబరాజ్‌కు రికార్డు స్థాయిలో ప్రాణహిత వరద

84 గేట్లు ఎత్తి దిగువకు నీటివిడుదల
దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 88 మీటర్ల ప్రవాహం
రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద 9.9 మీటర్ల ఎత్తులో జలాలు
పూసూరు బ్రిడ్జివద్ద ప్రమాదకరంగా ప్రవాహం
నీట మునిగిన కొంగాలవాగు చప్టా, పేరూరు మర్రిమగు వాగు బ్రిడ్జి
వాజేడు, గుమ్మడిదొడ్డి, పేరూరు, చంద్రుపట్ల మధ్య రాకపోకలకు బ్రేక్
భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ముల్లకట్ట బ్రిడ్జి వద్ద ఉధృతంగా పారుతున్న గోదావరి

మహదేవపూర్, ఏటూరునాగారం/మంగపేట/వాజేడు/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీబరాజ్‌కు గత పన్నెండేండ్లలో ఎన్నడూలేనివిధంగా నీటి ప్రవాహం వచ్చి చేరుతున్నది. దీంతో బరాజ్ 84 గేట్ల ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.600 మీటర్ల ఎత్తులో 7.259 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 12.67లక్షల ఇన్‌ఫ్లో, 12.70లక్షల ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది. ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద 9.920 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నది. కన్నాయిగూడెం మండలం దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 88 మీటర్లు, తుపాకులగూడెం బరాజ్ వద్ద 85.52 మీటర్లతో గోదావరి ప్రమాదస్థాయిలో పారుతున్నది. రామన్నగూడెం-రాంనగర్ గ్రామాల మధ్య జీడివాగుకు గోదావరి బ్యాక్‌వాటర్ చేరుకోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లోని పలు గ్రామాల్లో మిర్చి, వరి పొలాల్లోకి వరద చేరింది. మంగపేట పుష్కరఘాట్ మొత్తం నీట మునిగింది. గోదావరి పొంగి ఇక్కడి తీరంపైకి నీటిప్రవాహం రావడమే గాక, ఒడ్డు కోతకు గురవుతూ ఘాట్‌కు వచ్చే బీటీ రోడ్డు అంచుల దాకా చేరుకున్నాయి. దీంతో నది అంచులదాకా ఎవరూ వెళ్లొద్దని పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు హెచ్చరిక సూచికలు ఏర్పాటుచేశారు. వాజేడు మండలం పేరూరు వద్ద 46 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరుకున్నట్టు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. పూసూరు ముల్లకట్ట గోదావరి పుష్కర ఘాట్‌ను ఆనుకొని ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఉదయం 15 మీటర్లకు చేరుకున్న వరదనీరు సాయంత్రానికి కొంతమేర తగ్గి నిలకడగా ప్రవహిస్తున్నది. మండలకేంద్రం శివారులో ఉన్న కొంగాలవాగు లోలెవల్ చప్టా నీటి మునిగింది. వాజేడు గ్రామశివారు వరకు వరద నీరు చేరింది. దీంతో వాజేడు గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ఆర్టీసీ బస్సులను దారి మళ్లించారు. పేరూరు, చంద్రుపట్ల గ్రామాల మధ్య మర్రిమగు వాగు బ్రిడ్జిపై వరద నీరు చేరడంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

భద్రాచలం వద్ద 51 అడుగులకు గోదావరి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో 51 అడుగులకు చేరుకున్నది. శనివారం అర్ధరాత్రి మొదటి ప్రమాదహెచ్చరిక జారీచేయగా.. సాయంత్రానికి 48 అడుగులు కూడా దాటడంతో కలెక్టర్ రజత్‌కుమార్‌సైనీ ఆదివారం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 53 అడుగులు దాటితే మూడో ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం ఉన్నది. ప్రస్తుతం కరకట్ట వద్ద స్నానఘట్టాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

భద్రాచలం వద్ద నీట మునిగిన స్నానఘట్టాలు (ఇన్‌సెట్‌లో) నీటి మట్టం


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ బరాజ్ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

జలాభిషేకం

భద్రాచలం డివిజన్ పరిధిలో చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. దుమ్ముగూడెం మండలంలోని రెండు గ్రామాల్లోకి ఇప్పటికే వరద చేరింది. చర్లలో మండలంలో లోతట్టుప్రాంతాలకు ఇప్పుడిప్పుడే వరదనీరు చేరుతున్నది. గోదావరి నీటిమట్టం 55 అడుగులకు చేరితే పదుల సంఖ్యలో గ్రామాలు ఖాళీ చేయించే అవకాశం ఉన్నది.

హన్మకొండలో మీడియాతో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

సీఎం కేసీఆర్‌కు లక్ష్మణుడిగా ఉంటా..

ప్రభుత్వ చీఫ్‌విప్
దాస్యం వినయ్‌భాస్కర్

న్యూశాయంపేట(వరంగల్): సీఎం కేసీఆర్‌కు లక్ష్మణుడిగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హనుమంతుడిలా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేదాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్‌గా నియమితులైన సందర్భంగా దాస్యం ఆదివారం హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్యమం నుంచి వరంగల్‌లో టీఆర్ఎస్ పటిష్టంగా నిలదొక్కుకున్నదన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బంగారు తెలంగాణ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. కేటీఆర్ సలహాలు, సూచనలు తీసుకుంటూ పార్టీ బలోపేతానికి పనిచేస్తానని, నాయకులను కార్యకర్తలను కలుపుకొని వెళ్తానన్నారు. స్వరాష్ట్రం ఏర్పాటైన తరువాత సీఎం వరంగల్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ హైదరాబాద్ తరువాత అంతటి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారని వినయ్‌భాస్కర్ చెప్పారు. జిల్లాలో పార్టీ కా ర్యాలయాన్ని వచ్చే దసరాకు కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. తనకు చీఫ్‌విప్ పదవి ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, నగర డిప్యూటీ మేయర్ సిరాజొద్దీన్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగులకు మంత్రి పదవి దక్కడంతో కరీంనగర్‌లో హర్షం వ్యక్తం చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు

పువ్వాడకు మంత్రి పదవి రావడంతో ఖమ్మంలో ఆనందంతో రంగులు చల్లుకుంటున్న టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మెల్యే రేగా కాంతారావుకు విప్ పదవి దక్కినందుకు మణుగూరులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మిన్నంటిన సంబురాలు

మంత్రివర్గ విస్తరణతో టీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: మంత్రివర్గ విస్తరణలో తమ అభిమాన నేతలకు స్థానం లభించడంతో ఆదివారం ఆయా జిల్లాల్లో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. ఖమ్మం జిల్లా నుంచి పువ్వాడ అజయ్‌కుమార్‌కు మంత్రి పదవి దక్కడంతో ఆదివారం ఖమ్మం నగరంలో ఆయన అనుచరులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకొన్నారు. ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయం (తెలంగాణ భవన్)లో పార్టీ నాయకులు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఖమ్మం వీడిహోస్ కాలనీలోని పువ్వాడ అజయ్ క్యాంప్ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొన్నది. టీఆర్ఎస్ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ మురళీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖమర్ నేతృత్వంలో కేక్‌కట్ చేశారు. పెద్ద ఎత్తున పటాకులు కాల్చారు. రఘునాథపాలెం మండలంలో టీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కూసుమంచి మండలంలోనూ టీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు మంత్రి పదవి రావడంతో నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాల్లో మునిగిపోయారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద టీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ రమేశ్, మాజీ కార్పొరేటర్లు రవీందర్, బండారి వేణు, బుచ్చిరెడ్డి, నాయకులు రమణ, శ్యాం, శ్రీనివాస్, యూసుఫ్, మురళీ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ చౌక్‌లో టీఆర్ఎస్ నాయకురాలు రమ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. గంగుల కమలాకర్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ప్రభుత్వ విప్ పదవి దక్కడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన టీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంబురాల్లో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యం బాబు, నాయకులు వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

ఇద్దరు యువకుల మృతి

చెరువులోంచి కారును బయటకు తీస్తున్న గ్రామస్థులు

కొత్తగూడెం క్రైం: ప్రమాదవశాత్తు ఓ కారు చెరువులోకి దూసుకెళ్లి బోల్తాపడటంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లిలో ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఆళ్లపల్లి మండలం మైలారానికి చెందిన ఆరెం రాజబాబు(28), సీతారాంపురానికి చెందిన పాయం రవి(33) కలిసి శనివారం అదే మండలంలోని మర్కోడుకి కారులో వెళ్లి తిరిగొస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి వీరి కారు ఆళ్లపల్లి మలుపు వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న మడ్డుల చెరువులోకి దూసుకెళ్లింది. కారు సెంట్రల్ లాకింగ్ సిస్టం బ్లాక్ కావడంతో డోర్లు తెరుచుకోలేదు. ఆదివారం ఉదయం చెరువులో కారును గమనించిన స్థానికులు దానికి బయటకు తీశారు. కారులో ఇద్దరి మృతదేహాలను గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు.

కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో క్లినికల్ ట్రయల్స్‌పై డాక్యుమెంటరీ తీస్తున్న ఇటలీ దేశస్థులు

మరోసారి 'క్లినికల్ ట్రయల్స్' కలకలం

బాధితులపై డాక్యుమెంటరీ
తీస్తున్న ఇటలీ దేశస్థులు

జమ్మికుంట : కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 'క్లినికల్ ట్రయల్స్'పై డాక్యుమెంటరీ చిత్రీకరణ కలకలం రేపింది. ఔషధప్రయోగ బాధితులను, వారి కుటుంబాలను కలిసేందుకు ఇటలీకి చెందిన జూడియో, పాల్ అనే పరిశోధకులు ఆదివారం జమ్మికుంటకు వచ్చారు. సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీతో కలిసి బాధిత కుటుంబాలతో మాట్లాడి డాక్యుమెంటరీ తీశారు. 2017 జూన్ 2న జమ్మికుంట మండలం నాగంపేటకు చెందిన వంగర నాగరాజు మృతితో క్లినికల్ ట్రయల్స్ వెలుగులోకి వచ్చింది. అదే ఏడాది నవంబర్ 26న కొత్తపల్లికి చెందిన అశోక్, డిసెంబర్ 3న సురేశ్ ఔషధ ప్రయోగాల బారిన పడ్డారు. పోలీసుల దర్యాప్తుల్లో ఔషధ ప్రయోగాలు జరుగలేదని తేలడంతో వివాదం సద్దుమణిగింది. కాగా, ఆదివారం ఇటలీ పరిశోధకులు దీనిపై బాధితులతో డాక్యుమెంటరీ చిత్రీకరించడం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

మంచిర్యాల జిల్లాలో 'చెంబురాజు'

- బహిరంగ మలవిసర్జన చేసిన వ్యక్తికి బిరుదు ప్రదానం
- ఆపై రూ.500 జరిమానా

మందమర్రి రూరల్: బహిరంగ మలవిసర్జన చేసిన వ్యక్తికి 'చెంబు రాజు' బిరుదును ప్రదానం చేశారు అధికారులు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామంలో చోటుచేసుకున్నది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 30 రోజుల గ్రామ ప్రణాళికలో పరిసరాల పరిశుభ్రతను కూడా చేర్చారు. ముఖ్యంగా బహిరంగ మలవిసర్జన చేస్తే రూ.500 జరిమానా, చెంబు రాజు అనే బిరుదును అంకితం చేస్తామని అధికారులు ప్రకటించారు. కాగా, ఆదివారం మామిడిగట్టు గ్రామానికి చెందిన రాజయ్య చెంబు పట్టుకొని బహిరంగ మలవిసర్జనకు వెళ్తుండగా.. అక్కడి ప్రత్యేకాధికారి ముత్యం తిరుపతి, పంచాయతీ కార్యదర్శులకు తారస పడ్డాడు. వెంటనే అధికారులు నిబంధనల ప్రకారం ఆ వ్యక్తికి చెంబు రాజు అనే బిరుదును ప్రదానం చేయడంతోపాటు రూ.500 జరిమానా విధించారు. ప్రత్యేకాధికారి తిరుపతి మాట్లాడుతూ..గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే ధ్యేయంతో ప్రభుత్వం 30 రోజుల ప్రణాళికను రూపొందించిందన్నారు. ఇందులో రోడ్డు పక్కన చెత్త వేసే వారికి 'చెత్త రాజు' అనే బిరుదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 'దొంగ రాజు' అని బిరుదు ఇస్తామన్నారు. ప్రజల్లో మార్పు తేవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. కాగా.. గ్రామానికి రూ.5 వేలు విరాళమిస్తే 'మహారాజు' అని, రూ.10 వేలిస్తే 'మా ఊరి మహారాజు' అని, రూ. లక్షఫైనా ఇస్తే 'మా ఊరు మహా పోషకులు' అనే బిరుదులు ఇస్తున్నట్టు ఆయన చెప్పారు.

జొన్నపిండితో కాళోజీ విగ్రహం

కాళోజీ జయంతిని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడురుకు చెందిన కవి, సైకత శిల్పి రేవెళ్లి శంకర్ ఆదివారం జొన్నపిండితో తయారు చేసిన కాళోజీ నారాయణ రావు విగ్రహం. - అంతర్గాం

భూమి పత్రాలను అధికారులకు అప్పగిస్తున్న శశిపాల్‌రెడ్డి

గ్రామాభివృద్ధికి 20 గుంటల భూమి విరాళం

కోటపల్లి : గ్రామాలాభివృద్ధి కోసం ముందుకు రావాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపునకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అన్నారానికి చెందిన గొడిశెల శశిపాల్‌రెడ్డి స్పందించారు. 30 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాభివృద్ధికి ఆయన 20 గుంటల భూమిని విరాళంగా అందించారు. సుమారు రూ.4 లక్షల విలువ చేసే భూమిని గ్రామ పంచాయతీగా ఇచ్చిన దాతను గ్రామపంచాయితీ కోఆప్షన్ సభ్యునిగా నియమించారు.

నమస్తే తెలంగాణ
ఆట
8
[కలీంనగర్]
సోమవారం 9 సెప్టెంబర్ 2019
WWW.NTNEWS.COM

అండ్రెస్కు అద్భుతః

అకుంఠిత దీక్ష ముందు అనుభవం తలవంచింది. హోరాహోరీ పోరు ఖాయం అనుకుంటే.. కెనడా టీనేజ్ సంచలనం వన్‌సైడ్ విక్టరీ కొట్టింది. ప్రత్యర్థి అనుభవమంత వయసులేని కెనడా యువ సంచలనం బియాంక అండ్రెస్కు యూఎస్ ఓపెన్ టైటిల్ ఎగురేసుకెళ్లింది. ఈ టోర్నీకి ముందు కనీసం గ్రాండ్‌స్లామ్ రెండో రౌండ్‌కు చేరిన రికార్డు కూడా లేని ఓ అనామక ప్లేయర్ చూస్తుండగానే.. అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ చేతిలో నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. తద్వారా గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలిచిన తొలి కెనడా ప్లేయర్‌గా రికార్డు సృష్టించడమే కాక.. రష్యా క్రీడాకారిణి మారియా షరపోవా (2006, యూఎస్ ఓపెన్)తర్వాత గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన అతి పిన్న వయస్కురాలిగా చరిత్రకెక్కింది.

మాతృత్వపు మాధుర్యాన్ని రుచిచూశాక కూడా తనలో చేవతగ్గలేదని నిరూపించుకుంటున్న సెరెనా తుదిమెట్టుపై ఆకట్టుకోలేకపోయింది. తానాడిన గత మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనళ్ల మాదిరిగానే ఈసారి కూడా వరుస సెట్లలో ఓటమి పాలైంది. అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన మార్గరెట్ కోర్ట్ (24) రికార్డును సమం చేయాలని రెండేండ్లుగా కంకణం కట్టుకొని కూర్చున్న సెరెనాకు మరోసారి నిరాశ తప్పలేదు. గతేడాది ఇక్కడే ఒసాకా చేతిలో ఖంగుతిన్న సెరెనా.. ఈసారి బియాంక చేతిలో పరాజయం పాలైంది. 1999లో సెరెనా తొలిసారి యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సమయానికి ఇంకా భూమ్మీద అడుగుపెట్టని అండ్రెస్కు.. ఇప్పుడు తన అభిమాన తారను ఫైనల్లో మట్టికరిపించడం కొసమెరుపు.

యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన బియాంక..

ఫైనల్లో సెరెనా విలియమ్స్‌పై జయభేరి.. ఈ ఘనత సాధించిన తొలి కెనడా ప్లేయర్‌గా రికార్డు

న్యూయార్క్: సీజన్ ముగింపు టోర్నీ యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో అమెరికా స్టార్ ప్లేయర్ సెరెనా విలియమ్స్‌కు చుక్కెదురైంది. కెనడా యంగ్ తరంగ్ అండ్రెస్కూ రెచ్చిపోవడంతో.. వరుసగా నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోనూ సెరెనా రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో టీనేజ్ సంచలనం బియాంక అండ్రెస్కు 6-3, 7-5తో 23 గ్రాండ్‌స్లామ్‌ల విజేత సెరెనాను వరుస సెట్లలో చిత్తుచేసి తొలిసారి గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఒడిసి పట్టింది. ఓ కెనడా ప్లేయర్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గడం ఇదే తొలిసారి. గతంలో బౌచార్డ్ (2014) వింబుల్డన్ ఫైనల్లో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అత్యధిక గ్రాండ్‌స్లామ్ విజయాల రికార్డులో మార్గరెట్ కోర్ట్ (24, ఆస్ట్రేలియా)ను సమం చేయాలని రెండేండ్లుగా ప్రయత్నిస్తున్న సెరెనా (23 టైటిళ్లు)కు మరోసారి నిరాశ తప్పలేదు. 33వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన విలియమ్స్.. గత నాలుగు మేజర్ టోర్నీల్లోనూ తుదిమెట్టుపై తడబడింది. 2017 ఆస్ట్రేలియా ఓపెన్ నెగ్గిన అనంతరం రెండు వింబుల్డన్ ఫైనల్స్, రెండు యూఎస్ ఓపెన్ ఫైనల్స్‌లోనూ సెరెనా పరాజయం పాలైంది. 'అండ్రెస్కు నీకు అభినందనలు. నువ్వు సాధించిన ఘనతను చూసి దేశం గర్విస్తున్నది'అని కెనడా ప్రధాని జస్టిన్ ట్రిట్టర్ ద్వారా బియాంకను అభినందించడం.. ఆమె విజయం కెనడా యువతలో ఎంత ప్రభావం చూపుతుందనడానికి అద్దం పడుతున్నది. 26 వేల మంది ప్రేక్షకుల్లో దాదాపు 90 శాతం మంది.. లోకల్ స్టార్ సెరెనాకు మద్దతు తెలుపుతున్నా.. మొక్కవోని దీక్షతో పోరాడిన అండ్రెస్కు నయా చరిత్ర సృష్టించింది. గతేడాది యూఎస్ ఓపెన్ ఫైనల్లో నవోమీ ఒసాకా చేతిలో ఓడిన 37 ఏండ్ల సెరెనా విలియమ్స్‌కు ఇక్కడ వరుసగా ఇది రెండో పరాజయం. ఆ మ్యాచ్ అనంతరం అంపైర్‌తో వాగ్వాదానికి దిగి.. అప్రదను మూటగట్టుకున్న సెరెనా ఈ సారి ఎలాంటి భేషజాలకు పోకుండా ప్రత్యర్థిని మనస్ఫూర్తిగా అభినందించింది.

1 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన తొలి కెనడా క్రీడాకారిణిగా అండ్రెస్కు రికార్డుల్లోకెక్కింది.

8-0 ఈ సీజన్‌లో టాప్-10 క్రీడాకారిణులతో తలపడ్డ ఎనిమిది సార్లు బియాంక అండ్రెస్కునే విజయం వరించింది.

178 నుంచి టాప్-5లోకి..

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు చేరడానికి ముందు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే నెగ్గిన 19 ఏండ్ల బియాంక.. కొడితే కుంభస్థలాన్నే కొట్టాలి అన్న చందంగా చెలరేగింది. ఎదురులేని అటాకింగ్.. ధీటైన డిఫెన్స్‌తో విజృంభించిన అండ్రెస్కు అనుకున్నది సాధించింది. ఫైనల్ చేరే క్రమంలో దిగ్గజ క్రీడాకారిణులను చిత్తుచేసిన బియాంక.. తుదిపోరులో తన ఆరాధ్య క్రీడాకారిణి సెరెనాకు చెమటలు పట్టించింది. తొలి సెట్‌ను ఏకపక్షంగా చేజిక్కించుకున్న అండ్రెస్కు.. రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైనా.. పట్టు వదలకుండా విజయం సాధించింది. తద్వారా స్వెత్లానా కుజ్నెత్సోవా (రష్యా, 2004) తర్వాత పిన్న వయసులో యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది. అండ్రెస్కుకు 3.85 మిలియన్ డాలర్ల (రూ. 27.59 కోట్లు) ప్రైజ్‌మనీ లభించగా.. నేడు విడుదలకానున్న ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆమె ఐదో ర్యాంక్‌కు చేరనుంది.

ఎదురులేని ఆటతీరుతో..

మ్యాచ్ మొత్తంలో సెరెనా 9 ఏస్‌లు సంధిస్తే.. బియాంక 5 మాత్రమే కొట్టింది. అయితే విలియమ్స్ 8 డబుల్ ఫాల్ట్స్ చేస్తే.. అండ్రెస్కు కేవలం 3 డబుల్ ఫాల్ట్స్ చేసింది. సెరెనా 8 బ్రేక్ పాయింట్ అవకాశాల్లో మూడింటిని సద్వినియోగం చేసుకుంటే.. అండ్రెస్కు పదమూడింట 6 నెగ్గింది. మొదటి సెట్‌లో బియాంక 4-2తో ఉన్న దశలో వరుసగా ఐదు బ్రేక్ పాయింట్లు కాచుకున్న సెరెనా తిరిగి పుంజుకునేందుకు యత్నించినా.. బియాంక గట్టిగా పోరాడింది. ఇక అదే ఊపులో సెట్‌ను సొంతం చేసుకున్న బియాంక.. రెండో సెట్‌లో 5-1తో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించింది. మరికాసేపట్లోనే మ్యాచ్ ముగుస్తుందనుకుంటున్న దశలో సెరెనా చక్కటి పోరాటంతో మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చింది. 17 పాయింట్లలో 14 పాయింట్లు నెగ్గిన విలియమ్స్ స్కోరును 5-5తో సమం చేసి మంచి ఊపులో కనిపించింది. అయినా బియాంక వరుసగా రెండు గేమ్‌లు నెగ్గి 7-5తో మ్యాచ్‌ను సొంతం చేసుకొని సగర్వంగా టైటిల్‌ను ముద్దాడింది.

మూడేండ్ల కల నెరవేరిన వేళ..

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

'ఈ స్థాయిలో నేను ఓడిపోదల్చుకోలేదు. అందుకే ప్రతీ మ్యాచ్‌లో నా అత్యుత్తమ ఆటతీరు కనబర్చేందుకు యత్నించా.. అదే నన్ను ఈ స్థానంలో నిలబెట్టింది'సెరెనాను ఓడించిన అనంతరం బియాంక నోటి వెంట వచ్చిన మాటలివి. ఈ మాటలు ఆమెలోని విజయకాంక్షకు అద్దంపడతాయి. ఇప్పటి వరకు కనీసం గ్రాండ్‌స్లామ్ టోర్నీ రెండో రౌండ్‌కు చేరని ఓ టీనేజ్ అమ్మాయి. ఏకంగా 23 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల ఖాతాలో వేసుకున్న టెన్నిస్ లెజెండ్‌ను ఓడించడం అంటే మామూలు మాటలా.. కానీ బియాంక అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపింది. గత సీజన్‌ను 178వ ర్యాంకుతో ముగించిన అండ్రెస్కు ఈ సీజన్ ఆరంభం నుంచే అద్భుతాలు చేసింది. ఈ ఏడాది టాప్-10 క్రీడాకారిణులతో 8 సార్లు తలపడ్డ బియాంక అందులో ఒక్కరి చేతిలో కూడా పరాజయం పాలవలేదు.

బియాంక తల్లిదండ్రులు రొమేనియా నుంచి వలస వచ్చి కెనడాలో స్థిరపడ్డారు. జూనియర్ స్థాయిలో అండ్రెస్కు విజయాలను చూసి పొంగిపోయిన వాళ్లు ఇంకా ముందుకెళ్లాలని ప్రోత్సహించారు. అయితే మూడేండ్ల క్రితం (16 ఏండ్ల వయసులో) 'ఆరెంజ్ బౌల్'టైటిల్ నెగ్గే వరకు బియాంక ఆటపై పెద్దగా ఇష్టం కనబర్చలేదు. కానీ ఆ విజయం ఆమెలో ఆత్మవిశ్వాసం నింపింది. 'ఈ టోర్నమెంట్ నెగ్గగలిగానంటే.. గ్రాండ్‌స్లామ్ టైటిల్ కూడా గెలవొచ్చు'అనే ఆలోచన ఆ క్షణంలోనే పుట్టింది. ఇక అక్కడి నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేసిన అండ్రెస్కు చూస్తుండగానే తనలక్ష్యం వైపు వడివడిగా అడుగులు వేసింది. 1997లో యూఎస్ ఓపెన్ అరంగేట్రంలోనే ఫైనల్ చేరిన వీనస్ విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకున్న బియాంక మూడేండ్ల క్రితం కన్న కలను శనివారం నిజం చేసుకుంది. టెన్నిస్ క్రీడ గురించి కాస్తో కూస్తో తెలిసిన ప్రతి ఒక్కరికీ ఈ ఆటలో కంటికి, చేతికి ఉండే సమన్వయం గురించి తెలిసే ఉంటుంది. సరిగ్గా అక్కడే వందకు వంద పాయింట్లు కొట్టేసిన అండ్రెస్కు టోర్నీ మొత్తంలో ఎక్కడా ఒత్తిడికి లోనుకాలేదు. క్వార్టర్స్ వరకు టైటిల్ కంటెండర్‌గా కనిపించని బియాంక సెమీస్‌లో బెన్‌కిక్‌తో పోరులో అసమాన పోరాటంతో వరుస సెట్లలో విజయం సాధించింది. ఫైనల్లోనూ అదే జోరు కనబరుస్తూ.. సెరెనాను మట్టికరిపించింది.

విజయానందంలో అండ్రెస్కు

> నా ఆనందాన్ని మాటల్లో వర్ణించడం చాలా కష్టం. ఈ క్షణం కోసం నేను ఎంతో కష్టపడ్డా. నేనెప్పటి నుంచో కలలు కన్న సీజన్ ఇది. చాలా గొప్పగా సాగింది. టెన్నిస్ లెజెండ్ సెరెనాపై గెలువడం మరిచిపోలేని అనుభూతి. ప్రత్యర్థి ఎవరనే విషయాన్ని పక్కనపెట్టి ఒక్కో గేమ్‌పై దృష్టి సారించుకుంటూ ఇక్కడి వరకు వచ్చా. ఏడాది క్రితం యూఎస్ ఓపెన్ ఫైనల్ చేరుతానని కూడా నేను ఊహించలేదు. నా కఠోర శ్రమకు ఫలితం దక్కిందనుకుంటున్నా. గడ్డు పరిస్థితులే మనిషిని మరింత రాటుదేల్చుతాయని నేను నమ్ముతా. ఇలాంటి ఓ రోజు వస్తుందని నేను ముందే ఊహించా. ఆ ఊహే ఈ రోజు కార్యరూపం దాల్చింది. **- అండ్రెస్కు**

> అండ్రెస్కు నమ్మశక్యం కాని రీతిలో ఆడింది. ఆమె ఆట చూసి గర్విస్తున్నా. ఏ మాటకామాట చెప్పుకోవాలంటే టోర్నమెంట్ మొత్తంలో ఈ మ్యాచ్‌లోనే నేను చెత్తగా ఆడా. బియాంక అద్భుతంగా ఆడింది. ఆమె రిటర్న్‌లు నాపై ఒత్తిడి పెంచాయి. కానీ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో నా ఆటతీరు సమర్థనీయం కాదు. దీని కన్నా నేను బాగా ఆడగలను. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా పరాజయాలను పక్కనపెట్టి ముందుకు సాగాలనుకుంటున్నా. నేను మార్గరెట్ రికార్డును ఛేదించాలనే ఉద్దేశంతో బరిలో దిగడం లేదు. గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గేందుకే ఆడుతున్నా. **- సెరెనా**

విదేశీ కోచ్ వల్ల మేలే

ప్రపంచ చాంపియన్ సింధు వ్యాఖ్య

ముంబై: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా అవతరించిన తెలుగు షట్లర్ పీవీ సింధుకు ప్రశంసలు, సత్కారాలు కొనసాగుతున్నాయి. చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకంతో మెరిసిన ఆమెను సహారా ఇండియా పరివార్ ఆదివారం ఇక్కడ సన్మానించింది. అనంతరం సింధు మాట్లాడుతూ చాంపియన్‌షిప్ కోసం ఎంతో కాలం నుంచి కఠోరంగా శ్రమించానని చెప్పింది. తన విదేశీ కోచ్ కిమ్ జి హ్యూన్ చేసిన మార్పులు తన ఆటను మెరుగుపరుచుకునేందుకు ఉపయోగపడ్డాయని వెల్లడించింది. ఆమె సలహాలు తన ఆటపై చాలా ప్రభావాన్ని చూపాయని చెప్పింది. 'ఆమె (కిమ్ జి హ్యూన్) సూచించిన కొన్ని మార్పులను కోచ్ గోపీచంద్ దిశానిర్దేశంలో పాటించా. మంచి ఫలితాలు వచ్చాయి. నైపుణ్యాన్ని చాలా పెంచుకున్నా. ఇంకా మెరుగవ్వాలి'అని సింధు చెప్పింది. ఫైనల్ ఒకుహరతో అని తెలిసినా.. గత మ్యాచ్‌ల ప్రభావం తనపై ఏ మాత్రం పడలేదని, తాను ఎప్పుడూ సానుకూలంగానే ఉంటానని ఆమె వెల్లడించింది. 'ఒకుహరపై అంతకు ముందు ఓడిపోయానన్న విషయం గుర్తే రాలేదు. నేను చాలా సానుకూలంగా ఉన్నా. ఫైనల్ అంటే మరో మ్యాచ్ అంతే. చాంపియన్‌షిప్ కోసం చాలా కాలంగా సన్నద్ధమయ్యా. చెన్ యూఫీ, ఒకుహర లాంటి ప్లేయర్లతో ఆడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. విభిన్నంగా ఆడాలి. అందుకే దూకుడుగా, చురుగ్గా కదులు తూ ఆడా. అలా ఆడడం చాలా అవసరం. మ్యాచ్ గురించే కాకుండా ప్రతీ పాయింట్ సాధించాలని ఆలోచిస్తా'అని సింధు చెప్పింది.

తప్పైంది.. క్షమించండి!

బీసీసీఐకి దినేశ్ కార్తీక్ లేఖ

న్యూఢిల్లీ: నిబంధనలకు విరుద్ధంగా కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లో ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్ (టీకేఆర్) జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చోవడంతో పాటు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు టీమ్‌ఇండియా క్రికెటర్ దినేశ్ కార్తీక్‌కు బీసీసీఐ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాంట్రాక్టును ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ వివరణ సైతం కోరింది. ఈ నోటీసులపై కార్తీక్ ఆదివారం స్పందించాడు. బీసీసీఐకు బేషరతుగా క్షమాపణలు చెప్పాడు. 'సరైన అనుమతి తీసుకోకుండా ఇలా చేసినందుకు బీసీసీఐకి బేషరతుగా క్షమాపణలు చెబుతున్నా. ఇక నుంచి టీకేఆర్ జట్టుకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనను. అలాగే జట్టులో ఎలాంటి బాధ్యత వహించను' అని బీసీసీఐకు రాసిన లేఖలో కార్తీక్ పేర్కొన్నాడు.

బ్రాత్‌వైట్ బౌలింగ్‌పై అనుమానాలు

దుబాయి: వెస్టిండీస్ ఆటగాడు క్రైగ్ బ్రాత్‌వైట్ బౌలింగ్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారత్‌తో రెండో టెస్టులో బ్రాత్‌వైట్ బౌలింగ్ యాక్షన్ అనుమానాస్పదంగా ఉందంటూ తమకు అధికారిక నివేదిక అందిందని ఐసీసీ ప్రకటించింది. సాధారణంగా ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అయిన బ్రాత్‌వైట్ ఉపయుక్తమైన ఆఫ్‌స్పిన్ కూడా వేయగలడు. ఈ నెల 14లోగా అతడు బౌలింగ్ యాక్షన్ పరీక్ష కోసం హాజరు కావాల్సి ఉంటుందని ఐసీసీ పేర్కొంది. అయితే ఆ పరీక్ష ఫలితాలు వచ్చే వరకు బ్రాత్‌వైట్ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడవచ్చు.

యువ ఆటగాళ్లపైనే కన్ను

నేటి నుంచి సఫారీ-ఏతో భారత్-ఏ అనధికారిక తొలి టెస్టు



తిరువనంతపురం: దక్షిణాఫ్రికా-ఏపై వన్డే సిరీస్‌ను చెజిక్కించుకున్న భారత్-ఏ జట్టు టెస్టు పోరుకు సన్నద్ధమైంది. ఇరు జట్ల మధ్య రెండు టెస్టుల అనధికార సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ సోమవారం ఇక్కడ ప్రారంభం కానుంది. కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న యువ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్ ఈ సిరీస్‌లోనూ అదరగొట్టి.. సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగే టెస్టు సిరీస్ కోసం టీమ్‌ఇండియా తలుపులు తట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. అలాగే ఆంధ్రా వికెట్ కీపర్ కేఎస్ భరత్, కర్ణాటక ఆల్‌రౌండర్ కృష్ణప్ప గౌతమ్‌పై అందరి కండ్లు ఉండనున్నాయి. అలాగే ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌కు కూడా ఈ సిరీస్ ఎంతో కీలకం కానుంది. శివమ్ దూబే, నదీమ్ లాంటి మరికొంత మంది ఆటగాళ్లు ఈ సిరీస్‌లో రాణించి సెలెక్టర్లను మెప్పించాలని పట్టుదలగా ఉన్నారు.

ఆసీస్‌దే యాషెస్

మాంచెస్టర్: బ్యాటింగ్‌లో మాజీ సారథి స్టీవ్ స్మిత్, బౌలింగ్‌లో పేసర్లు సమిష్టిగా అదరగొట్టడంతో ప్రతిష్ఠాత్మక యాషెస్ ట్రోఫీని ఆస్ట్రేలియా నిలబెట్టుకుంది. ఇంగ్లిష్ గడ్డపై యాషెస్ చేజారకుండా కాపాడుకోవడం 19ఏళ్లలో ఆసీస్‌కు ఇది తొలిసారి. చివరి వరకు ఉత్కంఠగా సాగిన నాలుగో టెస్టులో 185 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపు

జట్టు 197 పరుగులకు కుప్పకూలింది. ఆసీస్ పేసర్లు ప్యాట్ కమిన్స్(4/43), హజిల్‌వుడ్(2/31) రాణించారు. ఓవర్‌నైట్ స్కోరు 18/2 వద్ద ఐదో రోజు ఆటకు దిగిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ మ్యాచ్‌ను డ్రా చేసేందుకు తీవ్రంగా కష్టపడ్డారు. డెన్లీ(123 బంతుల్లో 53), జేసన్ రాయ్(67 బంతుల్లో 31), బెయిర్‌స్టో(61 బంతుల్లో 25), బట్లర్(111 బంతుల్లో 34) డిఫెన్స్‌తో ప్రతిఘటించినా ఇంగ్లండ్ ఒడ్డుకు చేరలేకపోయింది. చివర్లో ఓవర్టన్(21) సైతం 105 బంతులాడి లీచ్(51 బంతుల్లో 12)తో కలిసి శ్రమించాడు. ఈ జోడీని ఆసీస్ పార్ట్‌టైం బౌలర్ లబుషేన్ విడదీయగా... చివరి వికెట్‌గా ఓవర్టన్‌ను హజిల్‌వుడ్ వెనక్కి పంపాడు.

నాలుగో టెస్టులో 185 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపు

మెరిసిన నవీన్, మిరాజ్

తలైవాస్‌పై ఢిల్లీ విజయం

కోల్‌కతా: గత మ్యాచ్‌లో ఓడిన దబంగ్ ఢిల్లీ తిరిగి పుంజుకుంది. ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 50-34తో తమిళ్ తలైవాస్‌ను చిత్తు చేసింది. నవీన్(17 పాయింట్లు), మిరాజ్ (12 పాయింట్లు) ఆకట్టుకోవడంతో ఢిల్లీ అలవోకగా గెలుపొందింది. తలైవాస్ తరపున రాహుల్ (14 పాయింట్లు) రాణించినా.. అతడికి సహకారం లభించకపోవడంతో తమిళ తంబీలకు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో బెంగాల్ 42-39తో పుణెపై నెగ్గింది.

గెలుపు దిశగా ఆఫ్ఘన్

రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా 136/6

చిట్టగాంగ్: స్పిన్నర్లు రషీద్ ఖాన్(3/46), జహీర్ ఖాన్(2/36) విజృంభణతో బంగ్లాదేశ్‌తో ఏకైక టెస్టులో ఆఫ్ఘనిస్తాన్ చరిత్రాత్మక విజయానికి 4 వికెట్ల దూరంలో నిలిచింది. ఆదివారం నాలుగో రోజు 398 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ ఆట ముగిసే సమయానికి 136 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం ఆతిథ్య జట్టు ఇంకా 262 పరుగులు వెనుకబడి ఉంది. సారథి షకీబ్ (39), సౌమ్యా సర్కార్(0) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో రెచ్చిపోయిన ఆఫ్ఘన్ కెప్టెన్ రషీద్ ఖాన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ఒక దశలో ఆదివారం మ్యాచ్ ఫలితం తేలే లా కనిపించినా.. వర్షం అడ్డుపడటంతో ఆట నిర్ణీత సమయం కంటే ముందే ముగిసింది. అంతకుముందు వర్షం కారణంగా రెండు గంటల ఆలస్యంగా ఆట ప్రారంభం కాగా, ఓవర్‌నైట్ స్కోరు 237/8తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆఫ్ఘన్ 260 పరుగులకు ఆలౌటైంది.

లెక్లెర్క్‌దే ఇటలీ గ్రాండ్ ప్రి

మోన్జా: బ్రిటర్ స్టార్ లూయిస్ హామిల్టన్‌ను వెనక్కి నెట్టి ఇటలీ గ్రాండ్ ప్రిలో ఫెరారీ రేసర్ చార్లెస్ లెక్లెర్క్ విజేతగా నిలిచాడు. 2010 తర్వాత ఈ రేస్ గెలిచిన తొలి ఫెరారీ డ్రైవర్‌గా రికార్డు సృష్టించాడు. ఆదివారం చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన మెర్సెడెస్ డ్రైవర్లు వాల్తెరి బొటాస్, హామిల్టన్ నుంచి లెక్లెర్క్ తీవ్ర పోటీని ఎదుర్కొన్నాడు. మరోవైపు ట్రాక్ వెలుపలికి వెళ్లి ప్రమాదకరంగా తిరిగి వచ్చినందుకు పెనాల్టీని ఎదుర్కొన్న ఫెరారీ జట్టులోని మరో రేసర్ సెబాస్టియన్ వెటెల్ 13వ స్థానంలో నిలిచి నిరాశ పరిచాడు.

దక్షిణ ముంబైలో చ.అ.రూ.56 వేల పైనే

దేశంలోనే అత్యంత ఖరీదైన నివాస ప్రాంతంగా రికార్డు.. అనరాక్ ప్రాపర్టీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: దక్షిణ ముంబైలోని టార్డియో అత్యంత ఖరీదైన నివాస ప్రాంతంగా నిలిచింది. ఇక్కడ చదరపు అడుగు (ఎస్ఎఫ్టీ)రికార్డు స్థాయిలో రూ.56 వేల పైనే పలికింది. సగటున రూ.56,200లుగా నమోదైనట్లు ప్రాపర్టీ కన్సల్టెంట్ అనరాక్ చైర్మన్ అనుజ్ పూరి తెలియజేశారు. అనరాక్ విడుదల చేసిన టాప్-5లో ముంబైలోని వొర్లి, మహాలక్ష్మి ఏరియాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. వొర్లిలో చదరపు అడుగు స్థలం రూ.41,500, మహాలక్ష్మిలో రూ.40,000లుగా ఉన్నది. చెన్నై నుంగంబాక్కం నాల్గవ స్థానంలో నిలిచింది. ఇక్కడ సగటు ధర రూ.18,000లుగా నమోదైంది.

చైనా ఎగుమతులకు అమెరికా గండి

బీజింగ్, సెప్టెంబర్ 8: అమెరికాతో వాణిజ్య యుద్ధం సెగ.. చైనాకు గట్టిగానే తగులుతున్నది. గత నెల ఆ దేశ ఎగుమతులు క్షీణించాయి మరి. ఆగస్టులో 1 శాతం పడిపోయినట్లు ఆదివారం విడుదలైన చైనా అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జూలైలో ఆశ్చర్యకరంగా 3.3 శాతం పెరిగిన నేపథ్యంలో ఆగస్టులో 1 శాతం క్షీణించడం గమనార్హం. కాగా, అమెరికాతో చైనా వాణిజ్య మిగులు కూడా దిగివచ్చింది. ఆగస్టులో 34.83 బిలియన్ డాలర్లుగా ఉంటే, అంతకుముందు నెల 44.58 బిలియన్ డాలర్లు ఉన్నది. దిగుమతులు కూడా 5.6 శాతం తగ్గాయి. ఈ రెండు అగ్రదేశాల వాణిజ్య యుద్ధం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిని బలి తీసుకుంటున్న నేపథ్యంలో వచ్చే నెల మళ్లీ చర్చలకు అమెరికా-చైనా సిద్ధమవుతున్నాయి.

రూ.32 వేల కోట్ల బ్యాంక్ మోసాలు

తొలి త్రైమాసికంలో 18 పీఎస్‌బీల్లో నమోదైన 2,480 కేసులు

ఎస్బీఐలోనే అధికం.. స.హ చట్టం ద్వారా వెల్లడి

ఇండోర్, సెప్టెంబర్ 8: బ్యాంకింగ్ మోసాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వడం లేదని మరోసారి రుజువైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 18 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 2,480 మోసాలు జరిగినట్లు ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్న ద్వారా వెల్లడైంది. వీటి విలువ నికరంగా రూ. 31,898.63 కోట్లు. దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)లో అత్యధికంగా 38 శాతం మోసాలు జరిగినట్లు నీముచ్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త చంద్రశేఖర్ పీటీఐకి వెల్లడించారు. ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు ఈ సమాచారం లభించినట్లు ఆయన చెప్పారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో ఎస్బీఐలో 1,197 మోసాలు జరిగాయి. వీటి విలువ రూ.12 వేల కోట్లకు పైమాటే. ఎస్బీఐ తర్వాత అత్యధికంగా అలహాబాద్ బ్యాంక్‌లో మోసాలు జరిగినట్లు ఈ సమాచారం మేరకు వెల్లడైంది. ఈ బ్యాంక్‌లో రూ.2,855.46 కోట్ల విలువైన 381 మోసాలు జరిగాయి. బ్యాంకింగ్ మోసాల జాబితాలో 99 కేసులతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మూడోస్థానంలో నిలిచింది. వీటి విలువ రూ.2,526.55 కోట్లని పేర్కొంది. ఈ బ్యాంకింగ్ మోసాలపై రిజర్వు బ్యాంక్ ఎలాంటి సమాచారాన్ని వెల్లడించలేదు. గత త్రైమాసికంలో మోసాల ద్వారా బ్యాంకులు ఎంతమేర నష్టపోయాయో, ఎన్ని మోసాలు జరిగాయన్న విషయంపై మా వద్ద ఎలాంటి సమాచారం లేదని ఆర్బీఐ స్పష్టంచేసింది. వీటితోపాటు బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)లో 75 కేసులు నమోదవగా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ)లో 45, కెనరా బ్యాంక్‌లో 69 కేసులు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 194 కేసులు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 31 కేసులు నమోదైనట్లు తెలిసింది. అలాగే కార్పొరేషన్ బ్యాంక్‌లో 16 కేసులు నమోదవగా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో 46 కేసులు, సిండికేట్ బ్యాంక్‌లో 54, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 51, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 42, యూకో బ్యాంక్‌లో 34 కేసులు దాఖలయ్యాయి. వీటితోపాటు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఆంధ్రా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో కూడా మోసాలు జరిగినట్లు ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు సమాచారం వెల్లడైంది. 2018-19లో బ్యాంకింగ్ రంగంలో 71వేల కోట్ల మోసాలు జరిగాయి.

తొలి త్రైమాసికంలో ప్రభుత్వ బ్యాంకుల్లో మోసాలు

బ్యాంక్	మోసాల కేసులు	విలువ(కోట్లలో)
ఎస్బీఐ	1,197	12,012.77
అలహాబాద్	381	2,855.46
పీఎన్బీ	99	2,526.55
బీవోబీ	75	2,297.05
ఓబీసీ	45	2,133.08
కెనరా	69	2,035.81
సెంట్రల్ బ్యాంక్	194	1,982.27
యునైటెడ్ బ్యాంక్	31	1,196.19
కార్పొరేషన్	16	960.80
ఐవోబీ	46	934.67
సిండికేట్	54	795.75
యూనియన్ బ్యాంక్	51	753.37
బీవోఐ	42	517
యూకో	34	470.74

12 బ్యాంకులు చాలు!

బ్యాంకుల విలీనాలను ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్ సమర్థించారు. దేశంలో 12 బ్యాంకులు చాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను నాలుగు బ్యాంకులుగా మార్చాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ విలీనాలతో దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య 2017తో పోల్చితే 27 నుంచి 12కు తగ్గింది. ఈ నేపథ్యంలోనే రాజీవ్ కుమార్ పైవిధంగా వ్యాఖ్యానించారు. 12 బ్యాంకులు దాదాపుగా చాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశా రు. ఇందులో ఆరు ప్రపంచ స్థాయి బ్యాంకులున్నాయని చెప్పారు. ఇప్పటికే ఎస్బీఐలో ఐదు అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంక్ కలువగా, బీవోబీలో విజ యా, దేనా బ్యాంక్‌లు విలీనమైన సంగతి విదితమే. ఈ క్రమంలో మరో నాలుగు బ్యాంకుల ఏకీకరణ జరుగుతున్నది. పీఎన్బీలో ఓబీసీ, యునైటెడ్ బ్యాంక్‌లు, కెనరాలో సిండికేట్, యూనియన్ బ్యాంక్‌లో కార్పొరేషన్, ఆంధ్రా బ్యాంక్‌లు, ఇండియన్ బ్యాంక్‌లో అలహాబాద్ బ్యాంక్ కలిసిపోతున్నాయి.

రోల్స్ రాయిస్‌పై ఈడీ కన్నెర్ర

మనీ లాండరింగ్ కింద క్రిమినల్ కేసు నమోదు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: లండన్‌కు చెందిన రోల్స్ రాయిస్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గట్టి షాకిచ్చింది. ప్రభుత్వరంగ సంస్థలైన హెచ్ఏఎల్, ఓఎన్జీసీ, గెయిల్‌ల నుంచి కాంట్రాక్టు పొందడానికి 2007 నుంచి 2011 మధ్యకాలంలో మధ్యవర్తికి సంస్థ రూ.77 కోట్ల చెల్లింపులు జరిపినట్లు తేలింది. ఈ ఆరోపణల నేపథ్యంలో కంపెనీకి వ్యతిరేకంగా మనీ లాండరింగ్ కింద కేసును దాఖలు చేసినట్లు ఈడీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ) కింద కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ క్రిమినల్ కేసును దాఖలు చేసింది. రోల్స్ రాయిస్‌కు చెందిన ఇండియన్ సబ్సిడరీ, సింగపూర్‌కు చెందిన అశోక్ పట్నీ, ఆశామోర్ ప్రైవేట్ లిమిటెడ్‌లతోపాటు ముంబైకు చెందిన టర్బోటెక్ ఎనర్జీ సర్వీసెస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రైవేట్ సంస్థలు..ప్రభుత్వరంగ సంస్థలైన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్జీసీ), గెయిల్‌ల నుంచి ఆర్డర్లు పొందడానికి లంచం ఇవ్వచూపినట్లు సీబీఐ ఇప్పటికే కేసును దాఖలు చేసింది. 2000 నుంచి 2013 మధ్యకాలంలో హెచ్ఏఎల్ నుంచి రోల్స్ రాయిస్ రూ.4,700 కోట్ల ఆర్డర్ పొందింది. ప్రతిఫలంగా రూ.18 కోట్లను పట్నీకి చెల్లింపులు జరిపింది. రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన సీబీఐ..ఈ కేసును సుదీర్ఘకాలంగా ఐదేండ్లపాటు విచారించింది. ఈ విషయంపై రోల్స్ రాయిస్ వర్గాలు స్పందిస్తూ..ప్రస్తుతం భారత్‌లో ఏ సంస్థతో కలిసి పనిచేయడం లేదని, భారత మార్కెట్ చాలా కీలమని, ఇక్కడ నైపుణ్యం కలిగిన ఎంతోమంది కార్మికులను అందించినట్లు చెప్పారు. విడిభాగాలను సరఫరా చేయడానికి రోల్స్ రాయిస్‌తోపాటు ఓఎన్జీసీ, గెయిల్‌తో పట్నీ ఒప్పందం కుదుర్చుకున్నది. 2007 నుంచి 2011 మధ్యకాలంలో ఓఎన్జీసీ నుంచి పొందిన ఆర్డర్లలో 73 ఆర్డర్లను సరఫరా చేసినందుకుగాను రోల్స్ రాయిస్ రూ.29.81 కోట్లను ముట్టచెప్పింది. సంస్థ నుంచి రోల్స్ రాయిస్ పది లక్షల పౌండ్ల ఆర్డర్లను పొందినట్లు సీబీఐ వెల్లడించింది. అలాగే గెయిల్ నుంచి పొందిన ఆర్డర్‌కుగాను రూ.28.08 కోట్లు చెల్లించింది.

బీవోఐ పండుగ ఆఫర్

■ ప్రాసెసింగ్ చార్జీలు ఎత్తివేత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) పండుగ ఆఫర్‌ను ప్రకటించింది. గృహ రుణాలపై ప్రత్యేక వడ్డీ ఆఫర్‌తోపాటు అన్ని రకాల రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలను ఎత్తివేస్తున్నట్లు బ్యాంక్ జనరల్ మేనేజర్ సలీల్ కుమార్ స్వైన్ తెలిపారు. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రూ.30 లక్షల లోపు గృహ రుణాలు తీసుకున్నవారికి వార్షిక వడ్డీని 8.35 శాతం ఆఫర్ చేస్తున్నది. అంతకంటే ఎక్కువ రుణాలను రెపో రేటుకు లింక్ చేయబోతున్నట్లు ఆయన చెప్పారు. ఇదే సమయంలో విద్యా రుణాలను తక్కువ వడ్డీకి అందిస్తున్నది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణాలు అందించడంలో భాగంగా బ్యాంక్ ప్రకటించిన వెల్‌కమ్ ఆఫర్ కింద రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్ల లోపు రుణం తీసుకున్న వారికి తక్కువ వడ్డీకే ఆఫర్ చేస్తున్నది. గత నెలలో బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ పలు ఆఫర్లను ప్రకటించిన విషయం తెలిసిందే.

అమ్మకానికి పీఎన్‌బీ 11 నిరర్థక ఆస్తులు

రూ.1,234 కోట్లను రికవరీ చేయాలనుకుంటున్న బ్యాంక్

మొండి బకాయిలతో సతమతమవుతున్న ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) వీటిని వదిలించుకోవడానికి ప్రయత్నాలను వేగిరతం చేసింది. బ్యాంక్‌కు చెందిన 11 నిరర్థక ఆస్తులను విక్రయించడం ద్వారా రూ.1,234 కోట్ల రుణాలను రికవరీ చేయాలనుకుంటున్నది. ఈ ఆస్తుల కొనుగోలుకు సంబంధించి ఏఆర్‌సీఎస్/ఎన్‌బీఎఫ్‌సీఎస్/బ్యాంకులు/ఆర్థిక ఇనిస్టిట్యూట్‌ల నుంచి బిడ్డింగ్‌లను ఆహ్వానించింది. బ్యాంక్‌కు విసా స్టీల్ బకాయిపడిన రూ.441.83 కోట్ల ఖాతాతోపాటు ఇండ్‌భారత్ ఎనర్జీ(ఉత్కల్) రూ.414.23 కోట్లు, అస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.113.57 కోట్లు, ఓమ్ శివ్ ఏస్టేట్స్‌కు సంబంధించిన రూ.100.16 కోట్లు ఉన్నాయి. విక్రయించనున్నవాటిలో వంద శాతం నగదు రూపంలోనే ఉన్నాయని బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆస్తులు కొనుగోలు చేయాలనుకునేవారు ఈ నెల 12 నుంచి 20 లోగా తమ బిడ్డింగ్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. 21న బిడ్డింగ్‌లను బ్యాంక్ బహిర్గతం చేయనున్నది.

స్థూల ఆర్థికాంశాలు కీలకం

■ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్న ఐఐపీ, ద్రవ్యోల్బణం

■ మంగళవారం ఈక్విటీ మార్కెట్లకు సెలవు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: దేశీయ స్థూల ఆర్థికాంశాలు ఈవారం స్టాక్ మార్కెట్లకు కీలకంకాబోతున్నాయి. ఈవారంలో విడుదలకానున్న పారిశ్రామిక వృద్ధిరేటు, ద్రవ్యోల్బణ గణాంకాలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. మంగళవారం మొహర్రం సందర్భంగా స్టాక్ మార్కెట్లు మూసివేసివుంచనుండటంతో ఈవారంలో కేవలం నాలుగు రోజులు మాత్రమే ట్రేడింగ్ జరుగనున్నది. పారిశ్రామిక వృద్ధిరేటుతోపాటు తయారీ రంగ గణాంకాలు, ద్రవ్యోల్బణ సూచీల ఆధారంగా ఈక్విటీలు ట్రేడింగ్ కానున్నాయని ఎపిక్ రీసర్చ్ సీఈవో ముస్తఫా నదీమ్ తెలిపారు. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం కొంత ఆందోళనకు గురి చేస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకు మొగ్గుచూపడం స్టాక్ మార్కెట్లపై ఆశావాద పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నదన్నారు. గురువారం ఐఐపీ, ద్రవ్యోల్బణం, తయారీ రంగ గణాంకాలు విడుదలకానున్నాయి. వాణిజ్య యుద్ధంపై అమెరికా-చైనా దేశాల మధ్య చర్చలు వచ్చే నెలలో జరుగనుండటం మార్కెట్లకు ఊరటనిచ్చే అంశమని ఆయన వ్యాఖ్యానించారు. అమ్మకాలు పడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ సంస్థలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో ఈ రంగ షేర్లు లైమ్‌లైట్‌లోకి రావచ్చునన్నారు. వాహన సంస్థలను ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు, జీఎస్టీ తగ్గింపుపై కౌన్సిల్ నిర్ణయం తీసుకోనున్నదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలు మార్కెట్లకు ఊతమివ్వనున్నాయన్నారు. వీటితోపాటు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం కదలికలు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే అంశాలని ఆయన పేర్కొన్నారు.

భారీగా నష్టపోయిన బ్లూచిప్ సంస్థలు

స్టాక్ మార్కెట్ల పతనంతో బ్లూచిప్ సంస్థలు తమ మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను భారీగా కోల్పోతున్నాయి. గడిచిన వారంలో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీలతోపాటు టాప్-10లోని ఆరు సంస్థలు నికరంగా రూ.87,973 కోట్ల మార్కెట్ క్యాప్‌ను కోల్పోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్‌లు తమ ఎం-క్యాప్‌ను కోల్పోగా..హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐలు లాభపడ్డాయి.

సర్చార్జి ఎత్తివేసినప్పటికీ...

■ కొనసాగుతున్న ఎఫ్‌పీఐల నిధుల ఉపసంహరణ

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులపై విధించిన సర్చార్జిని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసినప్పటికీ ఈక్విటీ మార్కెట్ల నుంచి నిధుల ఉపసంహరణ ఆగడం లేదు. ప్రస్తుత నెల తొలివారంలోనూ ఎఫ్‌పీఐలు దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి రూ.1,263 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. తాజాగా డిపాజిటరీ వద్ద ఉన్న నివేదిక ప్రకారం ఈ నెల 3 నుంచి 6 మధ్యకాలంలో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.4,263.79 కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ), ఇదే సమయంలో డెబిట్ మార్కెట్లలో రూ.3,000.86 కోట్ల నిధులను చొప్పించారు. నికరంగా రూ.1,262.93 కోట్లు ఉపసంహరించుకున్నట్లు అయింది. ఈ నెల 2న వినాయక చవితి సందర్భంగా మార్కెట్లు పనిచేయలేవు. ఆగస్టులో 5,920.02 కోట్లను వెనక్కితీసుకున్న ఎఫ్‌పీఐలు..జూలైలోనూ రూ.2,985.88 కోట్లను తరలించుకుపోయారు. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటంతో అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో ఆందోళను పెంచిందని, దేశ వృద్ధిరేటు కూడా నిరాశావాదంగా ఉండటం మదుపరుల్లో ఆందోళనను మరింత పెంచిందని గ్రౌవ్ సీవోవో హర్ష జైన్ తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నాటి నుంచి ఇప్పటివరకు రూ.30 వేల కోట్ల పెట్టుబడులను విదేశీ పెట్టుబడిదారులు ఉపసంహరించుకున్నారు.

మాంద్యం మహమ్మారి

■ దేశ ఆర్థిక వ్యవస్థను నిలువెల్లా కొల్లగొడుతున్న మందగమనం

■ వృద్ధిరేటు మూలాలను హరిస్తున్న నిస్తేజపు ఛాయలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 5 శాతానికి పడిపోయింది. మార్చి 2013 నుంచి చూస్తే ఇదే అత్యల్పం. నాడు 4.7 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ దరిదాపుల్లోకి జీడీపీ వెళ్లడం ఇదే. ఇక వరుసగా ఐదు త్రైమాసికాలు వృద్ధిరేటు పతనం చెందడం 1997 నుంచి గమనిస్తే తొలిసారి. గతేడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికం నుంచి వృద్ధిరేటు క్రమేణా దిగిపోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ జూలై-సెప్టెంబర్ కాలంలోనూ వృద్ధిరేటు 5 శాతానికి దిగువకు క్షీణిస్తే వరుసగా ఆరు త్రైమాసికాలు దిగజారినట్లు. ఇలా ఆరు త్రైమాసికాలు వరుసగా జీడీపీ పతనం కావడం మాత్రం ఇదే మొదటిసారి అవుతుంది.

వినియోగ సామర్థ్యం కుదేలు

భారత జీడీపీలో ప్రైవేట్ రంగ వినియోగ సామర్థ్యం పాత్ర అంతా ఇంతా కాదు. అలాంటిది ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ప్రైవేట్ తుది వినియోగ వ్యయం (పీఎఫ్‌సీఈ) 3 శాతంగానే ఉన్నది. ఇక గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఇది 3.1 శాతంగానే నమోదైంది. పీఎఫ్‌సీఈ వృద్ధిరేటు 5.6 శాతం క్షీణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ స్థాయిలో వినియోగ సామర్థ్యం పడిపోతే అమ్మకాలు సహజంగానే ప్రభావితం అవుతాయని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ సామర్థ్యం కుదేలైంది. పట్టణ ప్రాంతాల్లోనూ వినియోగదారుల సెంటిమెంట్ దెబ్బతిన్నది.

పెట్టుబడులకు విఘాతం

అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం భయాలు ఇప్పటికే భారత్ వంటి దేశాలను వణికిస్తుండగా, మాంద్యం ప్రభావం.. దేశ ఎగుమతులకున్న అవకాశాలకు గండి కొడుతున్నది. దీంతో పెట్టుబడులకు విఘాతం కలుగుతుండగా, స్టాక్ మార్కెట్ల నుంచి రిటైల్ మార్కెట్ల వరకు ఈ ప్రభావం కనిపిస్తున్నది. దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లో కదలాడుతున్నది చూస్తూనే ఉన్నాం. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను ఏ స్థాయిలో వెనుకకు తీసుకుంటున్నారో గమనిస్తూనే ఉన్నాం.

కీలక రంగాల్లో స్తబ్ధత

దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మాంద్యం.. కీలక రంగాల్లో స్తబ్ధతకు దారితీస్తున్నది. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో కనిపిస్తున్న నిస్తేజపు ఛాయలు.. మార్కెట్ వృద్ధిని గాయపరుస్తున్నాయి. ఈ పరిణామం నూతన ప్రాజెక్టులకు ఇబ్బందికరంగా మారుతున్నది. వ్యాపార విస్తరణ అవకాశాలకూ గండి కొడుతున్నది. కీలక రంగాల్లో మందగమనం దేశ ఆర్థిక వ్యవస్థకు మంచిది కాదంటూ ఇప్పటికే నిపుణులు హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే.

బాండ్ల రాబడిపై ప్రభావం

ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న అనిశ్చితి.. బాండ్ల రాబడినీ ప్రభావితం చేస్తున్నది. 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత భారత జీడీపీ అధిక వృద్ధితో పరుగులు పెట్టింది. అయితే ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థల్లోనూ ఇప్పుడు ఇలాంటి గడ్డు పరిస్థితులే ఉండగా, అటు ఆర్బీఐ, ఇటు కేంద్రం ఆధారపడిన బాండ్ల కొనుగోళ్లకూ మందగమనం అడ్డుగా నిలుస్తున్నది. విదేశీ మదుపరులు వీటిపై పెట్టుబడులకు ఆసక్తి చూపకపోతే ప్రభుత్వ పెట్టుబడులకు ఇబ్బంది తప్పదు.

తలసరి ఆదాయం తలకిందులు

మాంద్యం దెబ్బకు తలసరి ఆదాయం తలకిందులు అవుతున్నది. ఆదాయంలో క్షీణత, ఉద్యోగాల తొలగింపులు వంటి పరిణామాలు ప్రజల ఆర్థిక పరిస్థితుల్లో మార్పులకు కారణమవుతున్నాయి. వృద్ధిరేటు పెరిగితే తప్ప.. మళ్లీ తలసరి ఆదాయం పుంజుకోదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆదాయ వనరులు సజీవంగా ఉంటేనే.. దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉంటుందని చెబుతున్నారు. కాబట్టి మాంద్యాన్ని పారద్రోలేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పెట్టుబడులపై సుజుకీ వెనక్కి!

వ్యాపార విస్తరణకోసం గతంలో భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించిన ఆటోమొబైల్ సంస్థలు ప్రస్తుతం వెనక్కితగ్గుతున్నాయి. ఇప్పటికే మారుతి, మహీంద్రా, హ్యుందాయ్‌లు తమ భవిష్యత్తు ప్రణాళికను వెనక్కితీసుకోగా..తాజాగా ఈ జాబితాలోకి సుజుకీ మోటార్ ఇండియా చేసింది. ఆటోమొబైల్ రంగంలో ఉన్న మందకొడి పరిస్థితుల కారణంగా ద్విచక్ర వాహన ఉత్పత్తిని తగ్గించుకుంటున్నట్లు కంపెనీ సీనియర్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వీటికితోడు వచ్చే ఏప్రిల్ నుంచి బీఎస్-6 ప్రమాణాలు అమలులోకి రానుండటం సంస్థలు గడ్డు పరిస్థితిని ఎదుర్కొక తప్పదని ఆయన హెచ్చరించారు. వాహన విక్రయాలు సింగిల్ డిజిట్‌కు పరిమితంకాగా, ద్విచక్ర వాహనాలు మాత్రం రెండంకెల వృద్ధిని కనబరిచాయి. ప్రస్తుతం సంస్థకు గురుగ్రామ్‌లో ఉన్న ప్లాంట్ ద్వారా ప్రతియేటా 10 లక్షల వాహనాలను ప్రొడ్యుస్ చేస్తున్నది. వీటిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా 8 లక్షల వాహనాలను విక్రయించనుండగా, లక్ష యూనిట్లను ఇతర దేశాలకు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం గణాంకాలు కూడా మందగమనం దెబ్బకు ప్రభావితం అవుతున్నాయి. అటు రిటైల్ ద్రవ్యోల్బణం, ఇటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణం తిరిగి కోరలు చాస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆహార ద్రవ్యోల్బణం సైతం మళ్లీ విజృంభిస్తున్న దాఖలాలున్నాయి. దీంతో ద్రవ్యోల్బణం అదుపు తప్పితే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆందోళన వద్దు

– జవడేకర్

దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలు వద్దని, భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు చాలా పటిష్ఠంగా ఉన్నాయని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్ అన్నారు. మందగమనం అనేది నిరంతర ప్రక్రియలో ఓ భాగమన్న ఆయన ఇలాంటివి దేశ ప్రగతిని దెబ్బతీయవని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సాగిన 100 రోజుల పాలనపై ఆయన ఆదివారం ఇక్కడ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మందగమనం.. మార్కెట్లను, ప్రజల ప్రవర్తనా శైలిని మారుస్తున్నప్పటికీ, అతిగా ఆందోళన చెందాల్సిన అవసరమైతే లేదు' అన్నారు. నిజానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటూనే ఉందన్నారు. తర్వలోనే పరిస్థితులు చక్కబడగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పన్ను వసూళ్లలో క్షీణత

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నామినల్ జీడీపీని 12 శాతంగా అంచనా వేశారు. అయితే 8 శాతానికే ఇది పరిమితం కావడం.. పన్ను వసూళ్లలో భారీ క్షీణతలకు సంకేతాలనిస్తున్నది. ఇప్పటికే వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రాకతో పన్నుల ఆదాయం ఖజానాకు తగ్గింది. నామినల్ జీడీపీ తగ్గడం.. మరింత పన్ను ఆదాయం తగ్గుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఆదాయం పన్ను (ఐటీ), కార్పొరేట్ ట్యాక్స్, జీఎస్టీ వసూళ్లు ప్రభావితమవుతున్నాయి.

ఆర్బీఐ పాలసీపై ఒత్తిడి

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్ల కోతలతో ఎంతగా దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిద్దామని చూస్తున్నా.. మాంద్యం కారణంగా అది నెరవేరడం లేదు. పెట్టుబడిదారులను ఆకర్షించినా ఫలితం లేకుండా పోతున్నది. ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్వహించిన ప్రతిసారి దేశ జీడీపీ పురోగతిపై ఆర్బీఐ కొంత ఆందోళన వ్యక్తం చేస్తుండటం కూడా పెట్టుబడులను ఆటంకపరుస్తున్నది.

జీడీపీ అంచనాలకు దెబ్బ

ప్రస్తుత మందగమనం.. దేశ ఆర్థిక వ్యవస్థకు అదనపు సవాళ్లను విసురుతున్నది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వానికి. ఎందుకంటే నామినల్ జీడీపీ వృద్ధి కుప్పకూలుతున్నది. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 8 శాతంగానే నమోదైంది. జీడీపీ అంచనాలు తలకిందులు కావడం వల్ల ప్రభుత్వ ఆదాయ, వ్యయాలే ప్రభావితమవుతున్నాయి.

నిరుద్యోగం

పడిపోతున్న అమ్మకాలు.. ఉద్యోగుల తొలగింపులకు కారణమవుతున్నాయి. ఆటో రంగం పరిస్థితి చూస్తూనే ఉన్నాం. మూడు లక్షలకుపైగా ఉద్యోగాలను మాంద్యం మహమ్మారి పొట్టనబెట్టుకున్నది. మరో 10 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. నిర్మాణ రంగంలోనూ లక్షలాది అసంఘటిత రంగ కార్మికులు ఉపాధిని కోల్పోయారు. దీంతో దేశంలో మళ్లీ నిరుద్యోగ భూతం బలం పుంజుకుంటున్నది. పట్టణ ప్రాంతాల్లో 2017-18లో మహిళల నిరుద్యోగ రేటు 27.2 శాతంగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో 13.6 శాతంగా ఉన్నది. పురుషుల విషయానికొస్తే గ్రామాల్లో 17.4 శాతం, పట్టణాల్లో 18.7 శాతంగా ఉన్నది.

మహాభక్త గణపతి

7 లక్షల మందికిపైగా దర్శనం
భక్తజనసంద్రంగా ఖైరతాబాద్

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మినీ మేడారాన్ని తలపించింది. శ్రీ ద్వాదశాదిత్య మహాగణపతిని ఆదివారం ఒక్కరోజే 7 లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకూ స్వామిని దర్శించుకొనేందుకు బారులు తీరడంతో ఈసంఖ్య మరింత పెరుగొచ్చని తెలిపారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఖైరతాబాద్ ప్రాంతం రద్దీగా మారింది. గణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో ఎల్బీనగర్ –మియాపూర్ మార్గంలో మెట్రోరైళ్లు కిక్కిరిశాయి. ఒక్క ఖైరతాబాద్ మెట్రోస్టేషన్‌లోనే ఆదివారం 40 వేల మంది దిగగా, అక్కడి నుంచి 30 వేలమంది రైలు ఎక్కడం ద్వారా మొత్తం 70 వేల మంది ప్రయాణించినట్టు మెట్రోరైలు వర్గాలు ప్రకటించాయి.

ఆదివారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తజన సందోహం

మహాగణపతికి సీఎం సతీమణి ప్రత్యేక పూజలు

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సతీమణి శోభ, మంత్రి కేటీఆర్ సతీమణి శైలిమ ఆదివారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని గణపతిని వేడుకున్నారు.

- ఖైరతాబాద్

ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు

టీయాప్‌ఫోలియో ద్వారా సులభ దర్శనం, మెరుగైన సేవలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆలయాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది. రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో భక్తులకు సౌకర్యాల కల్పన, ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. టీయాప్‌ఫోలియోను (TAPPFOLIO) మొబైల్ యాప్, మీ సేవ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సుప్రభాతం, అభిషేకం, అర్చన, వ్రతాలు, హోమాలు, వాహనసేవలు, దర్శనం, గదుల బుకింగ్, ఇతర సేవలను ఆన్‌లైన్ విధానంలో అధికారులు అందిస్తున్నారు. పెరుగుతున్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, వేములవాడ రాజరాజేశ్వరుడు, భద్రాచలం శ్రీరామచంద్రుడు, బాసర సరస్వతీ అమ్మవారు, ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ, కర్మన్‌ఘాట్ హనుమాన్, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, వరంగల్ భద్రకాళి, జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆన్‌లైన్ సేవలతో విలువైన సమయం ఆదా కావడంతోపాటు పారదర్శకత పెరిగి, దళారుల ప్రమేయం లేకుండా సులభ దర్శనం, సేవలు పొందే అవకాశం ఏర్పడింది.

యువతను చురకత్తులా చేసిన తెలంగాణ ఉద్యమం

పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన లాంగ్‌మార్చ్ నవలా పరిచయసభకు హాజరైన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, నమస్తే తెలంగాణ సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్, వాగ్గేయకారుడు గోరటి వెంకన్న తదితరులు

కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు ఏలె లక్ష్మణ్ అప్పటికప్పుడు వేసిన చిత్రం

'లాంగ్ మార్చ్' నవల పరిచయసభలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఉద్యమం యువతను చురకత్తుల్లా చేసిందని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం– ఎస్టీఆర్ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం పెద్దింటి అశోక్‌కుమార్ రచించిన 'లాంగ్ మార్చ్' నవల పరిచయసభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తంరెడ్డి తరువాత తాను అత్యంత ఇష్టపడే రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ అని, ఈ నవలను చదువుతున్నంతసేపు ఉద్విగ్నానికి గురయ్యానని, నవలను ఒకసారి చదివితే తెలంగాణ ఉద్యమం ఏమిటో.. తెలంగాణలోని స్థితిగతులేమిటో మొత్తంగా అర్థమవుతాయని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమకాలంలో మిలియన్ మార్చ్‌కు రైతులు, విద్యార్థులు ఎట్లా కదిలివచ్చిన్రో ఈ నవల చెప్తుందని అన్నారు. తెలంగాణ సాహిత్యం గ్రామీణ వాతావరణం నుంచి వచ్చిందని, అందుకే గ్రామీణ నేపథ్యంలోని మాండలికాలు, నుడికారాలతోనే అశోక్‌కుమార్ నవలను రచించారని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్ మాట్లాడుతూ.. మిలియన్ మార్చ్ ఉద్విగ్నమైన ఘటన.. దానిపై చాలా సునిశితంగా రాశారని అన్నారు. నవలలోని చిత్రీకరణ అంతా చాలా నేర్పు, ఓర్పుగా సాగిందని చెప్పారు. కవి, గాయకుడు, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ పోరాటం పురిటి నొప్పులు పడుతున్న దశలో అంకురించిన రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ అని, తాను చేయాల్సిన పాత్రను చాలా అద్భుతంగా చేశాడని అన్నారు. నమస్తే తెలంగాణ సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాధన ప్రజల చరిత్ర అని, దానికి సంబంధించి ఒక నవల రావడం శుభ పరిణామమని, రచయిత అశోక్‌కుమార్ నవలను చాలా గొప్పగా రాశారని ప్రశంసించారు. ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణలోని సంక్షోభాన్ని గుర్తించిన మొదటి రచయిత అశోక్‌కుమార్ అని, నవలలో రచయిత ఎంచుకున్న పద్ధతి బాగుందని అన్నారు. కార్యక్రమంలో వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం దేవేంద్ర మాట్లాడిన అనంతరం, రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ తాను రాసిన నవల 'లాంగ్ మార్చ్'ను రంగినేని మోహన్‌రావుకు అంకితం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు ఏలె లక్ష్మణ్ లైవ్ పెయింటింగ్‌తో సభికులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. తెలంగాణ కళాకారులు నిర్వహించిన ఆటాపాటా వీక్షకులను ఆకట్టుకున్నది.

వారం రోజులు అత్యంత కీలకం

- బడ్జెట్ సమావేశాలు, మొహర్రం, వినాయక నిమజ్జనంతో పోలీస్‌శాఖ అప్రమత్తం
- హైదరాబాద్ నగరంలో ఇతర ప్రాంతాల పోలీసులతోనూ గస్తీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు, మరోవైపు మొహర్రం, ఇంకోవైపు వినాయక నిమజ్జనం వంటి కీలక కార్యక్రమాలకు బందోబస్తు కల్పించడం పోలీస్‌శాఖకు కత్తిమీదసాములా మారింది. ఒకేవారంలో వచ్చే మూడు అతిపెద్ద సవాళ్లతో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. హైదరాబాద్ మహానగరంలో స్థానిక పోలీసులతోపాటు ఇతర ప్రాంతాల సిబ్బందితో గస్తీని ముమ్మరం చేసింది. సోమవారం ఉదయం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా.. ఈ నెల 10న మొహర్రం సందర్భంగా హైదరాబాద్‌లో సున్నితప్రాంతాల్లో భద్రత పెంచాల్సి ఉన్నది. ఈ నెల 12న వినాయక నిమజ్జనం జరుగనున్నది. దీంతో హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణతోపాటు అత్యాధునిక కెమెరాలతో పోలీసులు డేగకండ్లతో పహారా కాస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచారు. డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ సహా పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షించడంతోపాటు క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన సూచనలిస్తున్నారు.

'ఆగ్రో, పెస్టిసైడ్స్‌పై జీఎస్టీ తగ్గించాలి'

కరీంనగర్ టవర్‌సర్కిల్: ఆగ్రో, ఫెర్టిసైడ్, సీడ్స్ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని కొంతమేర తగ్గించినా రైతులకు మరింత సేవలు చేసే అవకాశం ఏర్పడుతుందని ఆలిండియా ఆగ్రో ఇన్‌పుట్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్‌మోహన్ కలాంత్రి పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ డీలర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులతో పాటు వ్యవసాయ ఆధారితమైన వాటిపైనా జీఎస్టీని 18 శాతం విధించడంతో రైతులపై ఆర్థిక భారం పడుతుందన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 9 సెప్టెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

సక్సెస్ మంత్ర

కొంతమంది మహిళ లకు పిల్లలు పుట్టాక ఉద్యోగం చేయగలమా లేదా అనే సందేహాలు తలెత్తుతాయి. ఇంకొందరేమో ఇటు పిల్లలను చూసుకోలేక.. అటు ఉద్యోగం చేయలేక మానసికంగా కుంగిపోతారు. పెద్ద చదువులు చదువుకొని.. కష్టపడి జాబ్ సంపాదించి... కెరీర్‌లో పైకొస్తున్న సమయంలో... కేవలం పిల్లల్ని కనడం కోసం ఉద్యోగం మానేస్తున్నారు చాలామంది. ఇలా కెరీర్‌లో బ్రేక్ తీసుకున్నవారికి మళ్లీ కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు చెన్నైకి చెందిన సౌందర్య రాజేశ్. రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా సేవలు అందిస్తున్న ఆమె.. విమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్, ఫేస్‌బుక్ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక మహిళల్లో ఒకరిగా స్థానం సంపాదించుకున్నారు. జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు, ఒత్తిళ్ల తో సహవాసం చేసే మహిళ లకు అండగా నిలిచారు. ఆమె సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రపతి పురస్కారంతో సత్కరించింది. సౌందర్యరాజేష్ సక్సెస్‌మంత్ర.

కేరీర్ రీస్టార్ట్ కోసం అవతరించిన

సౌందర్యరాజేష్

సౌందర్యరాజేష్ ఆగస్టు 26, 1968న శాంత చంద్ర శేఖర్, ఎం.ఎస్.చంద్రశేఖర్ దంపతులకు బెంగళూరులో జన్మించారు. ఈమె తండ్రి ఒక పారిశ్రామిక వేత్త. ఈమె సెయింట్ జోసెఫ్ ఆఫ్ క్లూనీ పాఠశాలలో తన ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుంది. తన ప్రాథమిక విద్య అనంతరం తన కుటుంబం పాండిచ్చేరికి వెళ్లింది. అక్కడే భారతిదాసన్ ప్రభుత్వ మహిళల కళాశాలలో తన డిగ్రీ విద్యని 1988లో పూర్తి చేసుకుంది. 1990లో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి ఆంగ్ల భాషా సాహిత్యంలో పట్టా పొందింది. అదేవిధంగా 2014లో పిహెచ్‌డీని హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పూర్తి చేసుకుంది. సౌందర్యరాజేష్ చిన్నప్పటి నుంచే సృజనాత్మకమైన ఆలోచనలతో తన జీవితాన్ని సాగించింది. తన బ్యాచ్‌మేట్ రాజేష్‌ను వివాహమాడింది. వారికి ఇద్దరు పిల్లలు.

ఉద్యోగం..

సౌందర్య 1990లో సిటీబ్యాంకులో ఉద్యోగం చేసి కొంత కాలం తర్వాత రాజీనామా చేసారు. అదే విధంగా 1992-95 సమయంలో అల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లో పని చేసారు. 1998- 2003 సమయంలో వైష్ణవి మహిళా కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేసారు. 2000లో అవతార్ కెరీర్ క్రియేటర్, 2008లో అవతార్ హ్యూమన్ క్యాపిటల్ ట్రస్ట్‌ను 2011లో ఫ్లెక్సీ కెరీర్ ఇండియా సంస్థలను స్థాపించారు. 2005లో యూకే వెళ్లి, అక్కడ మహిళా ప్రొఫెషనల్స్‌కు అందుతున్న సదుపాయాలను చూసి స్ఫూర్తి పొందారు. ఇప్పుడు అలాంటి పరిస్థితిని మన దేశంలో కూడా కల్పించడమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగుతున్నారు.

ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం

ప్రతి సంవత్సరం తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో 10,000 పాఠశాల బాలికలలో నైపుణ్యాన్ని పెంపొందించడం. వారు ఉన్నత విద్యను చదివేలా ప్రోత్సాహాన్ని అందివ్వడం.వారి ఉన్నత విద్య అనంతరం ఉన్నత ఉద్యోగాలలో చేరేలా ప్రోత్సాహాన్ని ఇవ్వడం. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన బాలికలకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇందులో 8 నుంచి 12 వ తరగతి వరకు ఐదు సంవత్సరాల పాటు శిక్షణని ఇస్తారు. ఈ శిక్షణ వారిలో వృత్తి నైపుణ్యాభివృద్ధికి ఉపకరించే విధంగా, పై చదువులకు ఉన్నత నైపుణ్యాలతో వెళ్లే విధంగా వారిలో విశ్వాసం కల్పిస్తుంది. వారి కుంటుంబాలలో పేదరికాన్ని నిర్మూలించడం, బాలికలలో నిరక్షరాస్యతను నిర్మూలించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

అత్త ఇచ్చిన డబ్బు తో..

సౌందర్య 2000 సంవత్సరంలో అవతార్ కెరీర్ క్రియేటర్స్ సంస్థను తన అత్తగారు ఇచ్చిన రూ. 60,000 సొమ్ముతో ప్రారంభించారు. క్రమేణా అవతార్ హ్యూమన్ కాపిటల్ ట్రస్ట్, ఫ్లెక్సీ కెరీర్స్ ఇండియాను స్థాపించారు. ఈ సంస్థలను భారతదేశం అంతటా స్థాపించి అవగాహనా కార్యకలాపాలను కొనసాగించింది. ఇతర కారణాల దృష్ట్యా ఉద్యోగాన్ని మానేసిన మహిళలకు వారికీ ఉద్యోగకల్పనకు డిసెంబరు 2005 ఇండియా విమెన్ నిపుణుల ఇంటర్‌స్పేస్ నెట్‌వర్క్‌ను స్థాపించి, దేశంలో తొలిసారిగా మహిళలను తిరిగి తమ కెరీర్‌లను రీస్టార్ట్ చేయించే కన్సల్టెన్సీగా అవతార్ పేరు పొందింది. ముఖ్యంగా కౌన్సెలింగ్ ద్వారా మహిళలను తమ కెరీర్‌లను రీస్టార్ట్ చేయించే బాధ్యతను ఈ సంస్థ తీసుకుంది. ఇప్పటికే సుమారు 75 మంది మహిళా ఉద్యోగినులతో విస్తరించడమే కాదు.. 8000 పైచిలుకు మహిళలను తమ కెరీర్‌లను రీస్టార్ట్ చేసేందుకు సహకరించింది.

అడ్డంకులను అధికమించి..

మహిళల కెరీర్ రీస్టార్ట్ కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చిన సౌందర్య రాజేష్ ప్రయాణం పూలబాటలా సాగలేదు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా చాలా కంపెనీలు తమ కంపెనీల్లో కెరీర్ బ్రేక్ ఇచ్చిన మహిళలకు మళ్లీ ఉద్యోగం ఇచ్చేందుకు ముందుకు రాలేదు. అంతేకాదు వారి రెజ్యూమెలను కంపెనీలకు ఫార్వర్డ్ చేసినప్పుడు సౌందర్య రాజేష్ చాలా చేదు అనుభవాలు ఎదుర్కొన్నారు. అయినా, నిరుత్సాహ పడలేదు. అనేక సంస్థలను ఉద్యోగాలు ఇవ్వమని కోరారు. మహిళల కెరీర్ రీస్టార్ట్ చేయడంపై గల సందేహాలను ఆయా కంపెనీల హెచ్‌ఆర్ విభాగాలతో చర్చించారు. పరిష్కార మార్గాలనూ సజెస్ట్ చేశారు. సెకండ్ కెరీర్ అనే ప్రోగ్రాంపై ఏడాది పాటు కష్టపడ్డారు. ఫలితంగా సుమారు 400 మంది మహిళలకు ఉపాధి కల్పించేందుకు కంపెనీలు ముందుకు వచ్చాయి. ఇది అవతార్ ఐ విన్ సాధించిన అతిపెద్ద విజయం.

పురస్కారాలు

భారత మహిళల, పిల్లల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2015లో వంద మంది మహిళా సాధికారత జాబితాలో సౌందర్య ఎన్నికయింది. దేశ వ్యాప్తంగా మహిళాభివృద్ధికి కృషి చేసిన వారికి మూడు విభాగాలుగా పోటీ నిర్వహించి 2015 డిసెంబర్ 31న ఈ జాబితాను విడుదల చేసింది. 2016 జనవరి 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

విజయాల బాట

మహిళలను తమ కెరీర్ రీస్టార్ట్ చేసేలా మోటివేట్ చేసేందుకు సౌందర్య చాలా కష్టపడింది. అవతార్ ఐ విన్ ద్వారా సుమారు 40 వేల మంది మహిళలను కాంటాక్ట్‌లో పెట్టుకుంది. వీరిలో పలురంగాలకు చెందిన ప్రొఫెషనల్స్ ఉన్నారు. ప్రస్తుతం నిపుణులైన మానవ వనరుల కోసం వెతుకుతున్న కంపెనీలకు అవతార్ ఐ విన్ వన్ స్టాప్ పాయింట్‌గా నిలిచింది. ప్రఖ్యాత కంపెనీలైన హిందుస్తాన్ లివర్, యాక్సిస్ బ్యాంక్, గోల్డ్‌మన్ సాక్స్, ఫిడెలిటీ, హెచ్‌సీఎల్, గోద్రేజ్, ఫిలిప్స్, మైక్రోసాఫ్ట్ అవతార్ ఐ విన్‌ను సంప్రదిస్తున్నాయి. అవతార్ కన్సల్టెన్సీ ద్వారా సౌందర్య అందుకున్న మొదటి ప్రాజెక్టు చెన్నై కంటెయినర్ టెర్మినల్ ప్రైవేటైజేషన్. ఈ ప్రాజెక్టులో భాగంగా పెద్ద ఎత్తున మహిళా ఇంజనీర్లను అవతార్ కన్సెల్టెన్సీ అందించింది. పురుషులతో సమానంగా పలువురిని రిక్రూట్ చేయడంలో అవతార్ తన ప్రత్యేకతను చాటుకుంది. అత్యంత కఠినమైన పనులను సైతం తమ కెరీర్ రీస్టార్ట్‌లో చేపట్టేందుకు మహిళలు ముందుకు వచ్చారంటే అవతార్ ఇచ్చిన కౌన్సెలింగ్ ఎలా పనిచేసిందో చెప్పవచ్చు.

సేంద్రియ ఎరువులతో రైతులకు సాయం

నగరాల్లో పేరుకుపోతున్న చెత్త పర్యావరణానికి ఆటంకంగా మారుతున్నది. మరోవైపు వ్యవసాయంలో రసాయనాలను వాడడం వల్ల భూమి దెబ్బతింటున్నది. ఈ పరిస్థితులను చూసి చెన్నైకి చెందిన దంపతులు వాటిని నివారించేందుకు కృషి చేస్తున్నారు.

చెన్నైకి చెందిన రంజినీ, కెర్న్ అగర్వాల్ అనే దంపతులకు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటన మార్చేస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. ఉద్యోగాల రీత్యా తమిళనాడులోని కాంచీపురంలో పర్యటించిన ఈ దంపతులు పూర్తిగా అక్కడి రైతులతో గడపడానికి నిర్ణయించుకున్నారు. నగరాల్లో, గ్రామాల్లో ప్రధాన సమస్యగా ఉన్న 'వ్యర్థ పదార్థాల నిర్వహణ'పై దృష్టి సారించారు. ఈ చెత్తను సేకరించి, కంపోస్ట్ చేసి రైతులకు సేంద్రియ ఎరువు అందించాలని నిర్ణయించుకున్నారు. ఏడాది పాటు అధ్యయనం చేశారు. నగర శుభ్రత, సేంద్రియ భూమి కోసం 2017లో 'కార్బన్ లూప్స్' అనే స్టార్టప్‌ను స్థాపించారు. దీని ద్వారా చెత్తను సేకరించి కంపోస్ట్ చేయడం, అవసరమైన వారికి బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కాలేజీలు, గృహసముదాయాల్లో బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయించి, వాటి నిర్వహణ బాధ్యతలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్తను సేకరించి కంపోస్ట్ కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేస్తున్నారు. సాధారణంగా అక్కడి రైతులకు రెండు టన్నుల సేంద్రియ ఎరువు వెయ్యి రూపాయలకి లభిస్తుంది. కానీ రంజినీ దంపతులు కేవలం వంద రూపాయలకే అందిస్తున్నారు. ఇలా ఆయా సెంటర్లలో రోజుకు 5వేల టన్నుల వ్యర్థాలను సేంద్రియ ఎరువు, బయోగ్యాస్‌లోకి మారుస్తున్నారు. శుభ్రమైన నగరాలు, సారవంతమైన నేలలు అవసరమని వాటి కోసం కృషి చేస్తున్నట్టు రంజినీ చెబుతున్నారు.

పండ్లపై ఉప్పూకారం చల్లుకోవచ్చా?

చాలా పండ్లలో సహజంగానే తీపి ఉంటుంది. మామిడికాయల్లాంటివి మాత్రం పుల్లగా ఉంటాయి. అలాంటి వాటికి కాస్త ఉప్పు, కారం చల్లుకొని తినడం మనకు అలవాటు. అయితే కొన్ని పండ్ల మీద ఉప్పు కారం చల్లుకుని తింటే మంచిదే అంటున్నారు వైద్యులు.

- ఇటీవల జామకాయలు, పుచ్చకాయలు కట్ చేసుకొని వాటి మధ్య సాల్ట్ వేసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల పండ్ల రుచి పెరుగుతుంది. మనకు తెలియకుండా పండ్లపై బ్యాక్టీరియా చేరుతుంది. ఆ బ్యాక్టీరియాను ఉప్పు చంపేస్తుంది.
- అలా అన్ని రకాల పండ్లపైనా ఉప్పు చల్లుకొని తినడం కూడా మంచిది కాదు. ముఖ్యంగా డయాబెటిస్‌తో బాధపడేవారు ఉప్పు చల్లుకొని తినడం కరెక్టు కాదు. పైగా ఉప్పు ఎక్కువగా చల్లుకుంటే బీపీ, గుండెజబ్బులు, కిడ్నీ వ్యాధులు తప్పవు.
- అత్యంత పుల్లగా ఉండే సిట్రస్ జాతి పండ్ల మీద(జీసిరికాయ, పుల్ల మామిడి, నారింజ) వంటి వాటి మీద ఉప్పు చల్లుకొని తింటే కడుపులో ఉత్పత్తి అయ్యే యాసిడ్లను అడ్డుకోవచ్చు. ఫలితంగా అజీర్తి సమస్యలకు చెక్ పెట్టినట్లు అవుతుంది.
- జామకాయ మీద ఉప్పు చల్లుకొని తింటే దంతాలకు మేలు జరుగుతుంది. నోట్లో బ్యాక్టీరియా చచ్చిపోతుంది. పుచ్చకాయ మీద ఉప్పు చల్లినా చల్లకున్నా ఎమీ తేడా ఉండదు. కానీ బీపీ, షుగర్‌తో బాధపడేవారు ఉప్పు చల్లుకోకపోవడమే మంచిది.

నోటి దుర్వాసనా?

నోటి దుర్వాసన ఒక పెద్ద సమస్య. కొన్నిసార్లు ఇది శరీరంలోని వివిధ రుగ్మతల వల్ల వచ్చినా, చాలా వరకు కొన్ని అలసత్వపు లేదా అనారోగ్యకరమైన అలవాట్ల వల్లే ఈ సమస్య తలెత్తుతుంది. కొన్ని ముందు జాగ్రత్తలతో నోటి దుర్వాసనను అరికట్టవచ్చు, అవేంటంటే..

- ఉదయాన్నే పళ్లు తోముకునేటప్పుడు నాలుకను కూడా టంగ్‌క్లీనర్‌తో శుభ్రపర్చడం మరిచిపోవద్దు. రోజంతా తినేటప్పుడు వివిధ ఆహారపదార్థాలు కంటికి కనిపించని మలినాల్ని నాలుకపై వదులుతాయి. ఇదే ఓవర్ నైట్ పేరుకుపోయి ఇన్‌ఫెక్షన్ అయ్యి దుర్వాసన వచ్చే అవకాశం ఉంది.
- ఆపిల్ లేదా క్యారట్‌ను రోజూ తినడం వల్ల పళ్లపై ఒత్తిడి పెరిగి వాటిపై పేరుకుంటున్న మలినాలు క్లీన్ అయ్యి శ్వాస శుభ్రంగా, తాజాగా ఎలాంటి దుర్వాసన లేకుండా వస్తుంది. స్ట్రాబెర్రీ, క్రీం మాదిరిగా ఉండే ఆహారపదార్థాలు పళ్లపై, నాలుకపై అంటుకొని బ్యాక్టీరియాను పెంచి దుర్వాసనకు దారి తీస్తాయి.
- కాఫీ నోటి దుర్వాసనకు ఒక మూల కారణం. గ్రీన్ టీ ఓవర్ ఆల్ ఆరోగ్యాన్నే కాకుండా శ్వాసను కూడా గణనీయంగా మెరుగుపరుస్తుంది. అందుకే రొటీన్ కాఫీ, టీలకు బదులు గ్రీన్‌టీని అలవాటు చేసుకుంటే ఆరోగ్యం, శ్వాసలో మార్పు వస్తుంది.
- కొబ్బరి నూనె ఆరోగ్య ప్రదాయిని. ఇది శ్వాసను మెరుగుపర్చేందుకు కూడా ఉపయోగపడుతుంది. కొద్దిపాటి కొబ్బరి నూనెను నోట్లోకి తీసుకొని నాలుగైదు సార్లు పుకిలించడం వల్ల నోట్లోని హానికర బ్యాక్టీరియా పూర్తిగా తొలగిపోతుంది. పళ్ల చిగుళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- ప్రతిరోజు మూడు పూటలు గోరువెచ్చని నీటితో పుకిలించినా, గోరువెచ్చని నీటిలో ఉప్పు వేసుకొని పుకిలించినా నోటి దుర్వాసన పోతుంది.

అడుగండి చెబుతా

మా అమ్మ వయసు 68 సంవత్సరాలు. ఒక నెల రోజుల క్రితం బాత్‌రూమ్ లో జారి పడ్డారు. పడిన వెంటనే నడుము నొప్పి అనడంతో వెంటనే హాస్పిటల్‌కి వెళ్లాం. వెన్నుపాముకు ఎక్స్ రే తీసారు. ఎల్ 1, ఎల్ 2 అనే వెన్నుపూసలు ఫ్రాక్చర్ అయ్యాయని తేలింది. ఎముకల్లో క్యాల్షియం తగ్గడం వల్ల అని చెప్పారు. బెడ్ రెస్ట్ తీసుకుని, మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. కాని నెలరోజులైనా నడుంనొప్పి ఇంకా ఎక్కువగానే ఉంది. పడుకొని లేవాలంటే నొప్పిగా ఉంది. దీనికి వేరే ఏమైనా ట్రీట్మెంట్స్ ఉన్నాయా?

- సుధాకర్, హైదరాబాద్

ఆస్టియోపోరొసిస్ వల్ల క్యాల్షియం తగ్గి, ఎముకలు పెళుసుబారిపోతాయి. అందువల్ల చిన్న చిన్న దెబ్బలు తగిలినా ఎముకలు విరుగుతాయి. ఈ ఆస్టియోపోరొటిక్ ఫ్రాక్చర్లు ఎక్కువగా వెన్నులో జరిగే అవకాశం ఉంది. వీటిని ఆస్టియోపోరొటిక్ వర్టిబ్రల్ కంప్రెషన్ ఫ్రాక్చర్లంటారు. బెడ్‌రెస్ట్ ల ఇవి మానడం మాట అటుంచి మరింత ప్రమాదం. ఒక రోజు బెడ్‌రెస్ట్ తీసుకుంటే ఎముకల్లో ఒక శాతం క్యాల్షియం తగ్గుతుంది. అసలే క్యాల్షియం తగ్గి అయిన ఫ్రాక్చర్ కాబట్టి ఇంకా సమస్య అవుతుంది. ఇటువంటి ఆస్టియోపోరొటిక్ ఫ్రాక్చర్లకు వర్టిబ్రోప్లాస్టీ, కైఫోప్లాస్టీ అనే పిన్ హోల్ ఆపరేషన్లు ఉంటాయి.

వర్టిబ్రోప్లాస్టీలో విరిగిన ఎముకలోకి ఒక సూదిని పంపించి దాని ద్వారా బోన్ సిమెంట్‌ను వెన్నుపూసలోకి ఇంజెక్ట్ చేస్తారు. లోపలికి వెళ్లాక అది గట్టిపడి వెన్నుపూసకి సపోర్టు ఇస్తుంది. కైఫోప్లాస్టీ పద్ధతి మరింత ఆధునికమైంది. ఇందులో విరిగిన వెన్నుపూసలోకి సూదిని పంపించి, దాని ద్వారా బెలూన్ పంపి, ఇన్‌ఫ్లేట్ చేస్తారు. ఆ తరువాత బెలూన్‌ని డిఫ్లేట్ చేసి, వాటిని బయటకు తీసి, ఆ తరువాత బోన్ సిమెంట్‌ను ఇంజెక్ట్ చేస్తారు. వీటివల్ల నొప్పి త్వరగా తగ్గిపోవడమే కాకుండా పేషెంట్‌ని వెంటనే నడిపించవచ్చు.

డాక్టర్ జిపివి సుబ్బయ్య
సీనియర్ స్పైన్ సర్జన్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

పర్యావరణ హితం కోసం!

ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకున్నప్పడే పర్యావరణం పది కాలాల పాటు సుభిక్షంగా ఉంటుంది. అందుకోసమే ఓ మహిళ పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి ముందుకు వచ్చింది. నిరుపయోగంగా ఉన్న పరికరాలతో కళాత్మకమైన వస్తువులను తయారు చేస్తూ, ప్రకృతిని సంరక్షించే ప్రయత్నం చేస్తున్నది.

బెంగళూరుకు చెందిన సరిత అనే మహిళ నిరుపయోగంగా పడి ఉన్న ఇనుప సామగ్రిని కళాత్మకమైన వస్తువులుగా మారుస్తున్నది. సృజనాత్మకతతో అద్భుతమైన అలంకరణ ఉత్పత్తులను తయారు చేస్తూ పర్యావరణ సంరక్షణ కోసం పాటు పడుతున్నది. 'రస్ట్ క్రియేషన్స్' పేరుతో కళాత్మకమయిన వస్తువులతోపాటు కాలుష్య రహిత ఉత్పత్తులను రూపొందిస్తున్నది. 'karnival.com' అనే ఈ- కామర్స్ వెబ్‌సైట్ ద్వారా ఈ ఉత్పత్తులను విక్రయిస్తున్నది. అలా విక్రయించగా వచ్చిన ఆదాయంలో కొంత మొత్తాన్ని దివ్యాంగులు, పేదలసంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నది. నిరుపయోగంగా పడి ఉన్న బల్బులు, పాడయిన గడియారాలు, సీసాలు, సైకిల్ చక్రాలు, మోటర్ సైకిల్‌కు సంబంధించిన పరికరాలతో ఉపయోగకరమైన ఉత్పత్తులను ఏ విధంగా తయారు చేసుకోవచ్చో బెంగళూరు ప్రజలకు ప్రత్యేక క్లాసులు నిర్వహించి మరీ తెలియజేస్తున్నది. అందుకోసం వర్క్‌షాపులు నిర్వహిస్తూ పర్యావరణానికి మేలు చేస్తున్నది. పర్యావరణానికి హాని కలిగించని వస్తువులను వాడడం వల్ల కలిగే ఉపయోగాలను గురించి ప్రజలకు వివరిస్తున్నది.'మనిషి సుభిక్షంగా బతకాలంటే భూమిని సంరక్షించుకోవాలి. భూమికి ప్రత్యామ్నాయం మరొక గ్రహం లేద'ని సరిత చెబుతున్నది. వీలయినంత వరకూ పర్యావరణ హితమయిన ఉత్పత్తులనే వాడాలని ఆమె సూచిస్తున్నది.

నమస్తే తెలంగాణ
నిపుణ
[కరీంనగర్]
సోమవారం 9 సెప్టెంబర్ 2019

న్యూమరికల్ వ్యాల్యూ ప్రశ్నల్లో కాఠిన్యత?

- గతంలో మూడుగంటల్లో 90 ప్రశ్నలకు సమాధానం గుర్తించేవారు. అంటే ప్రతి ప్రశ్నకు రెండు నిమిషాల సమయం దొరికేది. వీటిలో కొన్ని ప్రశ్నలు నేరుగా సమాధానం గుర్తించేవి ఉండేవి, వాటిని 30 సెకన్లలో జవాబు గుర్తించేవారు. దాంతో ప్రశ్నలకు సగటున కనీసం 3 నుంచి4 నిమిషాల సమయం దొరికేది. ఈసారి ప్రశ్నల సంఖ్య తగ్గించడం వల్ల పరీక్షలో టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యం తగ్గిపోయింది. అయితే ఇప్పటివరకు ఇచ్చే ప్రశ్నల స్థాయి కంటే ఈసారి ప్రశ్నలస్థాయి పెరిగే అవకాశం ఉంటుందని జేఈఈ పరీక్షలో విశేష అనుభవం ఉన్న శిక్షణ నిపుణులు కాసుల కృష్ణచైతన్య అభిప్రాయం వ్యక్తం చేశారు. న్యూమరికల్ వ్యాల్యూ జవాబులు ఉండే ప్రశ్నలకు రుణాత్మక మార్కులు లేనందున ప్రశ్నలు గతంలో అడ్వాన్స్‌డ్‌లో ఇచ్చిన విధంగా ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.

మార్పులు మంచికే!!

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలైన ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్షల్లో ఈసారి భారీగా మార్పులు చేశారు. జేఈఈ విధానం ప్రవేశపెట్టిన ఎనిమిదేండ్ల తర్వాత పరీక్ష ప్రశ్నపత్రంలో జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు స్కీం అండ్ సిలబస్‌లో భారీ మార్పులను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్‌ఆర్‌డీ) సంస్కరణలు తీసుకువచ్చింది.

- **ప్రశ్నల సంఖ్య 90 నుంచి 75కి తగ్గింపు**
- **స్కీం&సిలబస్‌లో మార్పులు**
- **60 ఆబ్జెక్టివ్ (mcq), 15 న్యూమరికల్ వ్యాల్యూ ప్రశ్నలు**
- **360 నుంచి 300లకు తగ్గిన మొత్తం మార్కులు**

- పరీక్షల్లో ఇచ్చే ప్రశ్నల సంఖ్యతోపాటు ప్రశ్నల విధానాన్ని కూడా మార్చేసింది. ఈ మేరకు మార్పులు చేసిన జేఈఈ మెయిన్ పరీక్ష కొత్త విధానాన్ని ఇన్ఫర్మేషన్ బులెటిన్‌లో అందుబాటులో ఉంచింది. ఆబ్జెక్టివ్ విధానమే కాకుండా డిస్క్రిప్టివ్ విధానాన్ని కూడా తీసుకురావాలని భావించిన ఎంహెచ్ ఆర్‌డీ.. ఈ మేరకు గతంలోనే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. అయితే డిస్క్రిప్టివ్ విధానం కాకుండా సంఖ్యా సమాధాన (న్యూమరికల్ వ్యాల్యూ) సంబంధిత ప్రశ్నలను జేఈఈ మెయిన్ పరీక్షల్లోకి తీసుకొచ్చింది. ఇప్పటివరకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఈ విధానం ఉండగా, ఇపుడు మెయిన్స్‌లోనూ ప్రవేశపెట్టింది. గతేడాది నుంచి జేఈఈ మెయిన్ రెండుసార్లు (జనవరి, ఏప్రిల్) నిర్వహిస్తున్న విషయం విదితమే.

300 మార్కులు- 75 ప్రశ్నలు

- జేఈఈ మెయిన్‌లో ఇప్పటివరకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 30 చొప్పున మొత్తం 90 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉండేవి. ప్రతి ప్రశ్నకు 4 మార్కుల చొప్పున 360 మార్కులకు ప్రశ్నపత్రం ఉండేది. నెగిటివ్ మార్కింగ్ విధానం ఉండేది. ఒక తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధించేవారు. కొత్త విధానంలో ప్రతి ప్రశ్నకు 4 మార్కులే ఇవ్వనున్నప్పటికీ, ప్రశ్నల సంఖ్యను 75కి కుదించారు. ప్రతి సబ్జెక్టు నుంచి గతంలో 30 ప్రశ్నలు ఉండగా.. వాటిని 25కి తగ్గించారు. ఆ 25 ప్రశ్నల్లోనూ ఆబ్జెక్టివ్ విధానంలో 20 ప్రశ్నలు, న్యూమరికల్ వ్యాల్యూ పద్ధతిలో మరో 5 ప్రశ్నలు ఇస్తారు.
- మొత్తం మీద 60 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, 15 న్యూమరికల్ వ్యాల్యూ ప్రశ్నలు ఉంటాయి. వీటిలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు మాత్రం నెగిటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. న్యూమరికల్ వ్యాల్యూ కింద ఇచ్చే 15 ప్రశ్నలకు మాత్రం నెగిటివ్ విధానం ఉండదు. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ ప్రవేశ పరీక్షల్లోనూ న్యూమరికల్ వ్యాల్యూ ప్రశ్నలు ఇచ్చేలా ఎంహెచ్‌ఆర్‌డీ మార్పులు చేసింది. బీఆర్క్‌లో ప్రవేశాలకు 77 ప్రశ్నలతో 400 మార్కులకు, బీప్లానింగ్‌లో ప్రవేశాలకు 100 ప్రశ్నలతో 400 మార్కులకు పరీక్ష నిర్వహించనుంది.

పరీక్ష హాలుకు అరగంట ముందే రావాలి!

- దరఖాస్తులను ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో (jeemain.nta.nic.in) దాఖలు చేయాలి. అక్టోబర్ 1 లోపు ఫీజు చెల్లించవచ్చు.
- దరఖాస్తుల్లో పొరపాట్లు సరిదిద్దుకునేందుకు అక్టోబర్ 11 నుంచి 17 వరకు అవకాశం ఉంటుంది.
- డిసెంబర్ 6 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఎన్‌టీఏతో మార్పులు ఆరంభం

- జేఈఈ మెయిన్ నిర్వహణ బాధ్యతను ఎన్‌టీఏకు అప్పగించిన తొలి ఏడాదే ఈ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ (కంప్యూటర్ ఆధారిత పరీక్ష) విధానంతోపాటు రెండుసార్లు నిర్వహించారు. దీనికితోడు ఈసారి ప్రశ్నల సంఖ్య, విభిన్న ప్రశ్నలు, మార్కుల మొత్తం తదితరాల్లో మార్పులు చేయటం గమనార్హం. దీనివల్ల ప్రశ్నల కఠినత్వం కొంత పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మెయిన్ స్థాయిలోనే ఎక్కువమంది అభ్యర్థులను వడపోత పోయడానికి ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సబ్జెక్టుపై పట్టు ఉన్నవారికి ఇది అనుకూలమని సీనియర్ ఫ్యాకల్టీలు భావిస్తున్నారు.
- మొదటి విడత పరీక్షలను 2020 జనవరి 6 నుంచి 11వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో నిర్వహించనుంది.
- రోజు రెండు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటి సెషన్.
- రెండో సెషన్ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహిస్తారు.
- పీహెచ్‌సీ అభ్యర్థులకు అదనపు సమయాన్ని ఇస్తారు.
- మొదటి షిఫ్ట్ పరీక్షకు ఉదయం 7:30 గంటల నుంచి 9 గంటల్లోపు, రెండో షిఫ్ట్ పరీక్షకు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల్లోపు విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతిస్తారు.

మారిన విధానంలో న్యూమరికలే కీలకం

- మారిన విధానంలో మొదటి 20 ప్రశ్నలతో ఇబ్బంది లేదు. గతంలో లాగే వీటికి ఇచ్చిన నాలుగు ఆప్షన్ల నుంచి జవాబులను గుర్తించవచ్చు. దీనికి రకరకాల పద్ధతులను అభ్యర్థులు అనుసరించవచ్చు. దీనిలో కొంత తెలివిని, సమయస్ఫూర్తిని ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. కానీ కొత్తగా ప్రవేశపెట్టిన న్యూమరికల్ వ్యాల్యూ విధానంలో అడిగే ఐదు ప్రశ్నలతోనే ఇబ్బంది. అడ్వాన్స్‌డ్‌కు ప్రిపేరయ్యేవారికి మాత్రం సులభమే. ఇందులో నెగిటివ్ మార్కులు లేకపోవడం కొంత ఊరట. విద్యార్థి సబ్జెక్టు లోతును పరీక్షించేలా ఈ ప్రశ్నలు ఉండవచ్చని నిపుణుల అంచనా. ప్రతి సబ్జెక్టులో 5 చొప్పున 15 ప్రశ్నలకు 60 మార్కులు కాబట్టి అవి చాలా కీలకం. మెయిన్ పాత పేపర్లతోపాటు గత అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఇచ్చిన న్యూమరికల్ వ్యాల్యూ ప్రశ్నలు చూసుకుని ప్రిపేర్ అయితే సరిపోతుంది. అయితే వీటిని కచ్చితంగా చేస్తే మంచిది. నెగెటివ్ మార్కులు లేవు. కాబట్టి ఈ ప్రశ్నలకు సమాధానం గుర్తించే ప్రయత్నం చేయడం మంచిది.

...✍ కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

- **అర్హతలు:** జేఈఈ మెయిన్ పరీక్ష రాసేవారికి ఎటువంటి వయోపరిమితి లేదు. కానీ అభ్యర్థులు 2018, 2019లో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా 2020 మార్చిలో పరీక్షలు రాస్తున్నవారై ఉండాలి. అయితే పరీక్ష అనంతరం ప్రవేశాలు పొందగోరే సంస్థల్లో వయోపరిమితి ఉంటుంది. (ఐఐటీల్లో ప్రవేశాలకు వయోపరిమితి ఉంటుంది)

నోట్: 2017 లేదా అంతకుముందు ఇంటర్ ఉత్తీర్ణులైన వారు జేఈఈ మెయిన్ రాయడానికి అర్హులు కారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఒక అభ్యర్థి గరిష్ఠంగా రెండుసార్లు మాత్రమే రాయడానికి అవకాశం ఇస్తారు.

పరీక్ష ఫీజు:

- బీఈ/బీటెక్ లేదా బీఆర్క్ లేదా బీప్లానింగ్ (ఏదైనా ఒకటి) పరీక్షకు- జనరల్, జనరల్- ఈడబ్ల్యూఎస్, ఓబీసీ నాన్ క్రీమీలేయర్ బాలురకు ఫీజు- రూ.650/-
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, బాలికలకు రూ.325/-
- ఏవైనా రెండు పరీక్షలు అంటే బీఈ/బీఆర్క్ లేదా బీఈ, బీప్లానింగ్ రాయదలిస్తే ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు రూ.1300/- ఇతరులకు రూ.650/-

నోట్: ఫీజును నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/డెబిట్ కార్డు, యూపీఐ, పేటీఎం ద్వారా చెల్లించవచ్చు.

రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు:

- **తెలంగాణలో:** హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్.
- **వెబ్‌సైట్:** https://jeemain.nta.nic.in

బీ ప్లానింగ్ కోర్సుకు ఇంటర్‌లో గణితం చదివితే చాలు

- ఈసారి చేసిన మరో ప్రధాన మార్పు సైన్స్ సబ్జెక్ట్ చదవకున్నా బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ (బీ ప్లానింగ్) కోర్సులో చేరడం. ఇదివరకు బీ ప్లానింగ్ కోర్సులో చేరాలంటే ఇంటర్‌లో గణితంతోపాటు భౌతిక, రసాయన శాస్త్రాలు తప్పనిసరిగా చదవాల్సి ఉండేది. ఈసారి నుంచి గణితం సబ్జెక్టు చదివితే చాలు. భౌతిక, రసాయన శాస్త్రాలు అవసరం లేదు. ఈక్రమంలో ఎంఈసీ గ్రూపు విద్యార్థులు కూడా బీ.ప్లానింగ్ చదవచ్చు. అంటే వారు జేఈఈ మెయిన్ పేపర్-2 పరీక్ష రాయవచ్చు.

బీఆర్క్‌లోనూ మార్పులు

- జేఈఈ మెయిన్‌లో రెండోపేపర్‌గా పేరుగాంచిన బ్యాచులర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్)లో ప్రవేశానికి నిర్వహించే మెయిన్ పేపర్-2 పరీక్షలో కూడా మరికొన్ని మార్పులు చేశారు.
- ఇప్పటివరకు బీఆర్క్ పరీక్షలో 100 ప్రశ్నలు ఇచ్చేవారు. ఈసారి 77 ప్రశ్నలే ఉంటాయి. ఇక్కడ గణితం ప్రశ్నలు 25 ఉంటే అందులో 5 పూర్ణాంక తరహావి ఇస్తారు. డ్రాయింగ్ పరీక్షలో గతంలో మూడు ప్రశ్నలు ఉండగా ఇప్పుడు రెండు మాత్రమే ఉంటాయి.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్

పాఠశాల స్థాయి విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు జాతీయస్థాయిలో ప్రారంభించిన కార్యక్రమం విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం). దీనిద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల జిజ్ఞాసను పెంపొందిస్తున్నారు. ఈ ప్రతిభా పరీక్షను విజ్ఞాన భారతి, ఎన్‌సీఈఆర్‌టీఈ, కేంద్ర ప్రభుత్వ సంస్థ విజ్ఞాన్ ప్రసార్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఔత్సాహికులకు ఉపయోగపడేలా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ కార్యక్రమంపై ప్రత్యేక కథనం.

కార్యక్రమం-లక్ష్యాలు

- విద్యార్థుల్లో ఫ్యూర్ సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడం.
- ప్రపంచ సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిలో భారత కృషిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం.
- వర్క్‌షాప్‌లు, ఇతర కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీయడం.
- సైన్స్‌లో ఉన్నతవిద్య చదివేలా విద్యార్థులను ప్రోత్సహించడం. ఇందులో భాగంగా మెంటార్లను అందుబాటులోకి తేవడం.
- విద్యార్థుల్లో సైన్స్ దృక్పథాన్ని పెంపొందించేందుకు పోటీ పరీక్షల నిర్వహణ.
- రాష్ట్ర, జాతీయస్థాయిలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్ల ప్రదానం.
- ఎంపికైన విద్యార్థులను దేశంలోని వివిధ రిసెర్చ్ డెవలప్‌మెంట్ సంస్థల సందర్శనలకు తీసుకెళ్లడం.

వివరాలు

- విద్యార్థి విజ్ఞాన్ మంథన్ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు బహుముఖ పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. స్కూలు, స్టేట్, నేషనల్ స్థాయిల్లో తోటి విద్యార్థుల (అదే తరగతి)తో పోటీ పడాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో జాతీయ సైన్స్ పరిశోధనా కేంద్రాలు, కేంద్రాల సందర్శన కీలకంగా నిలుస్తుంది. ఇందులో భాగంగా ప్రముఖ శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం విద్యార్థులకు దక్కుతుంది.

పరీక్ష విధానం

- పరీక్షను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు.
- **జూనియర్ గ్రూప్:** 6-8 తరగతులకు ఉంటుంది.
- **సీనియర్ గ్రూప్:** 9-11 (ఇంటర్ ఫస్టియర్) తరగతులకు
- ప్రతి దశలోనూ విద్యార్థి వ్యక్తిగత ప్రతిభను పరీక్షిస్తారు. పరీక్షను ఇంగ్లిష్, హిందీ మాధ్యమాలతోపాటు 9 ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తారు (దరఖాస్తుల ఆధారంగా).
- ప్రశ్నపత్రం (6-11 తరగతులు) వంద ప్రశ్నలు, 100 మార్కులకు ఉంటుంది.
- పరీక్ష మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో జరుగుతుంది.
- **పరీక్ష సమయం:** రెండు గంటలు.

ఎవరు అర్హులు

- ఆరోతరగతి నుంచి ఇంటర్ మొదటి ఏడాది (11వ తరగతి)

సిలబస్

- సైన్స్, మ్యాథమెటిక్స్ పుస్తకాల నుంచి 50 ప్రశ్నలు వస్తాయి.
- ఎన్‌సీఈఆర్‌టీ కరికులం అనుసరించాలి.
- 'సైన్స్‌లో భారత్ కృషి' అంశం నుంచి 20 ప్రశ్నలు వస్తాయి.
- విద్యార్థి విజ్ఞాన్ మంథన్ మెటీరియల్‌ను చదవాలి.
- జగదీశ్ చంద్రబోస్ తదితరుల జీవిత అనుభవాల నుంచి 20 ప్రశ్నలు వస్తాయి.
- లాజిక్ అండ్ రీజనింగ్ నుంచి పది ప్రశ్నలు ఇస్తారు. వీటి కోసం జనరల్ రీడింగ్‌పై ఆధారపడాలి.

చదువుతున్నవారు అర్హులు. సైన్స్-అనుబంధ సబ్జెక్టుల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడమే వీవీఎం ప్రధాన ఉద్దేశం.

స్కూల్ (లెవల్-1)

- ప్రతి తరగతి నుంచి టాప్‌లో నిలిచిన ముగ్గురిని స్కూలు విజేతలుగా ప్రకటిస్తారు. దీని ప్రకారం ప్రతి స్కూలు నుంచి 18 మంది విజేతలుగా నిలుస్తారు. ప్రతి తరగతి నుంచి 10 మంది దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్ అందిస్తారు.

జిల్లా (లెవల్-2)

- జిల్లాలోని అన్ని స్కూల్స్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురిని జిల్లా విజేతలుగా ఎంపికచేస్తారు. దీని ప్రకారం ప్రతి జిల్లా నుంచి మొత్తం 18 మంది ఎంపికైనట్లు ప్రకటిస్తారు. వీరికి మెరిట్ సర్టిఫికెట్ అందిస్తారు.

రాష్ట్రం (లెవల్-3)

- ప్రతి తరగతి నుంచి టాప్ 20 విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్యాంప్‌లో పాల్గొనే అర్హత లభిస్తుంది. వీరిలో నుంచి ఒక్కో తరగతికి ముగ్గురి చొప్పున మొత్తం 18 మందిని రాష్ట్ర విజేతలుగా ప్రకటిస్తారు. క్యాంప్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్‌తో పాటు మెమొంటోను అందిస్తారు. ప్రతి తరగతి నుంచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.5,000, రూ.3,000, రూ.2,000 చొప్పున నగదు బహుమతి లభిస్తుంది.

జాతీయ స్థాయి (లెవల్-4)

- ప్రతి రాష్ట్రం నుంచి టాప్ 2లో నిలిచిన విద్యార్థులకు నేషనల్ క్యాంప్‌లో పాల్గొనే అర్హత దక్కుతుంది. ప్రతి తరగతి నుంచి ముగ్గురి చొప్పున మొత్తం 18 మందిని జాతీయ విజేతలుగా ప్రకటిస్తారు. దీనికి అదనంగా ప్రతి జోన్ స్థాయిలో తరగతి నుంచి ముగ్గురి చొప్పున మొత్తం 18 మందిని జోనల్ విజేతలుగా ప్రకటిస్తారు. క్యాంప్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్, మెమొంటోలు అందిస్తారు. జాతీయస్థాయిలో ప్రతి తరగతి నుంచి విజేతలుగా నిలిచిన టాప్ 3 విద్యార్థులకు వరుసగా రూ.25,000, రూ.15,000, రూ.10,000 నగదు బహుమతి దక్కుతుంది, అలాగే జోనల్ స్థాయి టాప్ 3 విద్యార్థులకు వరుసగా రూ.5,000, రూ.3,000, రూ.2,000 బహుమతి అందుతుంది.

దరఖాస్తు విధానం

- ముందుగా ప్రతి స్కూలు వీవీఎంలో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. దీనికోసం సదరు స్కూల్ ప్రిన్సిపల్/హెడ్‌మాస్టర్.. స్కూల్ ఎగ్జామ్ కోఆర్డినేటర్‌ను నియమించాలి. అనంతరం స్కూల్ పేరు, అడ్రస్, ప్రిన్సిపల్ పేరు, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్ అడ్రస్ తదితరాలను ఎంటర్ చేయాలి. వీటిని పూర్తిచేసిన ప్రతి స్కూలుకి యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్, యూజర్ నేమ్, పాస్‌వర్డ్ అందిస్తారు. ఎగ్జామ్ కోఆర్డినేటర్ వీటి ఆధారంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో విద్యార్థుల పేర్లను నమోదు చేయవచ్చు.
- స్కూలు కేటగిరీలో దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ విధానం అందుటాటులో ఉంది. కనీసం 30 మంది విద్యార్థులు ఉన్నప్పుడే స్కూలు కేటగిరీ కింద నమోదు చేసుకొనే వీలుంది. 30 మంది విద్యార్థులు నమోదు చేసుకుంటే ఆ స్కూలే ఎగ్జామ్ సెంటర్‌గా ఉంటుంది.
- ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- స్కూలు ద్వారా దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఏదైనా పరీక్ష కేంద్రాన్ని ఎంచుకోవచ్చు.

ముఖ్య తేదీలు

- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 15
- **పరీక్ష ఫీజు:** రూ. 100/-
- ఫీజును ఆన్‌లైన్‌లో లేదా చలానా రూపంలో మాత్రమే చెల్లించాలి.
- **అపరాధ రుసుంతో రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** సెప్టెంబర్ 30
- **పరీక్షతేదీ (ఎంపిక చేసుకోవాలి):** నవంబర్ 24, 30
- **పరీక్ష సమయం:** ఉదయం 11 నుంచి 1 గంట వరకు
- **పరీక్ష ఫలితాల వెల్లడి:** 2019, డిసెంబర్ 15
- **రాష్ట్రస్థాయి క్యాంప్:** 2020, జనవరి 5, 12, 19 (ఏదైనా ఒకరోజు)
- **రెండు రోజుల జాతీయ క్యాంప్:** 2020, మే 16, 17

పూర్తి వివరాలకు వెబ్‌సైట్:
http://vvm.org.in/index.php

వీవీఎం రాష్ట్ర కోఆర్డినేటర్లు

పి. ఆనందం- 9948099462, కందాల రామయ్య - 9948867665, పత్తి సదానందం -9866275101, గుర్రం శ్రీరామ్‌రెడ్డి- 7207276553, అనంత జనార్దన్ - 9440466055

epaper.ntnews.com

ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం వద్దకు ఆదివారం పర్యాటకులను అనుమతించక పోయినప్పటికీ, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనం జలపాతం, చిల్డ్రన్స్‌పార్క్, వాచ్ టవర్ వద్ద సెల్ఫీలు దిగుతూ ఉల్లాసంగా గడిపారు.
-వాజేడు(ములుగు)

ఒడిశా ట్రక్ డ్రైవర్‌కు 86,500 జరిమానా

దేశంలోనే భారీమొత్తం చెల్లించిన తొలివ్యక్తిగా రికార్డు

భువనేశ్వర్: మోటరు వాహన సవరణ చట్టం-2019 దేశవ్యాప్తంగా వాహనదారులను బెంబేలెత్తిస్తున్నది. ఓ లారీ డ్రైవర్‌కు ఒడిశా ట్రాన్స్‌పోర్ట్ అధికారులు ఏకంగా రూ.86,500 జరిమానా విధించారు. కొత్తచట్టం అమలులోకి వచ్చాక అత్యధిక జరిమానా చెల్లించిన వ్యక్తిగా అతడు రికార్డుల్లోకెక్కాడు. ట్రక్ డ్రైవర్ అశోక్ జాదవ్‌కు ఈ నెల మూడున ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ఈ భారీ జరిమానా విధించారు. జరిమానా చలాన్ సోషల్‌మీడియాలో వైరల్‌కావడంతో శనివారం సాయంత్రం విషయంవెలుగులోకి వచ్చింది. అనర్హత వ్యక్తి (సహాయకుడు) లారీ నడిపినందుకు రూ.5,000, లైసెన్స్ లేకుండా డ్రైవ్‌చేసినందుకు రూ.5000, 18 టన్నుల ఓవర్‌లోడ్ ఉన్నందుకు రూ. 56,000, నిబంధనలకు విరుద్ధంగా అధిక పరిమాణ వస్తువుల రవాణాకు రూ.20,000, సాధారణ నిబంధన ఉల్లంఘన కింద రూ.500 ఇలా మొత్తం రూ.86,500 జరినామా విధించినట్టు సంబల్‌పూర్ ప్రాంతీయ ట్రాన్స్‌పోర్ట్ అధికారి లలిత్‌మోహన్ బెహరా తెలిపారు. ఇందులో ట్రక్ డ్రైవర్ రూ.70 వేలు చెల్లించగా, మిగతా 16 వేలు చెల్లించేందుకు అధికారులు అతడికి ఐదుగంటల సమయం ఇచ్చారు. నాగాలాండ్‌లోని బీఎల్‌ఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లారీ.. జేసీబీ మిషన్‌ను రవాణా చేస్తున్నది. ఒడిశాలోని అంగుల జిల్లా తాల్చేర్ పట్టణం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తుండగా సంబల్‌పూర్ వద్ద అధికారులు లారీని తనిఖీచేశారు.

ఆర్టికల్ 371 జోలికి వెళ్లం

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టీకరణ

గువాహటి: ఈశాన్యరాష్ట్రాలకు కొన్ని అంశాల్లో ప్రత్యేకహోదా కల్పించే ఆర్టికల్ 371జోలికి వెళ్లబోమని కేంద్రహోంమంత్రి అమిత్‌షా పునరుద్ఘాటించారు. గువాహటిలో ఆదివారం జరిగిన ఈశాన్య రాష్ట్రాల మండలి 68వ ప్లీనరీ సమావేశానికి హాజరైన ఆయన ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు. ఆర్టికల్ 371 ఒక్క అక్రమవలసదారుడిని కూడా దేశంలోకి రానివ్వదని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి అందిస్తున్న ఆర్టికల్ 370ని తాత్కాలికంగా ఏర్పాటు చేసినందునే దాన్ని రద్దుచేశామని.. కానీ ఆర్టికల్ 371 ఈశాన్య రాష్ట్రాలకు కొన్ని అంశాల్లో ప్రత్యేకఅధికారాలు అందిస్తున్నదని వెల్లడించారు. ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉందని వివరించారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేశాక ఈశాన్యరాష్ట్రాలకు ప్రత్యేకహోదా కల్పించే ఆర్టికల్ 371ని కూడా కేంద్రప్రభుత్వం ఎత్తేస్తుందని విస్తృతప్రచారం జరుగుతున్నదని.. ఇది నిజం కాదని చెప్పారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో కూడా స్పష్టం చేసినట్టు చెప్పారు. మళ్లీ ఇప్పుడు ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రుల ముందు మరోసారి చెప్తున్నానన్నారు. గతంలో ఈశాన్యరాష్ట్రాల్లో ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా, అక్రమ వలసలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగేవని.. కానీ ప్రస్తుతం అభివృద్ధి, మౌలికవసతుల కల్పన జరుగుతున్నాయని చెప్పారు.

వచ్చే ఆదివారం ముగాబే అంత్యక్రియలు

హరారే, సెప్టెంబర్ 8: జింబాబ్వే మాజీ అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే అంత్యక్రియలు వచ్చే ఆదివారం నిర్వహించనున్నారు. శుక్రవారం ఆయన సింగపూర్‌లో మృతిచెందిన విషయం తెలిసిందే. ముగాబే భౌతికకాయాన్ని బుధవారం జింబాబ్వేకు తీసుకురానున్నారు. జింబాబ్వే రాజధాని హరారేలోని విమానాశ్రయంలో ముగాబే పార్థివదేహాన్ని అతడి కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం జింబాబ్వేలోని జెయింట్ స్టేడియంలో ఉంచుతారు. అనంతరం అతడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లనున్నారు. ముగాబే 1980లో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక ప్రజల నుంచి విశేష మద్దతు పొందారు. ఆ తర్వాత ఆర్థికవ్యవహారాల్లో క్రమశిక్షణ లోపించడం, ఎన్నికల్లో రిగ్గింక్‌కు పాల్పడటం తదితర ఆరోపణలతో క్రమేపీ ఆయన ప్రజల మద్దతు కోల్పోయారు. ఇప్పటికి ఆయనను చాలామంది ప్రజలు గొప్పనాయకుడిగా ఆరాధిస్తారు. ముగాబే గొప్పనాయకుడని.. ఆదర్శప్రాయుడని జింబాబ్వే అధ్యక్షుడు మనంగాగ్వా కొనియాడారు.

వంద రోజుల్లో పెనుమార్పులు

- ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నాం
- పలు కీలక బిల్లులు ఆమోదం పొందాయి
- మా విజయాలకు ప్రజల ప్రోత్సాహమే కారణం
- ప్రధాని మోదీ వెల్లడి

ఆదివారం హర్యానాలోని రోహతక్‌లో నిర్వహించిన సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పూలమాల వేస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

రోహతక్, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: తాము రెండోసారి అధికారంలోకి వచ్చాక తొలి వంద రోజుల్లో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నామని ప్రధాని మోదీ చెప్పారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇందులో రైతులకు ప్రయోజనం చేకూర్చే నిర్ణయాలు, జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలు కూడా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. ఈ వంద రోజుల్లో చోటుచేసుకున్న పెను మార్పులకు ప్రజల ప్రోత్సాహం, సహకారమే కారణమని, దేశంలోని 130 కోట్ల మంది ప్రజల ఆశీస్సులతోనే తాము ఈ విజయాలు సాధించామని తెలిపారు. ఆదివారం హర్యానాలోని రోహతక్‌లో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఎన్నో కీలక బిల్లులు ఆమోదం పొందాయి. గత 60 ఏండ్లలో ఇలా బిల్లులు ఆమోదం పొందిన సందర్భాలు లేవు. అలాగే ఈ వంద రోజుల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. దేశాభివృద్ధిలో ప్రభుత్వానికి సహకరించిన పార్టీలకు ధన్యవాదాలు' అని ప్రధాని మోదీ తెలిపారు. కాగా ఈ వంద రోజుల్లో ట్రిపుల్ తలాక్, సమాచార హక్కు చట్టానికి సవరణ, మోటర్ వెహికిల్ చట్టానికి సవరణ లాంటి కీలక బిల్లులను పార్లమెంట్ ఆమోదించింది. అలాగే జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. జాతీయ భద్రతను మరింత పటిష్ఠం చేయడానికి కొన్ని చట్టాలకు సవరణలు చేసింది. సోమవారం కేంద్రమంత్రులు కూడా తమ శాఖలు సాధించిన విజయాలను ప్రకటించే అవకాశముంది.

మోదీ ప్రభుత్వం అభివృద్ధికి పర్యాయపదం: అమిత్ షా

కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం జాతీయ భద్రతకు, అభివృద్ధి, పేదవాడి సంక్షేమానికి పర్యాయపదంగా నిలిచిందని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఓ ఆశాదీపంగా నిలిచిందని తెలిపారు. ఎలాంటి కీలక నిర్ణయాల కోసం ప్రజలు 70 ఏండ్ల నుంచి ఎదురుచూశారో అలాంటి నిర్ణయాలను ప్రధాని మోదీ తీసుకున్నారని పేర్కొన్నారు. వంద రోజుల పాలనను పూర్తి చేసుకున్నందుకు ప్రధాని మోదీకి, సహచర కేంద్రమంత్రులకు అమిత్ షా శుభాకాంక్షలు చెప్పారు. కేంద్ర మంత్రి జవదేకర్ స్పందిస్తూ తాము వంద రోజుల పాలనలో తీసుకున్న నిర్ణయాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా తీసుకోలేదని తెలిపారు. తాము తీసుకున్న నిర్ణయాలు ప్రజల సాధికారతకు, పారదర్శకతకు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతిఇరానీ మాట్లాడుతూ మహిళా సాధికారతకు, చిన్న పిల్లలకు రక్షణ కల్పించడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఇందులో భాగంగా ట్రిపుల్ తలాక్ చట్టాన్ని తీసుకొచ్చామని, చిన్న పిల్లలపై లైంగికదాడులు నివారించడానికి చట్టాన్ని మరింత పటిష్ఠం చేశామని తెలిపారు. అలాగే దేశంలో 8 కోట్ల మందికి ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఒక్కరూపాయికే శానిటరీ ప్యాడ్‌లను అందజేస్తున్నామని పేర్కొన్నారు.

వికాసం లేని వందరోజులు

- బీజేపీ పాలనపై కాంగ్రెస్ విమర్శలు
- అభివృద్ధిరహిత పాలనకు శుభాకాంక్షలంటూ రాహుల్ ట్వీట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: బీజేపీ 100 రోజుల పాలనపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఎలాంటి అభివృద్ధి చేయకుండానే వందరోజులను పూర్తిచేసుకున్నదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. బీజేపీ పాలనలో నాయకత్వ లేమి, దిశానిర్దేశ లేమి, ప్రణాళిక లేని కారణంగా ఆర్థిక వ్యవస్థ నాశనమవుతున్నదని విమర్శించారు. 'వికాసం లేని వంద రోజుల పాలనపై మోదీ ప్రభుత్వానికి శుభాకాంక్షలు' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'ప్రజాస్వామ్యంపై అణచివేత, విమర్శించే మీడియా గొంతునొక్కే చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. నాయకత్వ లేమి, దిశానిర్దేశ లేమి, ప్రణాళిక లేకపోవడం.. ఆర్థికవ్యవస్థ దిగజారడానికి కారణం అవుతున్నది' అని రాహుల్‌గాంధీ ఆదివారం ట్వీట్ చేశారు. మరోవైపు, వందరోజుల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ గాడితప్పిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. దేశ ఆర్థిక పరిస్థితులపై బీజేపీ నోరు మెదపడం లేదని, దీంతో కంపెనీలు ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రామాలు ఆడుతూ, వాస్తవాలను దాచి అబద్ధాలు చెప్తూ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని దాచే ప్రయత్నం చేస్తున్నదని ఆమె ట్విట్టర్‌లో విమర్శించారు. మోదీ పాలన అహంకారం, అనిశ్చితి, ప్రతీకార రాజకీయాలకు నిదర్శనంగా నిలుస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. వీటితోపాటు ఆర్థిక వ్యవస్థ, కశ్మీర్‌లో పరిస్థితులు, అసోంలో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్, ప్రతిపక్ష పార్టీల నాయకులపై దర్యాప్తు సంస్థలు వ్యవహరిస్తున్న తీరు ఇలా అన్ని అంశాలపై విమర్శలు సంధించింది. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కపిల్ సిబాల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో బీజేపీకి వచ్చిన భారీ మెజార్టీ సామాన్యుడికి ఉపశమనం కలిగిస్తుందని భావించగా, జరిగింది మాత్రం అందుకు పూర్తి భిన్నమని అన్నారు. ఈడీ, ఐటీ, సీబీఐలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. సొంత పార్టీ నాయకులకు వ్యతిరేకంగా ఆధారాలు ఉన్నప్పటికీ వారికి ఆశ్రయం కల్పిస్తూ.. ఎలాంటి ఆధారాల్లేక పోయినా ప్రతిపక్ష పార్టీల నాయకులపై చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. బీజేపీ 2.0 తొలి వందరోజుల పాలనను.. దౌర్జన్యం, ఆందోళన, అరాచకం అన్న మూడు పదాలతో వివరించొచ్చని కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో విమర్శించింది.

'నిర్బంధం'లో మౌనరోదన!

- అక్రమ వలసదారుల కోసం ఏర్పాటవుతున్న నిర్బంధ కేంద్రాలు
- ఎన్‌ఆర్సీలో పేర్లు లేని వాళ్లే కూలీలు..
- పొట్టకూటి కోసం కార్మికులుగా మారిన అభాగ్యులు
- ఒక్కో కేంద్రంలో 3000 మందికి వసతి కల్పన
- ఖైదీల కంటే అధ్వానంగా చూస్తారని ఆరోపిస్తున్న మానవ సంఘాలు

అధికారుల వైఫల్యమో.. వారి గ్రహచారమో.. ఏండ్ల నుంచి భారతావనిలో తలదాచుకున్న ఆ అభాగ్యులు రాత్రికి రాత్రి కానివారైపోయారు. దశాబ్దాలుగా నమ్ముకున్న సొంతూరు కాదు పొమ్మంటున్నది. అండగా నిలువాల్సిన సర్కారు నిర్బంధ కేంద్రాల ఏర్పాటులో నిమగ్నమైంది. జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌ఆర్సీ) జాబితాలో లేని ప్రజల హృదయ విదారక పరిస్థితి ఇది..



అసోంలోని గోల్‌పాడా సమీపంలో రూపుదిద్దుకుంటున్న పునరావాస నిర్బంధ కేంద్రం

గోల్‌పాడా(అసోం), సెప్టెంబర్ 8:

అసోం ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎన్‌ఆర్సీ తుది జాబితాలో 19,06,657 మంది తమ పౌరసత్వాన్ని కోల్పోయారు. జాబితాలో చోటు దక్కని వారికి చట్టపరమైన సాయం అందించనున్నట్టు ప్రకటించిన అసోం ప్రభుత్వం మరోవైపు అక్రమ వలసదారులు తమ గుర్తింపును నిరూపించుకోని పక్షంలో వాళ్లను తరలించడం కోసం సామూహిక నిర్బంధ పునరావాస కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నది. ఈ కేంద్రాల ఏర్పాటులో ఇటుకలు, కంకరను మోస్తున్నది కూడా జాబితాలో లేని ప్రజలే కావడం గమనార్హం.

ఒక్క కేంద్రంలో 3,000 మంది

అక్రమ వలసదారుల కోసం అసోంలో మొట్టమొదటి పునరావాస నిర్బంధ కేంద్రం గోల్‌పాడా సమీపంలో రూపుదిద్దుకుంటున్నది. దీని ఏర్పాటు కోసం ఏడు ఫుట్‌బాల్ మైదానాలకు సమానమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. నదీ పరీవాహంలోని దట్టమైన అడవిని కొంతవరకు తొలిగించి ఈ నిర్మాణాన్ని ప్రారంభించారు. పాఠశాల, దవాఖాన, వినోదం కోసం ప్రత్యేక స్థలం, భద్రతా దళాలు ఉండేందుకు క్వార్టర్స్, ఎత్తైన ప్రహరీ గోడ, నిఘా నేత్రాలు ఎల్లప్పుడూ పర్యవేక్షణ సాగించడానికి రెండు ఎత్తైన టవర్లు ఈ కేంద్రంలో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో కేంద్రంలో 3వేల మంది ఉండేలా నిర్మాణం చేపడుతున్నట్టు కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. నిర్బంధ కేంద్రాల నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికుల్లో చాలామంది ఎన్‌ఆర్సీ జాబితాలో లేనివాళ్లేనని వాళ్ళు తెలిపారు.

ఏం చేయాలో తోచడం లేదు

గోల్‌పాడా జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో షఫాలీ హజోంగ్ అనే గిరిజన మహిళ నివసిస్తున్నది. గతవారం ప్రభుత్వం విడుదల చేసిన ఎన్నార్సీ జాబితాలో ఆమె పేరు గల్లంతైంది. జాబితాలో తనతో పాటు పేరు గల్లంతైన 19 లక్షల మందితో కలిసి పోరాటం చేయడానికి షఫాలీ కూడా ప్రయత్నిస్తున్నారు. 'జాబితాలో నా పేరు రాకపోయేసరికి ఆందోళన చెందాను. ఇక్కడికి దగ్గర్లో సర్కారు నిర్బంధ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నదని తెలుసుకొని పనికి కుదిరాను. రోజుకు రూ. 300 వరకు ఇస్తున్నారు. పొట్ట పోసుకోవడానికి ఏదో ఒక పని చేస్తున్నాను. అయితే, భారత పౌరసత్వం నాకు లేదని తెలిశాక చాలా భయపడ్డాను. ఇప్పుడు ఏం చేయాలో తెలియట్లేదు' అని షఫాలీ ఆవేదన వ్యక్తం చేశారు.

ఖైదీల కంటే అధ్వానం

ఎన్నార్సీ జాబితా కారణంగా అసోంలో గత కొన్నేండ్లుగా నివసిస్తున్న ప్రజలు భారత పౌరసత్వాన్నే గాకుండా స్వేచ్ఛను, ప్రాథమిక హక్కులను కోల్పోయారని ఆమ్నెస్టీ ఓ ప్రకటనలో పేర్కొన్నది. గతంలో అక్రమ వలసదారులుగా గుర్తించిన సుమారు 900 మందికి అసోం జైళ్లలో అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జైలులో ఖైదీల కంటే దుర్భర పరిస్థితుల్లో వలసదారులు అక్కడ బతుకీడుస్తున్నట్టు జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు నిర్మిస్తున్న కేంద్రాల్లో ఉండే వారి సౌకర్యాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే, ప్రస్తుతం నిర్మిస్తున్న నిర్బంధ కేంద్రంలో అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నట్టు కాంట్రాక్టర్లు, అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో నిర్బంధ పునరావాస కేంద్రంలో 17 బిల్డింగులు ఉన్నట్టు కాంట్రాక్టర్లు తెలిపారు. ఒక్కో బిల్డింగులో 350 చదరపు అడుగుల విస్తీర్ణం గల 24 గదులు ఉండనున్నట్టు వాళ్లు తెలిపారు.

ప్రజారోగ్యశాఖ పటిష్ఠతకు చర్యలు

- ఏడాదిలో 421 మందికి పదోన్నతులు
- ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆరోగ్య తెలంగాణ సాధించాలన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రజారోగ్యశాఖను పటిష్ఠ పరిచేందుకు క్షేత్రస్థాయి నుంచి చర్యలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వైద్యసేవలను విస్తరించడంపై ఆరోగ్యశాఖ డైరెక్టరేట్ పరిధిలో వినూత్న విధానాలను అవలంబిస్తున్నారు. పల్లెల్లోని పేద కుటుంబాలకు సరైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో అన్ని విభాగాల సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఇందుకుగాను 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో 421 మంది వైద్యసిబ్బంది, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను విస్తృతపరిచి పేదలకు వైద్య విభాగాలు అందుబాటులో ఉండేలాచూశారు. దీంతో ప్రజారోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పరిధిలో వైద్యసేవలు పొందేవారి సంఖ్య ఏటా పెరుగుతున్నది.

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్‌శాఖల్లో పదోన్నతి లభించిన పోస్టుల వివరాలు

పనిచేస్తున్న విభాగం	పదోన్నతిపొందిన విభాగం	సంఖ్య
సివిల్ సర్జన్	మెడికల్, హెల్త్‌సర్వీసెస్ ఏడీ	4
సివిల్ అసిస్టెంట్ సర్జన్/డిప్యూటీ సివిల్ సర్జన్	అడిషనల్ డీపీహెచ్‌వో	4
ఆఫీస్ సబార్డినేట్ (హెచ్‌వోడీ)	జమేదార్	1
ఆఫీస్ సబార్డినేట్ (హెచ్‌వోడీ)	జూనియర్ అసిస్టెంట్	1
జూనియర్ అసిస్టెంట్ (హెచ్‌వోడీ)	సీనియర్ అసిస్టెంట్	5
సీనియర్ అసిస్టెంట్ (హెచ్‌వోడీ)	సూపరింటెండెంట్	1
సూపరింటెండెంట్ (హెచ్‌వోడీ)	అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్	1
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్	అసిస్టెంట్ డైరెక్టర్	4
సీనియర్ అసిస్టెంట్ (జోన్-5)	సూపరింటెండెంట్	12
స్టాఫ్ నర్స్ (జోన్-5)	హెడ్ నర్స్	18
స్టాఫ్ నర్స్ (జోన్-5)	నర్సింగ్ ట్యూటర్	4
హెడ్ నర్స్ (జోన్-5)	నర్సింగ్ సూపరింటెండెంట్	4
ఎంపీహెచ్ఏ (ఫిమేల్) (జోన్-5)	ఎంపీహెచ్ఎస్ (ఫిమేల్)	40
ఎంపీహెచ్ఎస్ (మేల్) (జోన్-5)	ఎంపీహెచ్ఈవో	50
ఏపీఎంవో (జోన్-5)	డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్	30
హెడ్ నర్స్ (జోన్-5)	నర్సింగ్ ట్యూటర్ గ్రేడ్-2	4
హెడ్‌నర్స్ (జోన్-6)	నర్సింగ్ సూపరింటెండెంట్	18
ఎంపీహెచ్ఏ (ఫిమేల్) (జోన్-6)	ఎంపీహెచ్ఎస్ (ఫిమేల్)	70
ఎంపీహెచ్ఎస్ (మేల్) (జోన్-6)	ఎంపీహెచ్ఈవో	65
సీనియర్ అసిస్టెంట్ (జోన్-6)	సూపరింటెండెంట్	31
ఎంఆర్టీ (జోన్-6)	ఎమ్మార్వో	3
ఎంపీహెచ్ఈవో	సీహెచ్‌వో	47
సీనియర్ ఎంటమాలజిస్ట్	డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసర్	2
స్టాటిస్టికల్ ఆఫీసర్	డిప్యూటీ డైరెక్టర్ (వీఎస్)	2
మొత్తం		421

వినాయక నిమజ్జనంలో

అపశృతి

కృష్ణాజిల్లాలో ముగ్గురు యువకుల మృతి

అమరావతి: ఏపీలో వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. గణపతిని నిమజ్జనం చేసేందుకు చెరువులోకి దిగిన ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. ఈ ఘటన కృష్ణా జిల్లా మైలవరం నియోజకవర్గంలోని ఏ కొండూరుతండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. చెరువులో గణపతి విగ్రహం నిమజ్జనంచేసే ప్రదేశం లోతు ఎక్కువగా ఉండటంతో ఈతరాక నీటిలో మునిగి ముగ్గురు యువకులు ప్రాణాలు వదిలారు. మృతులను బాణావత్ గోపాలరావు, భూక్యా శంకర్, భూక్యా చంటిగా గుర్తించారు. ఏ కొండూరు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతికష్టమీద మృతదేహాలను చెరువులో నుంచి వెలికితీశారు. అప్పటివరకు ఎంతోసరదాగా గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న యువకులు మృత్యువాతపడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ధవళేశ్వరం బరాజ్ వద్ద

పెరిగిన నీటిమట్టం

ప్రమాద హెచ్చరికలు జారీచేసిన ఏపీ ప్రభుత్వం

అమరావతి: ఏపీలోని ధవళేశ్వరం బరాజ్ వద్ద నీటిమట్టం ఆదివారం ఒక్కసారిగా 11.75 అడుగులకు పెరుగడంతో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. గోదావరిలో మళ్లీ వరద ఉధృతి అధికమవడంతో 175 గేట్లను ఎత్తి పది లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు. మరోవైపు శబరి నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో విలీన మండలాల్లో రహదారులపైకి నీరు చేరింది. చాలా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దేవీపట్నం మండలంలోని 36 గ్రామాల్లోకి వరద చేరడంతో ముందు జాగ్రత్తచర్యగా అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పాపికొండలు విహారయాత్రను కూడా రద్దుచేశారు.

గర్భిణికి ప్రసవవేదన

- నాటు పడవలో వాగు దాటించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్
- వెంకటాపురం నుంచి ములుగు దవాఖానకు తరలింపు

ఆదివారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం లో గర్భిణిని వాగు దాటిస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(నూగూరు): భారీ వర్షాలతో పొంగుతున్న వాగులోంచి ఓ గర్భిణిని అధికారులు, ప్రజాప్రతినిధులు దవాఖానకు తరలించారు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలం పెంకవాగు గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కుర్సం కాంతమ్మ అనే గర్భిణికి ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో వెంకటపూర్ దవాఖానకు తరలించేందుకు బంధువులు ప్రయత్నించారు. అయితే పొంగిపొర్లుతున్న వాగులోంచి తీసుకెళ్లడం అసాధ్యంగా మారడంతో విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వెంకటాపురం సీఐ శివప్రసాద్ గ్రామానికి వెళ్లి గర్భిణిని వాగు దాటించేందుకు పడవను ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఆలుబాక సర్పంచ్ ఆదిలక్ష్మి, గ్రామస్థుల సాయంతో కాంతమ్మను వాగు దాటించి వెంకటాపురం దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ములుగు ప్రభుత్వం దవాఖానకు తీసుకెళ్లారు.

టీడీపీ నేతలు ఓర్వలేకపోతున్నారు..

ట్విట్టర్‌లో విజయసాయిరెడ్డి

అమరావతి: ఏపీ ప్రభుత్వం పేదవాళ్లు తినగలిగే బియ్యాన్ని పంపిణీచేస్తుంటే టీడీపీ నేతలు ఓర్వలేకపోతున్నారని వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. నాణ్యమైన బియ్యం అందించాలనే ఆశయంతో సీఎం జగన్ శ్రీకాకుళంలో పైలట్ ప్రాజెక్టును ప్రారంభిస్తే.. బియ్యంబస్తాల్లో నీళ్లు పోసి గడ్డకట్టిన బియ్యం ఇచ్చారంటూ ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తున్నారని ఆదివారం ట్విట్టర్‌లో మండిపడ్డారు. మాలోకం, ఆయన టీమ్ సభ్యులు ఉన్మాదంతో రెచ్చిపోతున్నారని ఆయన విమర్శించారు.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామ సమీపంలోని వాగులో పడి హైనా(ఎగోలం) శనివారం రాత్రి మృతిచెందింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పూర్ణచందర్ ఆధ్వర్యంలో అటవీ అధికారులు హైనా మృతదేహానికి పంచనామా చేసి, పోస్టుమార్టం కోసం బెజ్జూరు వెటర్నరీ దవాఖానకు తరలించారు.
-కౌటాల రూరల్ (చింతలమానేపల్లి)

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
సోమవారం 9 సెప్టెంబర్ 2019

రామ్‌చరణ్, చిరంజీవి

రియల్ మెగాస్టార్‌ను చూశాను!

ప్రతి ఒక్కరికి తండ్రి తొలి హీరో. మనమందరం నాన్న చేయిపట్టుకొనే ప్రపంచాన్ని చూస్తాం. తండ్రి విజయాల్ని మన స్ఫూర్తిగా ఆస్వాదిస్తాం. చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ తన తండ్రిలో రియల్ మెగాస్టార్‌ను 'సైరా' సినిమాతోనే చూస్తున్నానని సంతోషపడుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా చారిత్రక కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. ఈ చిత్రానికి రామ్‌చరణ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా మేకింగ్‌కు సంబంధించిన అన్ని పనుల్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు రామ్‌చరణ్. ఈ సందర్భంగా 'సైరా' ఆన్‌లోకేషన్‌కు సంబంధించిన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు రామ్‌చరణ్. నరసింహారెడ్డి గెటప్‌లో ఉన్న చిరంజీవికి సూచనలు ఇస్తూ రామ్‌చరణ్ కనిపిస్తున్నారు. ''సైరా' పాత్రలో నాన్న పరకాయ ప్రవేశం చేశారు. ఆయన అభినయం మాటల్లో వర్ణించలేని గొప్ప అనుభూతిని కలిగిస్తున్నది. నేను నిర్మాతగా మారిన తర్వాతే నిజమైన మెగాస్టార్‌ను చూశాననే భావన కలిగింది' అని వ్యాఖ్యానించారు రామ్‌చరణ్. ప్రస్తుతం ఈ ఫొటో మెగాభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నది. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితగాథ ఆధారంగా 'సైరా' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకుడు. అక్టోబర్ 2న విడుదలకానుంది.

'గల్లీలో సిక్స్ ఎవడైనా కొడతాడు..స్టేడియంలో కొట్టినవాడికే ఓ రేంజ్ ఉంటది'.. ఇటీవల విడుదలైన 'సాహో' సినిమాలోని ఓ డైలాగ్ ఇది. బాలీవుడ్ డ్రీమ్స్‌ను సాఫల్యం చేసుకునే విషయంలో మన కథానాయికలు అదే తరహాలో ఆలోచిస్తున్నారు. దక్షిణాదిన కాస్త గుర్తింపు లభించగానే నాయికలు ముంబయి వైపు దృష్టి పెడుతున్నారు. పాన్ ఇండియా ఇమేజ్‌తో పాటు ఆర్థికంగా కూడా భారీ మొత్తంలో ఆర్జించే అవకాశం ఉండటంతో హిందీ చిత్రసీమలో సత్తా చాటాలని తపిస్తున్నారు. సౌత్‌లో భారీ విజయాలతో దూసుకుపోతున్న అగ్ర నాయికలు సైతం బాలీవుడ్‌ను విస్మరించడం లేదు. గతంలో బాలీవుడ్ తెరపై మెరిసిన కథానాయికలు కూడా తిరిగి రీఎంట్రీ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.

కాజల్ అగర్వాల్

చలో ..బాలీవుడ్!

కీర్తి సురేష్

'మహానటి'తో చిత్రం ద్వారా ఉత్తమ నటిగా జాతీయ అవార్డును కైవసం చేసుకొని దేశవ్యాప్తంగా సినీ ప్రియుల ప్రశంసల్ని సొంతం చేసుకుంది మలయాళీ సోయగం కీర్తిసురేష్. ఈ భామ 'మైదాన్' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తున్నది. భారతీయ ఫుట్‌బాల్‌కు సరికొత్త జవసత్వాలు అందించి స్వర్ణయుగ సృష్టికర్తగా పేరుపొందిన హైదరబాదీ శిక్షకుడు దివంగత సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అజయ్‌దేవ్‌గణ్ టైటిల్ రోల్‌ని పోషిస్తున్నారు. ఈ సినిమాలో ఆయన సతీమణి పాత్రలో కీర్తి సురేష్ నటించనుంది. అభినయపరంగా పరిణితితో కూడిన పాత్ర కావడంతో కీర్తిసురేష్‌ను ఆ క్యారెక్టర్ కోసం ఎంపిక చేసుకున్నామని చిత్రబృంద ం తెలిపింది.

రష్మిక మందన్న

ఇటీవలే ఈ చిత్రం తొలి షెడ్యూల్‌ను పూర్తిచేసుకుంది. ఈ చిత్రం తన బాలీవుడ్ కలలకు నాంది పలుకుతుందని ఆశాభావంతో ఉంది కీర్తి సురేష్.

ఇక సోగకళ్ల కన్నడ కస్తూరి రష్మిక మందన్నకు దక్షిణాదిలో ఉన్న క్రేజ్ అందరికి తెలిసిందే. తెలుగులో 'ఛలో' 'గీత గోవిందం' సినిమాలతో యువతరం కలల రాణిగా భాసిల్లుతోంది ఈ సుందరి. ప్రస్తుతం ఈ భామ తెలుగులో అగ్ర హీరోల సరసన మూడు భారీ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. 'జెర్సీ' హిందీ రీమేక్ ద్వారా రష్మిక మందన్న బాలీవుడ్‌లో అడుగుపెట్టబోతున్నది. షాహిద్‌కపూర్ కథానాయకుడిగా నటించనున్నాడు. 'జెర్సీ' తెలుగు మాతృకకు దర్శకత్వం వహించిన గౌతమ్ తిన్ననూరి..హిందీ రీమేక్‌కు నిర్దేశక బాధ్యతల్ని చేపట్టబోతున్నాడు.

రకుల్‌ప్రీత్‌సింగ్

దక్షిణాదిన ప్రతిభావంతులైన కథానాయికల్లో నిత్యామీనన్ ఒకరు. అనేక ప్రయోగాత్మక పాత్రల్లో తనదైన అభినయంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుందీ మలయాళీ సుందరి. తెలుగు, తమిళం, మలయాళంలో దాదాపు 50 చిత్రాలు చేసిన నిత్యామీనన్ ఇటీవలే విడుదలైన 'మిషన్ మంగళ్' చిత్రం ద్వారా బాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది. ఈ సినిమాలో వర్షాపిళ్లై పాత్రలో అద్భుతాభినయంతో మెప్పించింది. బాలీవుడ్ విమర్శకులు సైతం నిత్యామీనన్ నటనకు ముగ్ధులయ్యారు. ఈ సినిమా విజయంతో బాలీవుడ్‌లో మరిన్ని అవకాశాల కోసం ఎదురుచూస్తున్నది నిత్యామీనన్.

'ఎవరు' సినిమాతో ఇటీవలే తెలుగులో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది రెజీనా. దక్షిణాదిన సుదీర్ఘ కాలంగా కెరీర్‌లో కొనసాగుతున్న ఈ అమ్మడు కమర్షియల్ నాయికగా గుర్తింపు తెచ్చుకుంది. 'ఏక్ లడ్కీకో దేఖాతో ఐసా లగా' చిత్రం ద్వారా హిందీలో పరిచయమైంది. ఈ సినిమాలో స్వలింగ సంపర్కురాలిగా ఆమె సవాలుతో కూడిన పాత్రను పోషించింది. ఈ సినిమా సక్సెస్‌తో బాలీవుడ్‌లో రెజీనాకు మరిన్ని అవకాశాలు రానున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

రీ ఎంట్రీ ప్రయత్నాలు...

కాజల్ అగర్వాల్, పూజాహెగ్డే, తమన్నా, శృతిహాసన్, రకుల్‌ప్రీత్‌సింగ్ వంటి తారలు గతంలో బాలీవుడ్‌లో మెరిసినవారే. అయితే గత కొన్నేళ్లుగా వీరందరూ పూర్తిగా దక్షిణాది సినిమాల మీదనే దృష్టిపెట్టారు. ఇక్కడ వరుస అవకాశాలతో బిజీగా వుంటూ కూడా హిందీ చిత్రసీమలో తిరిగి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని తపిస్తున్నారు. కాజల్ అగర్వాల్ 'ముంబయి సాగా' చిత్రం ద్వారా బాలీవుడ్‌లో రీఎంట్రీ ఇస్తున్నది. 'దో లఫ్జోంకి కహానీ' (2016) తర్వాత హిందీలో ఏ సినిమాలోను నటించలేదు కాజల్ అగర్వాల్. 'ముంబయి సాగా' చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇక తెలుగు చిత్రసీమలో అగ్ర నాయికగా కొనసాగుతున్నది మంగళూరు సుందరి పూజాహెగ్డే. 'మోహెంజోదారో' (2016) చిత్రం ద్వారా ఈ సొగసరి బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పూర్తిగా తెలుగు పరిశ్రమపై దృష్టిపెట్టింది. డీజే, రంగస్థలం, సాక్ష్యం, అరవింద సమేత వీరరాఘవ, మహర్షి సినిమాలతో బిజీగా మారింది. ప్రస్తుతం ఈ వయ్యారి తెలుగులో వాల్మీకి, అలవైకుంఠపురములో..సినిమాల్లో నటిస్తున్నది. 'హౌస్‌ఫుల్-4' చిత్రం ద్వారా పూజా హెగ్డే తిరిగి బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా ఫర్హాద్ సాంజీ దర్శక

తమన్నా

ద్వారా బాలీవుడ్‌లో రీఎంట్రీ ఇస్తున్నది. 'దో లఫ్జోంకి కహానీ' (2016) తర్వాత హిందీలో ఏ సినిమాలోను నటించలేదు కాజల్ అగర్వాల్. 'ముంబయి సాగా' చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇక తెలుగు చిత్రసీమలో అగ్ర నాయికగా కొనసాగుతున్నది మంగళూరు సుందరి పూజాహెగ్డే. 'మోహెంజోదారో' (2016) చిత్రం ద్వారా ఈ సొగసరి బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పూర్తిగా తెలుగు పరిశ్రమపై దృష్టిపెట్టింది. డీజే, రంగస్థలం, సాక్ష్యం, అరవింద సమేత వీరరాఘవ, మహర్షి సినిమాలతో బిజీగా మారింది. ప్రస్తుతం ఈ వయ్యారి తెలుగులో వాల్మీకి, అలవైకుంఠపురములో..సినిమాల్లో నటిస్తున్నది. 'హౌస్‌ఫుల్-4' చిత్రం ద్వారా పూజా హెగ్డే తిరిగి బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా ఫర్హాద్ సాంజీ దర్శకత్వంలో వినోదప్రధానంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

'హిమ్మత్‌వాలా' 'హమ్‌షకల్' వంటి సినిమాల ద్వారా బాలీవుడ్ ప్రేక్షకులకు చేరువైంది పంజాబీ సుందరి తమన్నా. గ్లామర్ నాయికగా దక్షిణాదిన మంచి పాపులారిటీ సంపాదించుకున్న ఈ సొగసరి నాలుగేళ్ల విరామం తర్వాత 'కామోషీ' చిత్రం ద్వారా బాలీవుడ్‌లో రీఎంట్రీ ఇచ్చింది. ఇటీవలే ఈ సినిమా విడుదలైంది. ప్రస్తుతం ఆమె 'బోలే చుడియా' అనే సినిమాలో నటిస్తున్నది. శృతిహాసన్ హిందీలో 'పవర్' అనే చిత్రంలో నటిస్తున్నది. ఇందులో ఆమె పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనుంది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత శృతిహాసన్ హిందీలో నటిస్తున్నది. 'దే దే ప్యార్ దే' సినిమాతో ఇటీవలే బాలీవుడ్‌లో మంచి విజయాన్ని దక్కించుకుంది రకుల్‌ప్రీత్ సింగ్. అంతకు ముందు ఏడాది పాటు బాలీవుడ్‌కు దూరంగా ఉన్నది. ప్రస్తుతం ఆమె 'మర్జావాన్' అనే సినిమాలో నటిస్తున్నది.

...✍ చిత్రం డెస్క్

పట్నం మహేందర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, పులి అమృత్, పాండురంగారావు, శరత్‌కుమార్ తదితరులు

జీవితం ఆట కాదు!

రాఘవసాయి, నాగబాబు, చాణక్య, స్నేహాల్ కామత్, మమతారెడ్డి, దీక్ష నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఖేల్'. 'లైఫ్ ఈజ్ నాట్ ఏ గేమ్' ఉపశీర్షిక. మాన్సీ మూవీస్ పతాకంపై గ్లోబల్ మోషన్ పిక్చర్స్ సమర్పణలో గొట్టిముక్కల పాండురంగారావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్.ఆర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎంఎల్‌సీలు పట్నం మహేందర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి సంయుక్తంగా విడుదలచేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌ను సినీ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు సినిమా చిత్రీకరణలు, నిర్మాణానంతర కార్యక్రమాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల్ని కల్పించి చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆహుతులు పేర్కొన్నారు. వినూత్న కథాంశంతో రూపొందుతున్న 'ఖేల్' సినిమా పెద్ద విజయాన్ని సాధించి చిత్రబృందానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు యు.సత్యనారాయణ, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సాయికిరణ్, వెంకట్ బోనాలతో పాటు పలువురు కీలక పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అమర్ సాధనాల, ఎడిటింగ్: సేవియర్ అలోషియస్, పాటలు: వంశీకృష్ణ, నాగిరెడ్డి లింగారెడ్డి, సంగీతం: ఆనంద్ అవసరాల, సహనిర్మాత: పులి అమృత్‌గౌడ్.


అమితాబ్‌బచ్చన్

ఇరవై ఐదేళ్ల తర్వాత..

బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్‌బచ్చన్ ఇరవై ఐదేళ్ల తర్వాత మరాఠీ చిత్రసీమలో పునరాగమనం చేస్తున్నారు. 'ఏబీ అండ్ సీడీ' అనే చిత్రంలో కీలక పాత్రను పోషించనున్నారు. 1994లో రూపొందిన 'అక్క' అనే మరాఠీ చిత్రంలో భార్య జయాబచ్చన్ సరసన అతిథి పాత్రను పోషించారు అమితాబ్‌బచ్చన్. పాతికేళ్ల అనంతరం మరాఠీలో 'ఏబీ అండ్ సీడీ' సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమాలో తన నిజజీవిత పాత్రలోనే అమితాబ్‌బచ్చన్ కనిపించనున్నారు. వినోదప్రధాన కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో విక్రమ్ ఘోఖలే కీలక పాత్రను పోషిస్తున్నారు. మిలింద్ లేలే ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

పూజా హెగ్డే

epaper.ntnews.com